PRAJASAKTI Regd.No. 15795/68
సిటీ

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 45 సంచిక : 18 | విజయవాడ, సోమవారం 18 ఆగస్టు 2025 | 6 + 8 పేజీలు వెల : 5.50
Vol No | Vijayawada, Monday 18 August 2025 | Rs

న్యూయార్క్ క్లబ్‌లో కాల్పులు

- ముగ్గురు మృతి
- 8 మందికి గాయాలు

5



అల్కరాస్, సినర్ సై

సిన్సినాటి ఓపెన్ ఫైనల్లో ఢీకి రంగం సిద్ధం

సెమీస్‌లో టాప్ అథ్లెట్ల అలవోక విజయాలు

6

బహిరంగ సభలో మాట్లాడుతున్న ఎంఎ బేబీ

పోలవరం నిర్వాసితుల సమస్యలు
జాతీయ స్థాయికి

రామవరం బహిరంగ సభలో సిపిఎం ప్రధాన కార్యదర్శి ఎం.ఎ.బేబీ ప్రకటన

చట్టసభల్లో ప్రస్తావించని టిడిపి, వైసిపి ఎంపీలు : జాన్ బ్రిట్టాస్

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

పోలవరం నిర్వాసితుల సమస్యలను జాతీయ స్థాయికి తీసుకెళ్లనున్నట్లు సిపిఎం ప్రధాన కార్యదర్శి ఎంఎ బేబీ ప్రకటించారు. నిర్వాసితుల సమస్యలు తెలుసుకోవడమే లక్ష్యంగా రెండు రోజుల పాటు పోలవరం ముంపు, పునరావాస కాలనీల్లో సిపిఎం బృందం పర్యటించింది. స్థానికులతో మాట్లాడింది. వారిని చైతన్యపరిచింది. ఈ పర్యటనలో భాగంగా ఆదివారం విఆర్.పురం మండలం రామవరంలో జరిగిన బహిరంగ సభలో బేబీ మాట్లాడారు. అంతకుముందు తమ గ్రామానికి వచ్చిన సిపిఎం బృందానికి స్థానిక మహిళలు హారతులు ఇచ్చి స్వాగతం పలికారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సమస్యల పరిష్కారంకోసం నిర్వాసితులు చేసే ప్రతి పోరాటానికి సిపిఎం మద్దతు ఇస్తుందని చెప్పారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు పోలవరం నిర్వాసితుల సమస్యలపై ఎందుకు దృష్టి సారించడం లేదని ప్రశ్నించారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం, రాష్ట్రంలోని గత వైసిపి, ప్రస్తుత టిడిపి ప్రభుత్వాలు నిర్వాసితులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ఘోరంగా విఫలమయ్యాయని చెప్పారు. నిర్వాసితుల పునరావాస కాలనీల్లో ఎక్కడ చూసినా నాసిరకం నిర్మాణాలే కనిపించాయన్నారు. వాటిని పూర్తి చేసి మూడు నాలుగేళ్లు గడవక ముందే వర్షం నీరు లీకవడంతో బరకాలు కట్టుకుని ప్రజలు కాపురాలు ఉంటున్న దృశ్యాలు తమకు కనిపించాయన్నారు. పోలవరం నిర్మాణానికి రూ.55 వేల కోట్లతో డిపిఆర్ రూపొందించగా కేంద్ర ప్రభుత్వం రూ.22 వేల కోట్లు మాత్రమే విడుదల చేసిందని, వాటిలో గత, ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వాలు పునరావాసానికి కేవలం రూ.7 వేల కోట్లు మాత్రమే ఖర్చు చేశాయన్నారు. వాటిలో అత్యధిక భాగం రాజకీయ పెద్దలు, అధికారులు, కాంట్రాక్టర్లు కుమ్మక్కయి లూటీ చేసినట్లు అర్థమవుతోందన్నారు. తక్షణమే దీనిపై విచారణ జరిపి అక్రమార్కులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి భూములు త్యాగం చేసిన నిర్వాసితులకు నైపుణ్య శిక్షణ కల్పించి ఉపాధి కల్పించేందుకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అప్పటివరకు కనీసం ఉపాధి పనులైనా అన్ని గ్రామాల్లో కల్పించాలని కోరారు. పోలవరం, ఇతర పనులలో నిర్వాసితుల కుటుంబాలకు ఉపాధి చూపాలన్నారు. నిర్వాసితులకు ఎకరాకు రూ.20 లక్షల చొప్పున పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. రానున్న కాలంలో నిర్వాసితుల పక్షాన పోరాటాన్ని ఉధృతం చేస్తామన్నారు. సిపిఎం రాజ్యసభ ఫ్లోర్ లీడర్ జాన్ బ్రిట్టాస్ మాట్లాడుతూ పోలవరం నిర్వాసిత కాలనీలను మిగతా 5లో

ఎన్‌డిఎ ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా
సిపి రాధాకృష్ణన్

న్యూఢిల్లీ : కేంద్రంలో అధికారంలో ఉన్న నేషనల్ డెమొక్రటిక్ అలయన్స్ (ఎన్‌డిఎ) పక్షాన ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా తమిళనాడుకు చెందిన సిపి రాధాకృష్ణన్‌ను బరిలో నిలుపనున్నట్లు బిజెపి జాతీయ అధ్యక్షులు జెపి నడ్డా ప్రకటించారు. ఈ మేరకు బిజెపి పార్లమెంటరీ బోర్డు సమావేశంలో నిర్ణయం తీసుకున్నట్లు నడ్డా పేర్కొన్నారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం..ఢిల్లీలో మంగళవారం నిర్వహించనున్న ఎన్‌డిఎ పార్లమెంటరీ పార్టీ సమావేశానికి రాధాకృష్ణన్‌ను హాజరయ్యే అవకాశముంది. రాధాకృష్ణన్ ప్రస్తుతం మహారాష్ట్ర గవర్నరుగా ఉంటున్నారు. తమిళనాడులో ఆర్‌ఎస్‌ఎస్ నేతగా విశేష గుర్తింపు ఉన్న చంద్రపురం పొన్నుస్వామి రాధాకృష్ణన్ 1957 మే 4న జన్మించారు. ఆర్‌ఎస్‌ఎస్, భారతీయ జనసంఘ్‌తో రాజకీయాల్లోకి వచ్చిన ఆయన కోయంబత్తూరు లోక్‌సభ స్థానం నుంచి రెండు పర్యాయాలు బిజెపి తరపున ఆయన ఎంపీగా ఎన్నికయ్యారు. బిజెపి తమిళనాడు రాష్ట్ర అధ్యక్షునిగానూ పనిచేశారు. 2016-2019 వరకు ఆల్ ఇండియా కాయర్ బోర్డు ఛైర్మన్‌గా పనిచేశారు. 2023 ఫిబ్రవరి 18 నుంచి ఝార్ఖండ్ గవర్నరుగా బాధ్యతలు చేపట్టారు. గతంలో తెలంగాణతో పాటు పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్‌గానూ ఆయన అదనపు బాధ్యతలు నిర్వహించారు. ప్రస్తుతం మహారాష్ట్ర గవర్నర్‌గా ఉన్నారు. పార్లమెంటు వర్షాకాల సమావేశాలకు ఒక రోజు ముందుగా అనూహ్య పరిణామాల నేపథ్యంలో ఉపరాష్ట్రపతి పదవికి జగదీశ్ ధన్కర్ రాజీనామా చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో జరగనున్న ఉపరాష్ట్రపతి ఎన్నికలకు ఈ నెల 7న ఎన్నికల సంఘం నోటిఫికేషన్ జారీ చేసింది. ప్రతిపక్ష 'ఇండియా' వేదిక కూడా అభ్యర్థిని ప్రకటించే వీలుంది. సెప్టెంబరు 9న ఎన్నికలు జరగనున్నాయి.

విశాఖ ఉక్కుకు
'ప్రైవేటు' పోటు

- ఒకే రోజు 12 విభాగాలకు టెండర్లు
- మాట నిలుపుకోని టిడిపి కూటమి ప్రభుత్వం

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

'మేం అధికారంలోకి వస్తే ప్రైవేటీకరణ జరగకుండా అడ్డుకుంటాం.' విశాఖ నగర ప్రజానీకానికి, ఉక్కు కార్మికులకు టిడిపి కూటమి నేతలు ఇచ్చిన హామీ ఇది! కానీ ఇప్పుడు జరుగుతున్నది వేరు! రాష్ట్ర ప్రజల ఆత్మగౌరవానికి చిహ్నమైన విశాఖ ఉక్కును ముక్కలు, ముక్కలుగా చేసి ఏ భాగానికి ఆభాగం ప్రైవేటుకు అప్పచెప్పే కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ కుట్ర యధావిధిగా కొనసాగుతోంది. దీనిలో భాగంగా ఒకే రోజు 12 విభాగాలను ప్రైవేటు పరం చేస్తూ స్టీల్ ప్లాంటు యాజమాన్యం టెండర్లు పిలిచింది. ఆదివారం చోటు చేసుకున్న ఈ పరిణామం కలకలం రేపింది. రాష్ట్ర ప్రజలను మాటలతో మభ్య పరుస్తూ, ఆచరణలో కేంద్రం అడుగులకు మడుగులొత్తుతున్న టిడిపి కూటమి నేతల తీరుకు ఇది నిదర్శనమన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

శనివారం నుండే....

వాస్తవానికి ఈ ప్రక్రియ శనివారం ప్రారంభమైంది. ఉక్కు ఫ్యాక్టరీలోని 210 మెగావాట్ల కేప్టివ్ పవర్ ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేసేందుకు యాజమాన్యం శనివారం టెండర్లు పిలిచింది. తమ ఆసక్తిని వ్యక్తీకరిస్తూ (ఎక్స్‌ప్రెషన్ ఆఫ్ ఇంట్రెస్ట్ - ఇఒఐ) ప్రైవేటు ఆపరేటంర్లు సెప్టెంబర్ 9వ తేదిలోపు తమ దరఖాస్తులు దాఖలు చేయాలని ఈ నోటిఫికేషన్‌లో కోరింది. దీనిని కార్మికులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. వారిలో చర్చ సాగుతుండగానే 24 గంటలు గడవకముందే తాజా నోటిషికేషన్ విడుదలైంది. దీనిలో ఏకంగా 12 విభాగాలను ప్రైవేటీకరించడానికి నిర్ణయించడం. వాటిలోని 32 అంశాలను నోటిఫికేషన్‌లో ప్రస్తావించడం కలకం రేపింది. ?ర్మల్ పవర్ ప్లాంట్(టిపిపి), ఎస్ఎంఎస్ - 1, 2, 3, ఎంఎంఎస్ఎం, ఎస్‌బిఎం (స్పెషల్ బార్ మిల్), డబ్ల్యుఆర్ఎం (వైర్ రాడ్ మిల్) 1, 2, 6 విభాగాలు, మాదారం మైన్స్, రోల్ షాప్ అండ్ రిపేర్

షాప్ - 1, 2, 8, సెంట్రల్ మిషన్ షాప్ (సిఎంఎస్), ఫౌండ్రీ, ఎస్‌టిఎం, ఇఎన్ఎండి, బ్లాస్ట్ ఫర్నేస్ 1, 2, 3 తదితర విభాగాలను మాజమాన్యం నోటిఫికేషన్‌లో పేర్కొంది. సెప్టెంబర్ 9 మధ్యాహ్నం 3 గంటలలోపు ఈ టెండర్లకు ఆసక్తిగలవారు దరఖాస్తు చేసుకోవాలని, మరుసటి రోజు మధ్యాహ్నం 3 గంటల తరువాత వీటిని తెరుస్తామని యాజమాన్యం తెలిపింది. ఈ ప్రక్రియ పూర్తయితే, ఈ విభాగాలన్నీ పూర్తిగా ప్రైవేటు పరం అవుతాయని కార్మికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే ఆర్ఎంహెచ్‌పి, సింటర్ ప్లాంట్ మెయింటెనెన్స్‌ను ప్రైవేటీకరణ చేసేందుకు నిర్ణయం తీసుకుని టెండర్లను పిలిచిన విషయం తెలిసిందే. తాజాగా ప్లాంట్‌కు అత్యంత ముఖ్యమైన క్యాప్టివ్ పవర్ ప్లాంట్‌ను, థర్మల్ పవర్ ప్లాంట్‌లోని కోల్ హేండ్లింగ్ యూనిట్‌ను కూడా ప్రైవేటీకరణ చేసేందుకు ఉక్కు యాజమాన్యం సిద్ధమైన విషయం తెలిసిందే.

ఇఒఐ పేరుతో స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపాలి : సిపిఎం

ఇఒఐ పేరుతో విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు కేంద్ర ప్రభుత్వం మరోసారి సిద్ధపడిందని, తక్షణం ఆ ప్రక్రియను ఆపాలని సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు.

అంబేద్కర్ కోనసీమ జిల్లా ఉప్పలగుప్తంలో నీటి మునిగిన వరి నాట్లు

కోస్తా జిల్లాల్లో కుండపోత

- లోతట్టు ప్రాంతాలు జలమయం
- స్తంభించిన జనజీవనం
- ముంపునకు గురైన పంట పొలాలు
- నేడు బంగాళాఖాతంలో వాయుగుండం
- మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్లరాదని హెచ్చరిక

ప్రజాశక్తి- యంత్రాంగం

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో ఉత్తరాంధ్ర, ఉభయగోదావరి జిల్లాల్లో పలు చోట్ల భారీ వర్షాలు కురిశాయి. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పలు ప్రాంతాల్లో జలజీవనం స్తంభించింది. వరి పొలాలు ముంపునకు గురయ్యాయి. బంగాళాఖాతంలో సోమవారం వాయుగుండం ఏర్పడే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్లరాదని హెచ్చరించింది. శ్రీకాకుళం జిల్లాలో ఆదివారం 11.3 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదైంది. గారలో 32.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. విజయనగరం జిల్లా వ్యాప్తంగా ఎడతెరిపి లేకుండా వర్షాలు కురిశాయి. తీరప్రాంతంలోని భోగాపురం, పూసపాటిరేగ మండలాలతోపాటు విజయనగరం, శృంగవరపుకోట, గజపతినగరం, రాజాం, చీపురుపల్లి నియోజకవర్గాల్లో భారీ వర్షం కురిసింది. పార్వతీపురం మన్యం జిల్లాలో వర్షాలు పడుతున్నాయి. ఒడిశాలో కురుస్తోన్న వర్షాలతో నాగావళి నది ఉధృతంగా ప్రవహిస్తోంది. ఎడతెరిపిలేని వర్షాలకు అంబేద్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురంలో జనజీవనం స్తంభించింది. ఉప్పలగుప్తంలో 500 ఎకరాల్లో వరి నాట్లు నీట మునిగాయి. కాకినాడ జిల్లా గొల్లప్రోలులో లోతట్టు ప్రాంతాలు జలమయ్యాయి. పశ్చిమగోదావరి, ఏలూరు జిల్లాల్లో ఏకధాటిగా కురిసిన వర్షానికి జనజీవనం స్తంభించింది. ఆచంట మండలంలోని ఆచంట, కొడమంచిలి, పెదమల్లం, కోడేరు, కరుగోరుమిల్లి, కందరవల్లి, భీమలాపురం, వల్లూరు, పెనుమంచిలి, ఆచంట వేమవరం గ్రామాల్లో ఆవాసాల మధ్యలో నీరు చేరింది. ఏలూరులో మార్కెట్ ప్రాంతాలు వర్షపు నీటితో బురద చెరువుల్లా మారాయి. విశాఖ నగరంలోని ఓల్డ్ టౌన్ ప్రాంతంలోని లోతట్టు ప్రాంతాలు నీటి ముంపునకు గురయ్యాయి. కొబ్బరితోట, జ్ఞానాపురం కాలనీ, ప్రసాద్ గార్డెన్స్ ప్రాంతాల్లో పలు ఇళ్లలోకి వర్షపు నీరు చేరింది. గడిచిన 24 గంటల్లో (ఆదివారం సాయంత్రం ఐదు గంటలకు) విశాఖ కాపులుప్పాడలో 144 మిల్లీమీటర్లు, పరదేశీపాలెంలో 129 మిల్లీమీటర్లు, మధురవాడలో 122 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదైంది.

పిడుగుపాటుకు 30 గొర్రెలు మృతి

అనకాపల్లి జిల్లాలోని అన్ని మండలాల్లోనూ విస్తారంగా వర్షాలు కురిశాయి. నర్సీపట్నం-చింతపల్లి రహదారిపై చింత చెట్టు కూలింది. చోడవరం మండలం దుడ్డుపాలెంలో పిడుగుపాటుకు 30 గొర్రెలు మృతి చెందాయి. అల్లూరి సీతారామరాజు జిల్లా హుకుంపేట, డుంబ్రిగుడ మండలాలు సహా పలు ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. తిరుపతి జిల్లాలో చిరుజల్లులు పడుతూనే ఉన్నాయి. వరుస సెలవులతో తిరుమల కొండ కిక్కిరిసింది. చిరుజల్లులు, చలి వాతావరణంతో యాత్రికులు ఇబ్బందులు పడ్డారు. బయట తిరగలేక గదులకే పరిమితమయ్యారు.

నేడు కోస్తాలో అతి భారీ వర్షాలు : విపత్తుల నిర్వహణ సంస్థ

ఉపరితల ఆవర్తనం ప్రభావంతో ఉత్తరాంధ్ర, దక్షిణ ఒడిశా తీరాలకు ఆనుకుని ఉన్న పశ్చిమ మధ్య, వాయువ్య బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం పశ్చిమ వాయువ్య దిశగా కదులుతూ సోమవారం వాయుగుండంగా మారి బలపడే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం మధ్యాహ్నానికి దక్షిణ ఒడిశా-ఉత్తరాంధ్ర తీరాలను దాటే అవకాశం ఉందని వెల్లడించారు. తీరం వెంబడి గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీచే అవకాశం మిగతా 5లో

ఓట్ల చోరీ కుట్రలు సాగనివ్వం

- బీహార్ సభలో కాంగ్రెస్ నేత రాహుల్ ఉద్ఘాటన
- ఓటర్ అధికార్ యాత్ర ప్రారంభం

అభివాదం చేస్తున్న రాహుల్ గాంధీ

న్యూఢిల్లీ/పాట్నా : అనైతిక, అక్రమ విధానాల్లో ఓట్లను దొంగలించి ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసే కుట్రలను ప్రతిపక్షాలతో కూడిన 'ఇండియా' ఫ్రంట్ సాగన్విబోదని కాంగ్రెస్ సీనియర్ నేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఉద్ఘాటించారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపితో కుమ్మక్కై, ఎన్నికల సంఘం (ఇసి) ఓట్లను దొంగలిస్తోందని, ఈ సంగతి ఇప్పుడు దేశ ప్రజలందరికీ తెలిసిపోయిందని ఆయన మరోమారు తీవ్ర విమర్శలు గుప్పించారు. అయితే ఈ కుట్రలో వాళ్లను 'ఇండియా' నెగ్గనివ్వదని పేర్కొన్నారు. బీహార్‌లో చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ ద్వారా ఓటరు జాబితాల్లోకి ఓటర్లను కలిపి, తీసివేసి బీహార్ అసెంబ్లీ ఎన్నికలనూ ఓట్లను తస్కరించాలని ఇసి, బిజెపి కుట్ర పన్నాయని ఆయన వివరించారు. బీహార్‌లో 'ఓటర్ అధికార్ యాత్ర'ను ఆయన ఆదివారం ప్రారంభిం చారు. 16 రోజులపాటు 25 జిల్లాల్లో 1,300 కిమీ పరిధిలో ఈ యాత్ర సాగనుంది. యాత్ర ప్రారంభోత్సవం సందర్భంగా బీహార్‌లోని ససారంలో నిర్వహించిన సభలో రాహుల్ ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జాతీయ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే, ఆర్‌జెడి అధినేత లాలూప్రసాద్ యాదవ్, తేజస్వీ యాదవ్, సిపిఐ (ఎంఎల్) లిబరేషన్ నాయకులు దీపాంకర్ భట్టాచార్య తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ ధ్వంసానికి ఆర్‌ఎస్‌ఎస్, బిజెపి యత్నం

పేదల చేతిలో ఉన్న ఏకైక శక్తి ఓటు హక్కు అని, దాన్ని పేదలకు దూరం కాకుండా చూస్తామని రాహుల్ తెలిపారు. భారత రాజ్యాంగాన్ని ధ్వంసం చేసేందుకు ఆర్‌ఎస్‌ఎస్, బిజెపి యత్నిస్తున్నాయని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశ రాజ్యాంగాన్ని పరిరక్షించేందుకే 'ఓటర్ అధికార్ యాత్ర'ను ప్రారంభించామని వెల్లడించారు. యావత్ దేశంలో అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల సందర్భంగా ఓట్ల చోరీ జరిగిందన్నారు.

బిజెపికి గెలుపునకు కారణమదే..

ప్రతీ ఎన్నికలోనూ బిజెపి గెలుస్తోందని, ఇందుకు కారణం ఓటర్ల జాబితాలో చేసిన అక్రమ మార్పులు, చేర్పులేనని రాహుల్ ఆరోపించారు. మహారాష్ట్రలో ఒపీనియన్ పోల్స్ అన్నీ కూడా మిగతా 5లో

వికలాంగ విద్యార్థులకు ఇంటర్ మెమోలో 5 సబ్జెక్టులు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

వికలాంగ విద్యార్థులకు ఇంటర్మీడియట్‌లో ఐదో సబ్జెక్టును మెమోలో చేర్చేలా రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేసింది. ఇందుకు సంబంధించిన జిఓ 266ను పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ ఆదివారం విడుదల చేశారు. ఇంటర్‌లో వికలాంగ విద్యార్థులకు ప్రథమ లేదా ద్వితీయ భాషా సబ్జెక్టులో ఇంగ్లీష్‌కు మినహాయింపు ఉంటుంది. అయితే ఐఐటి, ఎన్ఐటి, నీట్ వంటి కోర్సుల్లో ప్రవేశాలు పొందే విద్యార్థులు ఇంగ్లీష్‌ను ఎంచుకోవాలి. రాష్ట్ర ఇంటర్మీడియట్ బోర్డు మెమోలో భాషా సబ్జెక్టుల కాలమ్ వద్ద ఇ (మినహాయింపు) అనే పేరుతో జారీ చేయడంతో విద్యార్థులు నష్టపోతున్నారు. గతేడాది జెఇఇ అడ్వాన్స్‌డ్ పరీక్షలు రాసిన 25 మంది విద్యార్థులకు 'ఇ'కు బదులు 35 మార్కులు ఇవ్వాలని అధికారులకు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆదేశాలిచ్చారు. ఇటీవల తిరుపతికి చెందిన హరిహర బ్రహ్మారెడ్డి నీట్‌లో వికలాంగ విభాగంలో 1,174వ ర్యాంకు సాధించారు. బ్రహ్మారెడ్డికి కూడా 35 మార్కులతో ఇవ్వాలని మంత్రి ఆదేశాలు జారీ చేశారు. ఇక ముందు జారీ చేసే మెమోలో ఒక భాషా సబ్జెక్టుతో పాటు, జూవాలజీ, ఫిజిక్స్, కెమెస్ట్రీ సబ్జెక్టులతో మెమో ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

శుభాన్షు శుక్లాకు ఘనస్వాగతం

న్యూఢిల్లీ : అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్)కు చారిత్రాత్మక పర్యటన తరువాత భారత వ్యోమగామి శుభాన్షు శుక్లా ఆదివారం స్వదేశానికి సురక్షితంగా తిరిగివచ్చారు. ఆక్సియం-4 మిషన్ శిక్షణ కోసం గత ఏడాది కాలంగా శుక్లా అమెరికాలో ఉన్నారు. ఢిల్లీ విమానాశ్రయంలో కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్, ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖగుప్తా, ఇస్రో ఛైర్మన్ వి.నారాయణన్ శుక్లాకు స్వాగతం పలికారు. శుక్లా బ్యాకప్ వ్యోమగామి ప్రశాంత్ బాలకృష్ణన్ నాయర్ కూడా ఆదివారం స్వదేశానికి తిరిగి వచ్చారు. శుక్లా త్వరలో ప్రధానమంత్రి మోడీని కలుసుకున్న తరువాత తన స్వస్థలమైన లక్నోకు వెళ్లనున్నారు. అయితే ఈ నెల 22, 23 తేదీల్లో జరగనున్న జాతీయ అంతరిక్ష దినోత్సవ వేడుకల్లో పాల్గొనడానికి ఢిల్లీకి మళ్లీ శుక్లా తిరిగిరానున్నారు. జూన్ 25న నిర్వహించిన ఆక్సియం-4 మిషన్‌లో భాగంగా ఐఎస్ఎస్‌లో శుక్లా విధులు నిర్వహించారు. జూలై 15న భూమికి తిరిగివచ్చారు. రాకేష్ శర్మ తరువాత అంతరిక్షయానం చేసిన రెండో భారతీయుడిగా శుభాన్షు శుక్లా రికార్డుల్లో నిలిచారు.

కరేడు @ 50 రోజులు

- నేడు 'చలో'కు రైతు, ప్రజా సంఘాల పిలుపు
- అడ్డుకోవడానికి ప్రభుత్వయత్నం
- గ్రామాన్ని దిగ్బంధించిన పోలీసులు, ముందస్తు అరెస్టులు
- అడుగడుగునా ఉద్రిక్తత...ఉత్కంఠ

ప్రజాశక్తి -నెల్లూరు ప్రతినిధి

కార్పొరేట్లకోసం చేపట్టిన విచ్చలవిడి భూసేకరణకు వ్యతిరేకంగా నెల్లూరు జిల్లా కరేడు ప్రజానీకం చేపట్టిన పోరాటం నేటి (సోమవారం)కి 50 రోజులకు చేరుకోనుంది. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని పోరాడుతున్న కరేడు ప్రజానీకానికి సంఘీభావం తెలిపేందుకు వివిధ రైతు సంఘాలు, ప్రజాసంఘాలు సోమవారం చేపట్టిన 'చలో కరేడు' కార్యకమాన్ని అడ్డుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైంది. దీనిలో భాగంగా పోలీసులు ఆ కార్యక్రమానికి అనుమతులు లేవని ప్రకటించారు. ఇప్పటికే అమలులో ఉన్న 30వ సెక్షన్‌తో పాటు, 144వ సెక్షన్‌ను ప్రకటించారు. కరేడు గ్రామానికి వెళ్లే మూడు ప్రధాన రహదారులను దిగ్బంధించారు. బయట వ్యక్తులను ఎవరినీ లోనికి అనుమతించడం లేదు. మరోవైపు గ్రామంలో పర్యటిస్తామని, స్థానికులతో మాట్లాడుతామని, సంఘీభావం ప్రకటించేదుకు సభను నిర్వహిస్తామని రైతు, ప్రజా సంఘాలు ప్రకటించాయి. కరేడు గ్రామస్తులు కూడా సభను నిర్వహించేందుకు సహకరించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. స్థానిక శివాలయం వద్ద సభకు ఏర్పాట్లు కూడా ప్రారంభించారు. అయితే, వీరి విజ్ఞప్తులను ఏమాత్రం పట్టించుకోని పోలీసులు ముందస్తు అరెస్టులు ప్రారంభించడంతో స్థానికంగా ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. ఉద్యమానికి నాయకత్వం వహిస్తున్న రైతు సంఘం జిల్లా కార్యదర్శి మూలి వెంగయ్యను ఉలవపాడులో ఆదివారం అరెస్ట్ చేశారు. స్థానిక సిపిఎం నాయకులు జివిబి కుమార్ శింగరాయకొండ లో ఉండగా అక్కడకు వెళ్లి పోలీసులు అరెస్ట్ చేశారు. పలువురు నాయకులతో పాటు, భూ సేకరణ వ్యతిరేక పోరాటంలో చురుకుగా పాల్గొంటున్న పలువురి పైనా పోలీసులు నిఘా పెట్టారు. వీరిలో పలువురిని ఆదివారం రాత్రి అదుపులోకి తీసుకోవడమో, హౌస్ అరెస్ట్ చేయడమో మిగతా 5లో

గోదావరికి భారీగా వరద

- భద్రాచలం వద్ద 35 అడుగులు

2

చరిత్రను వక్రీకరించేందుకే పాఠ్యాంశాల తొలగింపు

- 'పాఠ్యాంశాలు మార్చినంత మాత్రాన సత్యం మారిపోతుందా' సదస్సులో వక్తలు

2

మా పని మేము చేసుకుపోతాం !

- ఎస్ఐఆర్‌ను సమర్థించుకున్న సిఇసి జ్ఞానేష్ కుమార్
- ఇతర రాష్ట్రాల్లో అమలుపై తగిన సమయంలో నిర్ణయం

5

ఇంటర్ స్టేట్ సర్వీసులకు 'స్త్రీ శక్తి' : ఐద్వా డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఇంటర్ స్టేట్ సర్వీసులకు స్త్రీ శక్తి పథకాన్ని అమలు చేయాలని ఐద్వా రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఇతర రాష్ట్రాల సర్వీసుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం అనుమతించనందున సరిహద్దు జిల్లాల మహిళలు ఈ పథకం ప్రయోజనాలు పొందలేకపోతున్నారని ఐద్వా రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు బి ప్రభావతి, డి రమాదేవి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రంపచోడవరం, ఏలూరు జిల్లాల ఏజెన్సీ మహిళలతోపాటు రాయలసీమ జిల్లాలకు చెందిన మహిళలు ఈ ఉపథకానికి దూరమవుతున్నారని వెల్లడించారు. దీనిని సరిదిద్దాలని, తక్షణం ముంపు మండలాలకు ఇంటర్ స్టేట్ బస్సుల్లో ఉచిత ప్రయాణాన్ని అనుమతించాలని కోరారు. నాన్ స్టాప్, డీలక్స్ బస్సుల్లో ఉచిత పథకం వల్ల మహిళలు ఫలితం పొందగలుగుతారన్నారు. వివిధ ఆలయాలకు వెళ్లే బస్సులు కూడా ఉచిత పథకానికి అనుమతించక పోవడం సరికాదని పేర్కొన్నారు. మహిళలకు అందుబాటులో ఉండేలా ఉచిత బస్సు పథకాన్ని అమలు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

20న ఉద్యోగ సంఘాలతో జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ప్రభుత్వ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ఈ నెల 20న మధ్యాహ్నం 3 గంటలకు జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ (స్టేట్ లెవల్) సమావేశం ఏర్పాటు చేయనుంది. ఈ మేరకు సిఎస్ విజయానంద్ గుర్తింపు పొందిన ఉద్యోగ సంఘాలకు ఆహ్వానాలు పంపారు. సమావేశంలో ఉద్యోగ సంఘాల నుంచి అందే వినతులను అధికారులు ప్రభుత్వానికి అందజేయనున్నారు. కౌన్సిల్ సమావేశంలో ఉద్యోగ సంఘాలు ముఖ్యంగా పిఆర్‌సి లేదా ఐఆర్ గురించి బలంగా అడగనున్నట్లు తెలిసింది. వీటితోపాటు మెడికల్ రీయంబర్స్‌మెంట్ బిల్లులు, పిఎఫ్ లోన్లు, సిపిఎస్ రద్దు, ఉద్యోగులకు ఇంటి స్థలాలు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ప్రభుత్వ పథకాలు వర్తింపుతోపాటు పలు ఆర్థిక విషయాలను ఉద్యోగ సంఘాల ప్రతినిధులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లనున్నారు.

'అనంత' ఎంఎల్ఎ వ్యాఖ్యల దుమారం

- ఎన్‌టిఆర్ అభిమానుల నిరసన
- ఆ మాటలు నావికావు, మార్ఫింగ్ అన్న ఎంఎల్ఎ

ప్రజాశక్తి - అనంతపురం ప్రతినిధి

జూనియర్ ఎన్‌టిఆర్ వార్-2 సినిమా ఆడనివ్వబోనంటూ అనంతపురం అర్బన్ ఎంఎల్ఎ దగ్గుపాటి వెంకటప్రసాద్ చేసిన వ్యాఖ్యలు పెద్ద దుమారం రేపాయి. టిఎన్ఎస్ఎఫ్ నాయకుడు గుత్త ధనుంజయనాయుడుతో శనివారం రాత్రి జరిగిన సంభాషణ ఆదివారం ఉదయానికి వైరల్ అయింది. నారా లోకేశ్‌కు వ్యతిరేకంగా మాట్లాడిన జూనియర్ ఎన్‌టిఆర్‌కు ఏ రకంగా మద్దతిస్తారంటూ గుత్తా ధనుంజయ నాయుడిని ఎంఎల్ఎ ప్రశ్నించారు. ఈ సమయంలో జూనియర్ ఎన్‌టిఆర్ గురించి అసభ్య పదజాలంతో మాట్లాడటం, సినిమాను అడ్డుకుంటానంటూ వ్యాఖ్యలు చేశారు. అవి వైరల్ కావడంతో జూనియర్ ఎన్‌టిఆర్ అభిమానులు ఎంఎల్ఎ దగ్గుపాటి వెంకట ప్రసాద్ వ్యాఖ్యలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నగరంలోని మారుతీనగర్ ప్రాంతంలోని ఆయన కార్యాలయం వద్ద ఉన్న ఫ్లెక్సీలను చింపడమే కాకుండా అక్కడే బైఠాయించి నిరసన తెలిపారు. ఆయన నేరుగా వచ్చి జూనియర్ ఎన్‌టిఆర్‌కు క్షమాపణ చెప్పాలని, ఇటువంటి వ్యాఖ్యలు చేసిన ఎంఎల్ఎపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎంఎల్ఎ ఇప్పటికే క్షమాపణ చెప్పారంటూ అభిమానులకు టిడిపి నేతలు సర్ది చెప్పారు. పోలీసులు వచ్చి పరిస్థితిని చక్కదిద్దారు.

అది మార్ఫింగ్ ఆడియో : ఎంఎల్ఎ దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్

జూనియర్ ఎన్‌టిఆర్‌కు వ్యతిరేకంగా తాను మాట్లాడలేదని, మార్ఫింగ్ చేసిన ఆడియోను బయట పెట్టారని ఎంఎల్ఎ దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ ఆదివారం ఉదయం ఒక వీడియోను విడుదల చేశారు. తనకు వ్యతిరేకంగా అధికార పార్టీ నేతలే కుట్రలు పన్నుతున్నారని ఆరోపించారు.

ఉమ్మడి రూల్స్‌పై చర్చించాలి

- మంత్రి లోకేష్‌ను కోరిన ఎపిటిఎఫ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పాఠశాల విద్యలో అకడమిక్ సమస్యలు, ఉపాధ్యాయుల ఉమ్మడి సర్వీస్ రూల్స్ అంశాలపై విద్యాశాఖ మంత్రి నారా లోకేష్.. ఉపాధ్యాయ సంఘాలతో తక్షణమే సమావేశం ఏర్పాటు చేయాలని ఎపిటిఎఫ్ కార్యవర్గ సమావేశం కోరింది. విజయవాడలోని ఎఐటియుసి కార్యాలయంలో ఆ సంఘం సమావేశం ఆదివారం జరిగింది. అంతర్ జిల్లా బదిలీలు వెంటనే నిర్వహించాలని, 2003 డిఎస్‌సి ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేసింది. లేదంటే ఈ నెల 25న విజయవాడలో భారీ ధర్నా నిర్వహిస్తామని హెచ్చరించింది. ఇహెచ్ఎస్ కింద ప్రైవేట్ ఆస్పత్రుల్లో వైద్యం అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది.

ఆర్‌టిసి ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి : సిపిఐ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రభుత్వం ప్రారంభించిన స్త్రీ శక్తి పథకం సక్రమంగా అమలు జరగాలంటే ఆర్‌టిసి ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ సూచించారు. ఈ మేరకు సిఎం చంద్రబాబు నాయుడుకు ఆదివారం లేఖ రాశారు. ఈ నెల 15 నుంచి ప్రారంభించిన స్త్రీ శక్తి పథకాన్ని స్వాగతిస్తున్నామని అన్నారు. పథకం సక్రమంగా అమలు చేసేందుకు ఆర్‌టిసి ఉద్యోగులు కోరిన విధంగా 3 వేల కొత్త బస్సుల కొనుగోలు, మరో 10 వేల మంది సిబ్బంది నియామకం చేపట్టాలని లేఖలో పేర్కొన్నారు. విద్యుత్ బస్సులను ఆర్‌టిసి ద్వారానే కొనుగోలు చేసేందుకు తగిన ఆర్థిక సహకారం ప్రభుత్వం అందించాలని, వాటిని ఆర్‌టిసి రెగ్యులర్ సిబ్బంది నడిపేలా చూడాలని కోరారు. డ్రైవర్లు, కండక్టర్లు, గ్యారేజీ మెకానిక్‌లు, క్లర్కులు, సూపర్‌వైజర్లు, పారా మెడికల్ సిబ్బంది ఉద్యోగాలతోపాటు పలు అధికారుల పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. వీటిని వెంటనే భర్తీ చేయాలని లేఖలో ముఖ్యమంత్రిని కోరారు.

గోదావరికి భారీగా వరద

భద్రాచలం వద్ద 35 అడుగులు

ప్రజాశక్తి - యంత్రాంగం

భారీ వర్షాలతోపాటు ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరద నీటితో భద్రాచలం వద్ద గోదావరి ఉధృతంగా ప్రవహిస్తోంది. కృష్ణా నదికి వరద పోటు కొనసాగుతోంది. శనివారం రాత్రి 30 అడుగుల్లో ఉన్న గోదావరి ఆదివారం రాత్రి ఏడు గంటల సమయంలో 35 అడుగులకు చేరువలో ప్రవహిస్తోంది. గోదావరి నీటిమట్టం పెరగడంతో స్నాన ఘట్టాల వద్ద చాలా మెట్లు వరద నీటిలో మునిగాయి. గోదావరిలో స్నానాలు ఆచరించే యాత్రికులు లోపలికి వెళ్లకుండా జాగ్రత్తలు పాటించాలని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. భద్రాచలం దిగువన ఏజెన్సీ ప్రాంతాల ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు.

శ్రీశైలం 3గేట్ల ద్వారా నీటి విడుదల

శ్రీశైలం ఎగువ ప్రాంతాలైన జూరాల గేట్లు తెరవడం, సుంకేసుల నుండి నీటి ప్రవాహం కొనసాగుతుండడంతో శ్రీశైలం జలాశయం మూడు గేట్ల నుండి నీటి విడుదల చేస్తున్నారు. ఆదివారం సాయంత్రం ఆరు గంటల సమయానికి ఎగువ జూరాల నుండి విద్యుత్ ఉత్పాదనతో 38,818 క్యూసెక్కులు, గేట్ల ద్వారా 77,946 క్యూసెక్కులు, సుంకేసుల ద్వారా 49,632 క్యూసెక్కులతో మొత్తం శ్రీశైలం జలాశయానికి 1,56,396 క్యూసెక్కుల నీరు చేరుతున్నాయి. అదే సమయానికి మూడు గేట్లను పది అడుగుల మేర ఎత్తి దిగువకు 79,269 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.

కుడిగట్టు జలవిద్యుత్ కేంద్రంలో గడిచిన 24 గంటల్లో 30,517 క్యూసెక్కుల నీటితో 15.251 మిలియన్ యూనిట్ల విద్యుత్, ఎడమ గట్టు భూగర్భ జల విద్యుత్ కేంద్రంలో 39,345 క్యూసెక్కులతో 16.868 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తూ దిగువ నాగార్జునసాగర్‌కు 65,807 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. శ్రీశైలం బ్యాక్ వాటర్ నుండి పోతిరెడ్డిపాడుకు 29,333 క్యూసెక్కులు, హంద్రీ-నీవా సుజల స్రవంతికి 2,426 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. మహాత్మా గాంధీ కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్‌కు నీటిని నిలిపివేశారు. జలాశయ నీటిమట్టం 885 అడుగులకుగాను ప్రస్తుతం 881.40 అడుగులకు చేరింది. నీటి నిల్వ సామర్థ్యం 215 టిఎంసిలకు 195.6605 టిఎంసిలుగా నిలువ ఉంది.

పెద్దఅడ్లగాడి, పెనుమాకులంక రహదారిపై ప్రవహిస్తున్న ముంపు నీరు

పెరుగుతున్న కొల్లేటి నీటిమట్టం నిలిచిపోయిన రాకపోకలు

కొల్లేరు సరస్సులోకి వరద నీరు పెద్ద ఎత్తున వచ్చి చేరుతోంది. ఎగువ ప్రాంతాల్లోని ముంపు నీరు పలు డ్రెయిన్ల ద్వారా కొల్లేరులోకి వచ్చి చేరడంతో కొల్లేరు నీటిమట్టం పెరుగుతోంది. ఎగువ ప్రాంతాల్లోని ముంపు నీరు 64 డ్రెయిన్ల ద్వారా ప్రవహిస్తూ కొల్లేరు ద్వారా సముద్రంలోకి వెళ్లాల్సి ఉంది. నీటి ప్రవాహానికి కొల్లేరు మాఫియా కొల్లేరులో అక్రమంగా తవ్విన చేపల చెరువులు అడ్డుపడడంతో లంక గ్రామాలకు రాకపోకలు తెగిపోయి జలదిగ్బంధనంలో చిక్కుకుపోతున్నాయి. దీనికి తోడు పెద్దఅడ్లగాడి వంతెన వద్ద భారీ స్థాయిలో మేట వేసిన గుర్రపు డెక్కను సకాలంలో తొలగించకపోవడంతో ముంపునకు మరో కారణం. పెదఅడ్లగాడి, పెనుమాకలంక రహదారిపైకి నీరు చేరడంతో పెదఅడ్లగాడి, పెనుమాకలంక, నందిగామ, శ్రీరామనగర్ మీదుగా సిద్ధాంతానికి రాకపోకలు తెగిపోయి ప్రజలు పడవలపై ప్రయాణిస్తున్నారు.

ప్రకాశం బ్యారేజికి కొనసాగుతున్న వరద పోటు

ఎగువ నుంచి వస్తున్న ప్రవాహంతో కృష్ణా పరివాహక ప్రాంతంలో జలాశయాలకు వరద పోటు కొనసాగుతోంది. నాగార్జున సాగర్‌కు ప్రవాహం మరింత పెరిగింది. దీంతో పులిచింతల, ప్రకాశం బ్యారేజికి నీటి విడుదల కొనసాగిస్తున్నారు. శ్రీశైలం నుంచి 2.04 లక్షల క్యూసెక్కులు దిగువకు విడుదల చేస్తుండగా నాగార్జున సాగర్‌కు 1.71 లక్షల క్యూసెక్కుల ప్రవాహం వస్తోంది. సాగర్ జలాశయం నుంచి 2.12 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. పులిచింతలకు ఎగువ నుంచి 2.08 లక్షల క్యూసెక్కుల నీరు వస్తుండగా 1.93 లక్షల క్యూసెక్కుల ప్రవాహం దిగువకు విడుదల చేస్తున్నారు. పులిచింతల నుంచి వచ్చే ప్రవాహంతో పాటు ఖమ్మం, కృష్ణా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రకాశం బ్యారేజికి వస్తున్న వరద నీటితో కలిపి ఆదివారం సాయంత్రం 6 గంటలకు 2.87 లక్షల క్యూసెక్కుల నీరు వస్తుండగా వచ్చిన నీటిని వచ్చినట్టు సముద్రంలోకి విడుదల చేస్తున్నారు. గత వారం రోజులుగా ప్రకాశం బ్యారేజి నుంచి రోజుకు సగటున మూడు లక్షల క్యూసెక్కుల నీరు సముద్రం పాలవుతోంది.

కోనసీమ జిల్లాలో లంక పొలాల్లోకి వరద నీరు

డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కపిలేశ్వరపురంలో గోదావరి వరద ఉధృతితో నది పరీవాహక ప్రాంతాలైన తాతపూడి, కపిలేశ్వరపురం, కోరుమిల్లి, కేదార్లంక, వీధివారిలంక, నారాయణలంక, అద్దంకివారిలంక, పల్లపులంక గ్రామాల ప్రజలు బెంబేలెత్తుతున్నారు. పలుచోట్ల లంక పొలాల్లోకి వరద నీరు చేరడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వరద ఉధృతికి కపిలేశ్వరపురం, తాతపూడి, కోరుమిల్లి, పుష్కర ఘాట్ల పైనుంచి వరద నీరు ప్రవహిస్తోంది.

ఎమ్మెల్యేలపై సిఎం ఆగ్రహం!

- కూన, దగ్గుపాటి, నజీర్‌ల ఘటనలపై నివేదిక

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

టిడిపి అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆ పార్టీ ఎమ్మెల్యేలపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. పార్టీ నేతలతో ఆదివారం ఆయన టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్, అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్, గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే నజీర్ అహ్మద్‌పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ తెలుగు యువత నాయకుడుతో జూనియర్ ఎన్‌టిఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఆడియో సంభాషణ వెలుగులోకి వచ్చింది. కూన రవికుమార్ తనను వేధిస్తున్నారని పొందూరు కెజిబివి ప్రిన్సిపల్ ఫిర్యాదు చేశారు. అదే విధంగా నజీర్ అహ్మద్ ఒక మహిళతో వీడియోకాల్ మాట్లాడిన అంశం బయటకు వచ్చింది. ఈ మూడు ఘటనలపై నివేదిక అందించాలని పార్టీ రాష్ట్ర నాయకత్వాన్ని చంద్రబాబు కోరారు. ఎమ్మెల్యేలు, నేతలు వ్యక్తిగతంగా చేసే పనులు, చర్యలు, ఘటనలు పార్టీకి చెడ్డపేరు తెస్తాయని హెచ్చరించారు. గ్రూపు తగాదాలు, అంతర్గత విభేదాలతో పార్టీకి నష్టం చేసే చర్యలు ఎవరు చేసినా ఉపేక్షించేది లేదని చెప్పారు. అన్నదాతా సుఖీభవ, ఉచిత బస్సు ప్రయాణంపై ఆయన సమీక్ష చేశారు. ఉచిత బస్సుపై గందరగోళం సృష్టించేందుకు వైసిపి తప్పుడు ప్రచారాన్ని చేస్తోందని, దీనిని తిప్పికొట్టాలని సూచించారు. పథకాల అమల్లో మంత్రులు, ఎమ్మెల్యేలు విధిగా భాగస్వాములయ్యేలా చూడాలని పార్టీ యంత్రాంగాన్ని ఆదేశించారు.

పలువురు కేంద్ర మంత్రులతో నేడు లోకేష్ భేటీ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ సోమవారం ఢిల్లీలో పర్యటించనున్నారు. పెండింగ్ ప్రాజెక్టులపై సంబంధిత కేంద్ర మంత్రులతో చర్చించనున్నారు. ఆదివారం రాత్రి ఆయన ఢిల్లీ చేరుకున్నారు. రాష్ట్రానికి ఇటీవల సెమీకండక్టర్ మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్ మంజూరు చేసినందుకు కేంద్ర రైల్వే, ఐటి, ఎలక్ట్రానిక్స్‌శాఖల మంత్రి అశ్వనీ వైష్ణవ్‌ను కలిసి కృతజ్ఞతలు చెబుతారని లోకేష్ కార్యాలయం ఒక ప్రకటనలో వెల్లడించింది. రాష్ట్రంలోని పెండింగ్ ప్రాజెక్టులపై కేంద్ర రోడ్డు రవాణా, రహదార్లశాఖ మంత్రి నితిన్ గడ్కరీ, పెట్రోలియం శాఖ మంత్రి హర్దీప్ సింగ్‌పురి, ఓడరేవులు, జలరవాణా శాఖ మంత్రి సర్బానంద్ సోనోవాల్, వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్, విదేశాంగ శాఖ మంత్రి జైశంకర్‌తో సమావేశమవుతారని పేర్కొంది. రాష్ట్ర ప్రభుత్వం తరపున వివిధ ప్రతిపాదనలను కేంద్ర మంత్రులకు అందజేస్తారని తెలిపింది.

మతతత్వ భావజాలాన్ని అడ్డుకుందాం

తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల టీచర్స్ ఎమ్మెల్సీ గోపిమూర్తి

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ గోపిమూర్తి

ప్రజాశక్తి - ఉరవకొండ (అనంతపురం)

విద్యారంగాన్ని కాపాడుకొని, ప్రభుత్వ బడులు నిలబెట్టుకోవడంతో పాటు, చరిత్రను మార్చి పాఠ్యపుస్తకాలు ముద్రిస్తున్న బిజెపి మతతత్వ భావజాలాన్ని అడ్డుకుందామని తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల టీచర్స్ ఎమ్మెల్సీ గోపిమూర్తి పేర్కొన్నారు. అనంతపురం జిల్లా ఉరవకొండ జోన్‌లో ఆదివారం యుటిఎఫ్ నూతన భవనాన్ని ఆయన, పూర్వ ఎమ్మెల్సీలు ఐ వెంకటేశ్వరరావు, గేయానంద్ హాజరై ప్రారంభించారు. అనంతరం యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షులు రామప్ప చౌదరి అధ్యక్షతన జరిగిన సమావేశంలో గోపి మూర్తి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం మతతత్వ పోకడలను అనుసరిస్తూ విద్యావ్యవస్థను నిర్వీర్యం చేయడానికి పూనుకుందన్నారు. విద్యా వ్యవస్థ నిర్వీర్యమైతే ఉద్యోగ వ్యవస్థ కూడా పాడవుతుందని వివరించారు. కేంద్ర ప్రభుత్వము అనుసరిస్తోన్న విధానాలతో తొమ్మిది రకాల పాఠశాలలతో భవిష్యత్తులో ప్రభుత్వ విద్య కనుమరుగయ్యే పరిస్థితి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. బలిపీఠం ఎక్కబోతున్న పాఠశాలలను రక్షించుకోవాల్సిన అవసరం అందరిపైనా ఉందన్నారు. ఐ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ బిజెపి అనుసరిస్తోన్న ప్రజా వ్యతిరేక విధానాలతో వామపక్ష ప్రజాతంత్ర పోరాటాల ద్వారా సాధించుకున్నవన్నీ ఒక్కొక్కటిగా పోగొట్టుకుంటున్నామని, రేపటి తరానికి బిజెపి విధానాలు తీవ్ర నష్టాన్ని చేకూర్చే విధంగా ఉన్నాయని తెలిపారు. ప్రభుత్వ రంగం సంస్థలు ప్రయివేటు వ్యక్తుల చేతుల్లోకి వెళ్లిపోతున్నాయన్నారు. యుటిఎఫ్ కార్యకర్తలు ప్రపంచ దృక్పథాన్ని అర్థం చేసుకొని మన సమాజాన్ని చైతన్యవంతం చేసేలా ఉండాలని సూచించారు. గేయానంద్ మాట్లాడుతూ జిల్లా కేంద్రం తర్వాత ఉరవకొండ జోన్‌లో ఉన్న యుటిఎఫ్ నాయకుల పోరాట స్ఫూర్తి, త్యాగము ఎనలేనిదన్నారు. ఈ సమావేశంలో యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జయ చంద్రారెడ్డి, రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యులు రమణయ్య, జిల్లా అధ్యక్షులు గోవిందరాజులు, సత్యసాయి జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్, మహిళా కళాశాల ప్రిన్సిపల్ షాషావలి, మండల విద్యాశాఖ అధికారులు, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

చరిత్రను వక్రీకరించేందుకే పాఠ్యాంశాల తొలగింపు

'పాఠ్యాంశాలు మార్చినంత మాత్రాన సత్యం మారిపోతుందా' సదస్సులో వక్తలు

సదస్సులో మాట్లాడుతున్న కెఎస్.లక్ష్మణరావు, చిత్రంలో సూర్యనారాయణ, ఎంవిఎస్.శర్మ తదితరులు

ప్రజాశక్తి- ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)

చరిత్రను వక్రీకరించేందుకే పాఠ్యాంశాల తొలగింపు జరుగుతోందని పలువురు వక్తలు అన్నారు. 'పాఠ్యాంశాలు మార్చినంత మాత్రాన సత్యం మారిపోతుందా' అనే అంశంపై విశాఖలోని అల్లూరి విజ్ఞాన కేంద్రంలో విజ్ఞాన కేంద్రం ప్రోగ్రామ్ ఇన్‌ఛార్జి జిఎస్.రాజేశ్వరరావు అధ్యక్షతన ఆదివారం సదస్సు జరిగింది. ముఖ్యవక్తలుగా ఆంధ్ర యూనివర్సిటీ హిస్టరీ డిపార్టుమెంట్ విశ్రాంత ఆచార్యులు కె.సూర్యనారాయణ, పిడిఎఫ్ మాజీ ఎమ్మెల్సీలు కెఎస్.లక్ష్మణరావు, ఎంవిఎస్.శర్మ హాజరయ్యారు. కెఎస్.లక్ష్మణరావు మాట్లాడుతూ గత ఏడాది 10, 11 తరగతుల సిబిఎస్‌సి పుస్తకాల్లో రాజనీతి శాస్త్రంలో అనేక పాఠ్యాంశాలను తొలగించ బడ్డాయని తెలిపారు. ముఖ్యంగా ఇండియన్ కాన్స్టిట్యూషన్ నెట్‌వర్క్ పాఠ్యాంశంలో మౌలానా అబ్దుల్ కలాంకు చెందిన పేరా తొలగించారని, సైన్స్ విభాగంలో చార్లెస్ డార్విన్ రూపొందించిన జీవ పరిణామ సిద్ధాంతం, జీవశాస్త్రంలో మూలకాల కాంబినేషన్లు తెలియజేసే ముఖ్యమైన పిరియాడిక్ టేబుల్‌ను తొలగించారని వివరించారు. ప్రత్యేకించి చరిత్రకు సంబంధించిన విషయాలను తొలగించడంపై ఆందోళన వ్యక్తం చేశారు. పాఠ్యాంశాలన్నింటినీ ఒక మతతత్వ ధోరణితో చిత్రించి ప్రజల మధ్య విద్వేషాలను రెచ్చగొట్టేందుకు ప్రయత్నిస్తున్నారని తెలిపారు. నిజాలను చరిత్ర నుంచి చెరిపేస్తే అవి చెరిగిపోవన్నారు. తొలగించిన పాఠ్యాంశాలను తిరిగి చేర్చాలని డిమాండ్ చేశారు. కె.సూర్యనారాయణ మాట్లాడుతూ ప్రస్తుత ప్రభుత్వం చరిత్రకు సంబంధించిన సుమారు 1800 రకాల మార్పులు చేసిందని తెలిపారు. ఇంత భారీ స్థాయిలో మార్పులు గతంలో ఎన్నడూ జరగలేదన్నారు. సత్యాన్వేషణే చరిత్రకు మూలం కావాలని పేర్కొన్నారు. మొగలుల మీదే ఎందుకు ఇంత కక్షో అర్థం కావడం లేదని తెలిపారు. మొగలుల పాలనా కాలంలో జరిగిన పరిణామాలను వివరించారు. తమకు కావాల్సిన కొన్ని భావజాలాలను మాత్రమే ప్రజలపై రుద్దేందుకు నేడు ప్రయత్నం జరుగుతోందని, ఇది భవిష్యత్తు తరాలకు తీవ్ర ఆటంకంగా మారుతుందని అన్నారు. ఎంవిఎస్.శర్మ మాట్లాడుతూ రాముడు ఇక్కడే పుట్టాడు అనే ఊహను పురాణంలోనుంచి తీసుకొచ్చి దానిని ఆపాదించడం ద్వారా చరిత్ర వక్రీకరణ మొదలైందని తెలిపారు.

ఎటువంటి ఆధారాలులేని రామాయణాన్ని తీసుకొని మసీదు కట్టిన చోటే రాముడు పుట్టాడని మతవిద్వేషాలు రెచ్చగొట్టడం ప్రారంభించారని వివరించారు. ఆ దాడి ద్వారా ఆయా రాజకీయ పార్టీలకు కొంత అనుకూల ఫలితాలు వచ్చాయని, రెండు సీట్ల నుంచి తదుపరి 86 సీట్లకు, ఆ తర్వాత అధికారంలోకి రావడానికి ఉపయోగపడ్డాయని అన్నారు. కానీ, సమైక్య భారతదేశంలో మతద్వేషాలు రెచ్చగొట్టడం ద్వారా ముందుకు వెళ్లడం సాధ్యపడదని గ్రహించిన పాలకులు అసలు చరిత్రనే మార్చేస్తే ఎలా ఉంటుందన్న ఆలోచన చేశారని పేర్కొన్నారు. ఈ క్రమంలోనే రానున్న తరాలకు చరిత్రను వక్రీకరించి చెబితే అది తమకు అనుకూలంగా మారుతుందని భావిస్తున్నారని తెలిపారు.

లంక భూముల లబ్ధిదారులకు ప్లాట్లు

- కెవిపిఎస్ డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాజధాని అమరావతి పరిధిలోని మందడం లంక భూమి లబ్ధిదారులకు సిఆర్‌డిఎ అధికారులు తక్షణమే ప్లాట్లు కేటాయించడంతోపాటు కౌలు చెల్లించాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంద్ర మాల్యాద్రి డిమాండ్ చేశారు. మందడంలోని లంక భూముల రైతులతో ఆదివారం సాయంత్రం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

లంక సొసైటీ లబ్ధిదారులైన దళితులు, రాజధాని కోసం తమ సాగులో ఉన్న భూమిని సిఆర్‌డిఎకి ల్యాండ్ పూలింగ్‌లో ఇచ్చినప్పటికీ కౌలు, ప్లాట్లు కేటాయించకుండా దళితుల పట్ల వివక్ష చూపడం దుర్మార్గమన్నారు. 2014 వరకూ భూమికి శిస్తు కట్టి దానిపై ఫలసాయం అనుభవిస్తున్న దళితులను సిఆర్‌డిఎ అధికారులు మోసం చేస్తున్నారని తెలిపారు. రాజధానిలో ల్యాండ్ పూలింగ్ ప్రక్రియ ప్రారంభం నుంచి దళితులపై వివక్ష చూపుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సిఆర్‌డిఎ అధికారులు ఇప్పటికైనా దళితులకు ప్లాట్లు కేటాయించి న్యాయం చేయాలని, లేనిపక్షంలో లబ్ధిదారులతో కలిసి కెవిపిఎస్ పోరాటం చేస్తుందని హెచ్చరించారు. ఈ సమావేశంలో కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి జె నవీన్ ప్రకాష్, నాయకులు కె రమేష్, లంక సొసైటీ లబ్ధిదారులు పాల్గొన్నారు.

నిషేధిత ఉగ్రవాద వాట్సాప్ గ్రూపులతో మహమ్మద్‌కు సంబంధాలు

- ఉగ్ర కార్యకలాపాలు గుర్తించేందుకు ప్రత్యేక బృందం : ఎస్‌పి

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

పాకిస్తాన్‌లో నిషేధించిన ఉగ్రవాద సంస్థల ఆధ్వర్యంలో నడుస్తున్న ఆరు వాట్సప్ గ్రూపులతో నూర్ మహమ్మద్‌కు సంబంధాలు ఉన్నాయని శ్రీసత్యసాయి జిల్లా ఎస్‌పి రత్న వెల్లడించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎస్‌పి తెలిపిన వివరాల మేరకు... ధర్మవరం పట్టణంలో మహమ్మద్ చికెన్ దుకాణం నడుపుతూ పట్టణంలో మసీదులు, ప్రార్థన మందిరాల వద్ద యువతను ఉగ్రవాదం వైపు ప్రేరేపించేవారు. పాకిస్తాన్‌లో నిషేధిత జాబితాలో ఉన్న జైసే మహమ్మద్, ఇతర గ్రూపులతో సంబంధాలను కొనసాగించేవారు. ఈ గ్రూపులలో ఉగ్రవాద భావాజాలం, దేశ వ్యతిరేక ప్రచారం, జిహాదీ ప్రేరణ జరుగుతున్నట్లు వెల్లడైనట్లు తెలియడంతో శనివారం మహమ్మద్‌ను అరెస్టు చేసి రిమాండ్ తరలించారు. మహమ్మద్ వద్ద ఉన్న మొబైల్ ఫోను, సిమ్ కార్డు స్వాధీనం చేసుకొని విచారణ చేపడుతున్నారు. ఉగ్రవాదులతో ఆయన పాత్ర, ఎవరెవరుతో సంబంధాలు కొనసాగించారు, ఆయనను గ్రూపులో ఎవరు చేర్చారు, ఎన్ని ఉగ్రవాద సంస్థలతో సంబంధాలు కొనసాగిస్తున్నారని అంశాలపైన రాష్ట్ర కౌంటర్ ఇంటెలిజెన్స్ సెల్ వారు సమాచారం ఇస్తారని ఎస్‌పి చెప్పారు. వారి సమాచారం మేరకు తదుపరి చర్యలు ఉంటాయని వివరించారు. జిల్లా వ్యాప్తంగా కదిరి, హిందూపురం, పుట్టపర్తి, ధర్మవరం ప్రధాన పట్టణాల్లో ఇలా దేశ వ్యతిరేక కార్యక్రమాలు చేపట్టే వ్యక్తులపై ప్రత్యేక నిఘా ఉంచి, అలాంటి వ్యక్తులను గుర్తించడానికి ఆయా పట్టణాల్లో నిరంతరం తనిఖీలు నిర్వహిస్తామన్నారు. అందుకోసం జిల్లాలో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేస్తామని ఎస్‌పి తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో డిఎస్‌పి నర్సింగప్ప, ధర్మవరం పట్టణ సిఐ రెడ్డప్ప తదితరులు పాల్గొన్నారు.

పుస్తకాల నిషేదంపై కర్నూలులో నిరసన తెలుపుతున్న కవులు

పుస్తకాలపై నిషేధం భావప్రకటనా స్వేచ్ఛకు భంగం

- కర్నూలులో కవుల నిరసన

ప్రజాశక్తి-కర్నూలు కల్చరల్

కర్నూలు జిల్లా కవులందరూ సంయుక్తంగా పుస్తకాల నిషేధంపై గళమెత్తారు. కర్నూలు నగరంలోని సి.క్యాంప్ సెంటర్‌లో నిరసన ప్లకార్డులు పట్టుకొని ఆదివారం ఉదయం నిరసన ప్రదర్శన చేశారు. కార్యక్రమంలో సాహితీ స్రవంతి రాష్ట్ర కార్యదర్శి జంధ్యాల రఘుబాబు, డిటిఎఫ్ రాష్ట్ర నాయకులు రత్నం యోసేపు మాట్లాడుతూ ప్రసిద్ధ రచయితలు రచించిన 25 పుస్తకాలను నిషేధిస్తూ జమ్మూ కశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ ఈ నెల 7న ఉత్తర్వులను విడుదల చేశారన్నారు. వాటిలో సుప్రసిద్ధ రచయితలు అరుంధతి రాయ్, ఎజి నూరాని, సుమంత్ర బోస్, సీమాకాజీ, డేవిడ్ దేవదాస్ వంటివారు రచించిన పాపులర్ గ్రంథాలున్నాయని, అవన్నీ కశ్మీర్ చరిత్రను, కశ్మీర్‌లో జరుగుతున్న వాస్తవ విషయాలను తెలియజేసే గ్రంథాలే అని వాటిని నిషేధించడం ద్వారా కేంద్ర బిజెపి ప్రభుత్వం మేధావులపై, మేధావుల ఆలోచనలపై నిషేధం విధించిందని పేర్కొన్నారు. ఈ చర్య రాజ్యాంగం కల్పించిన భావ ప్రకటన స్వేచ్ఛకు భంగకరమన్నారు. తక్షణమే ఈ 25 పుస్తకాలపై విధించిన నిషేధాన్ని ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన ప్రదర్శనలో సాహితీ స్రవంతి రాష్ట్ర నాయకులు కెంగార మోహన్, మారుతీ పౌరోహితం, నాగేశ్వరాచారి, సయ్యద్ జహీర్ అహ్మద్, డిగ్రీ కళాశాల లెక్చరర్ రవి ప్రకాష్ సాహితీ స్రవంతి జిల్లా ప్రధాన కార్యదర్శి ఆవుల చక్రపాణి యాదవ్ నాయకులు విజయులు, తనగల తదితరులు పాల్గొన్నారు.

నిశ్చయ తాంబూలాల వేడుకకు హాజరైన మంత్రి లోకేష్ తదితరులు

ఘనంగా మంత్రి నిమ్మల కుమార్తె నిశ్చితార్థం

- హాజరైన మంత్రి లోకేష్ సహా ప్రముఖులు హాజరు

ప్రజాశక్తి - పాలకొల్లు (పశ్చిమగోదావరి జిల్లా)

పాలకొల్లులో రాష్ట్ర జల వనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు ఇంట ఆదివారం నిశ్చితార్థం వేడుక అంగరంగ వైభవంగా జరిగింది. ఉదయం 7.16 గంటలకు పాలకొల్లులోని ఎస్.కన్వెన్షన్‌లో మంత్రి రామానాయుడు కుమార్తె శ్రీజ, పవన్ నిశ్చయ తాంబూలాల కార్యక్రమం సందర్భంగా రామానాయుడు, సూర్యకుమారి దంపతులు, ఇర్రింకి వెంకట సూర్యనారాయణ, కరుణ మణి దంపతులు తాంబూలాలను కుటుంబ సభ్యులు, బంధువుల మధ్య స్వీకరించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేష్‌ను మంత్రి రామానాయుడు గజమాలతో సత్కరించి స్వాగతం పలికారు. పవన్, శ్రీజకు లోకేష్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమానికి హాజరైన కేంద్ర మంత్రి శ్రీనివాస్ వర్మ, శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు, డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘురామ కృష్ణరాజు, శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేను రాజు, రాష్ట్ర మంత్రులు అచ్చెన్నాయుడు, అనగాని సత్యప్రసాద్, కొలుసు పార్థసారథి, కందుల దుర్గేష్, బిసి జనార్ధన్ రెడ్డి, కొండపల్లి శ్రీనివాసరావు, జెడ్‌పి చైర్మన్, గంటా పద్మశ్రీ, ఎంఎల్‌సిలు, కలెక్టర్ నాగరాణిని రామానాయుడు సత్కరించారు.

వరద జలాలపై ఇరు రాష్ట్రాల వాటాలు తేలాకే కొత్త ప్రాజెక్టులు నిర్మించుకోవాలి

తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం)

ఎపికి వచ్చిన తెలంగాణ డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క విశాఖపట్నంలో కీలక వ్యాఖ్యలు చేశారు. ఆదివారం సర్క్యూట్ హౌస్‌లో మీడియాతో ఆయన మాట్లాడుతూ తెలంగాణ తెచ్చుకున్నదే నదీ జలాల కోసమని, బీడు భూములను సాగులోకి తెచ్చుకోవడం కోసమని చెప్పారు. వరద జలాలపై ఇరు రాష్ట్రాల వాటా తేలిన తర్వాత కొత్త ప్రాజెక్టులు నిర్మించుకుంటే న్యాయబద్ధంగా ఉంటుందన్నారు. 'మా అవసరాలు తీరకుండా దిగువ ప్రాజెక్టులు నిర్మిస్తే, ఆ తర్వాత కేటాయింపుల సమస్యలు ఎక్కువవుతాయి' అని భట్టి అన్నారు. ఇందిరాసాగర్, రాజీవ్ సాగర్, దేవాదుల వంటి గోదావరిపై తాము చేపట్టిన ప్రాజెక్టులు పూర్తి కాలేదని, తమ ప్రాజెక్టుల నిర్మాణం తర్వాత వాటాలు తేల్చి మిగిలిన వాటిని సమృద్ధిగా వాడుకోవచ్చని అన్నారు. తెలంగాణ కాంగ్రెస్‌లో విభేదాల గురించి అడిగిన ప్రశ్నకు సమాధానంగా తెలంగాణ కాంగ్రెస్‌లో అసమ్మతి లేదని బదులిచ్చారు. చంద్రబాబు, రేవంత్, రాహుల్ గురించి వై.ఎస్ జగన్ హాట్ లైన్ వ్యాఖ్యలపై స్పందించిన భట్టి, అవి వ్యక్తిగతమైన రాజకీయ ఆరోపణలని చెప్పుకొచ్చారు. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా పార్టీ విధానాలు విశాలమైన ప్రయోజనాలతో ఉంటాయి తప్ప సంకుచితమైన మనస్తత్వంతో ఉండవన్నారు.

ఓటు చోరీపై యుద్ధం : భట్టి

ఓటు చోరీపై యుద్ధం చేస్తామని భట్టి విక్రమార్క తెలిపారు. ఆదివారం నగరంలోని ఒక కార్యక్రమానికి హాజరైన ఆయన సర్క్యూట్ హౌస్ వద్ద మీడియాతో మాట్లాడుతూ, ఓటు అనేది పౌరుల హక్కు అన్నారు. బతికున్న వారిని మరణించినట్లు చూపించడం దారుణమని, ఓట్ల గల్లంతు దేశమంతా చూసిందని అన్నారు. అందుకే తమ నాయకుడు రాహుల్ గాంధీ ఉద్యమిస్తున్నారని చెప్పారు. అన్ని పార్టీలు పార్లమెంటు లోపల, బయట పోరాటం చేస్తున్నాయని, ప్రజలు కూడా ఈ పోరాటంలో చేతులు కలపాలని పిలుపునిచ్చారు. సిడబ్ల్యుసి మెంబర్, పిసిసి మాజీ అధ్యక్షులు గిడుగు రుద్రరాజు, విశాఖ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు అడ్డాల వెంకట వరమరాజు పాల్గొన్నారు.

పునరావాస కాలనీల్లో దయనీయ పరిస్థితులు

- ఇళ్ల స్లాబులు లీక్ • మురుగునీటి మధ్యనే నివాసాలు
- రేషన్, ఇతర అవసరాల కోసం పాత గ్రామాలకు వెళ్తున్నాం
- ఉపాధి చూపని ప్రభుత్వం
- సిపిఎం పర్యటనలో సమస్యలు ఏకరువు పెట్టిన నిర్వాసితులు

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

'మా పునరావాస కాలనీలో కనీస సదుపాయాలు లేవు. తాగునీటి ట్యాంక్ నిర్మించినా కనెక్షన్ ఇవ్వకపోవడంతో కిలోమీటరు దూరం నుంచి తాగునీరు తెచ్చుకోవాల్సి వస్తోంది. సైడ్ డ్రెయిన్ల నిర్మాణం మధ్యలోనే వదిలేయడంతో మురుగునీరు నిలిచిపోయి దుర్వాసన వస్తోంది. ఇల్లు నిర్మించి మూడేళ్లు కాకముందే స్లాబుల నుంచి వర్షపు నీరు లీకవుతోంది. పారిశుధ్య నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో దోమల బెడద తీవ్రంగా ఉంది. ఇటీవల ఓ యువకుడు జ్వరంతో చనిపోయాడు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అందుబాటులో లేకపోవడంతో అవస్థలు పడుతున్నాం' అంటూ అల్లూరి జిల్లా ఎటపాక మండలం నరసింగపేట ఆర్ అండ్ ఆర్ కాలనీకి చెందిన కెచ్చల కల్యాణి తమ కష్టాలను చెప్పుకొచ్చారు. ఆ కాలనీలో సిపిఎం ప్రధాన కార్యదర్శి ఎంఎ.బేబీ, రాజ్యసభ ఫ్లోర్ లీడర్ జాన్ బ్రిట్టాస్‌లతో కూడిన బృందం ఆదివారం పర్యటించింది. ఈ సందర్భంగా కాలనీలోని సమస్యలను కల్యాణితోపాటు పలువురు విన్నవించారు. 'రేషన్ కార్డు పాత గ్రామంలోనే ఉంది. 90 కిలోమీటర్లు వెళ్లి రేషన్ బియ్యం తెచ్చుకోవాల్సి వస్తోంది. ఆటో ఖర్చులు మనిషికి రూ.300 అవుతున్నాయి. ఆధార్, ఓటర్ కార్డులు మా పాత గ్రామంలోనే ఉన్నాయి. శ్రీరామగిరి నుంచి ఇక్కడికి అర్థాంతరంగా తరలించారు రోడ్లు లేవు. వీధిలైట్లు వెలగడం లేదు. గర్భిణిని ఆటోలో ఆస్పత్రికి తీసుకువెళ్లాలన్నా అవస్థలు తప్పడం లేదు. మరుగుదొడ్లు తక్కువ ఎత్తులో నిర్మించారు. డోర్లు సొంత ఖర్చులతో ఏర్పాటుచేసుకున్నాం. దొంగలభయం అధికంగా ఉంది' అని అదే కాలనీకి చెందిన కోండ్ల శ్రీదేవి ఏకరువు పెట్టారు. 'పునరావాస కాలనీకి ఆవాసం వచ్చినప్పటి నుంచి ఉపాధి లేదు. గతంలో సొంత గ్రామంలో కూలి పనికి వెళ్లే వాడిని. ఇప్పుడు ఈ గ్రామంలో ఆ అవకాశం లేక ఉపాధి కోసం భద్రాచలం వెళ్లాల్సి వస్తోంది. అంగన్‌వాడీ కేంద్రం, ప్రైమరీ స్కూలు లేవు. పిహెచ్‌సి లేదు. వర్షం వస్తే రోడ్లు సరిగా లేక ఎక్కడికీ వెళ్లే పరిస్థితి లేదు' అని రవికుమార్‌రెడ్డి తెలిపారు. పింఛను కోసం విఆర్.పురం మండలంలోని గొందూరుకు వెళ్లాల్సి వస్తోందని, రాకపోకలకు సుమారు రూ.500 ఖర్చవుతోందని ధర్మరాజురెడ్డి చెప్పారు. ఈ ప్రాంతంలోనే పింఛను ఇప్పించాలని కోరారు. 'మా ప్రాంతంలో పారిశుధ్య నిర్వహణ సక్రమంగా లేదు. వాటర్ ట్యాంక్ కనెక్షన్ లేదు. కనీస సౌకర్యాలు లేకపోయినా తప్పనిసరై కాలనీలో బతుకీడుస్తున్నాం' అని తమ దీనగాథను చెప్పుకొచ్చాడు.

నరసింగపేట కాలనీలో ఎవరిని పలకరించినా ఇవే దయనీయ పరిస్థితులు కనిపించాయి. ఈ కాలనీలో విఆర్ పురం మండలం ముంపు ప్రాంతాలైన కొల్లూరు, గొందూరు, శ్రీరామగిరి, కొటారిగుమ్ములకు చెందిన 289 కుటుంబాలకు ప్రభుత్వం ఇక్కడ పునరావాసం కల్పించింది. కాలనీలో ఆదివారం పర్యటించిన సిపిఎం బృందానికి పూలమాలలతో, హారతులతో వారంతా సాదర స్వాగతం పలికారు. ఎంఎ.బేబీ, జాన్‌బ్రిట్టాస్ ఎదుట తమ గోడు వెలిబుచ్చుకున్నారు. వారిని తమ వెంట తీసుకెళ్లి గృహాల దుస్థితిని చూపించారు. జాతీయ స్థాయిలోనూ, క్షేత్రస్థాయిలోనూ పోరాటాలను మరింత ఉధృతం చేసి నిర్వాసితుల పట్ల పాలకుల నిర్లక్ష్యాన్ని ఎండగడతామని ఎంఎ.బేబీ, జాన్‌బ్రిట్టాస్ అన్నారు. కార్యక్రమంలో పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు కె.లోకనాథం, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.తులసీదాస్, కిల్లో సురేంద్ర, ఎఎస్ ఆర్ రంపచోడవరం జిల్లా కార్యదర్శి బి.కిరణ్ పాల్గొన్నారు.

విఆర్.పురం మండలం రామవరానికి భారీ ర్యాలీగా వెళ్తున్న ఎంఎ.బేబీ, జాన్‌బ్రిట్టాస్, లోకనాథం తదితరులు

చింతూరులో ఆదివాసీలతో పాటు జాన్‌బ్రిట్టాస్ నృత్యం

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఘోరవైఫల్యం

- పోలవరం నిర్వాసితులకు గౌరవప్రదమైన జీవితం అందించడంలో తీవ్ర నిర్లక్ష్యం
- సమస్యలపై రాజ్యసభలోనూ, లోక్‌సభలోనూ నిలదీస్తాం
- సిపిఎం ప్రధాన కార్యదర్శి ఎంఎ.బేబీ, రాజ్యసభ ఫ్లోర్ లీడర్ జాన్ బ్రిట్టాస్

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

పోలవరం ప్రాజెక్టు కోసం సర్వం త్యాగం చేసిన నిర్వాసితులకు గౌరవప్రదమైన జీవితాన్ని అందించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఘోరంగా విఫలమయ్యాయని సిపిఎం ప్రధాన కార్యదర్శి ఎంఎ.బేబీ, ఆ పార్టీ రాజ్యసభ ఫ్లోర్ లీడర్ జాన్ బ్రిట్టాస్ అన్నారు. పోలవరం నిర్వాసితుల సమస్యలను తెలుసుకునేందుకు రెండు రోజుల పర్యటన నిమిత్తం వచ్చిన వారు అల్లూరి జిల్లా చింతూరులోని సిపిఎం కార్యాలయంలో ఆదివారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఎంఎ.బేబీ మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో అత్యంత కీలకమైన పునరా వాసానికి కేంద్ర ప్రభుత్వం రూ.33 వేల కోట్ల నిధులను విడుదల చేయడంలో నిర్లక్ష్యం తగదన్నారు. పునరావాస కాలనీల్లో తాము పర్యటించామని, కనీస సదుపాయాలు లేక నిర్వాసితులు తీవ్ర అవస్థలు పడుతున్నారని వివరించారు. పర్యటనలో పలు సమస్యలను గుర్తించామని, వాటి పరిష్కారానికి రాజ్యసభలోనూ, లోక్‌సభలోనూ ప్రభుత్వాలను నిలదీయనున్నామని తెలిపారు. క్షేత్రస్థాయిలో గిరిజనులను సంఘటితం చేసి పోరాటాన్ని ఉధృతం చేస్తామన్నారు. జాన్ బ్రిట్టాస్ మాట్లాడుతూ పోలవరం నిర్వాసితుల కాలనీల్లో ఎక్కడ చూసినా నాసిరకం నిర్మాణాలు దర్శనమిచ్చాయని తెలిపారు. గృహాలు నిర్మించిన మూడేళ్లకే స్లాబులకు లీకేజీలు ఏర్పడ్డాయన్నారు. తాగునీరు, విద్య, వైద్యం, రవాణా, ఉపాధి వంటి కనీస అవసరాలు కల్పించలేదని తెలిపారు. రాష్ట్రంలోని గత వైసిపి, ప్రస్తుత చంద్రబాబు ప్రభుత్వం, కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం నిర్లక్ష్యం పునరావాస కాలనీల్లో ప్రతిబింబిస్తోందన్నారు.

ఘన స్వాగతం

రెండో రోజు పర్యటనలో సిపిఎం బృందానికి చింతూరులో కొమ్ము డోలు నృత్యాలతో ఘన స్వాగతం లభించింది. ఆదివారం ఉదయం మారేడుమిల్లి నుంచి చింతూరులోని ఎర్రంపేటకు ఎంఎ. బేబీతో కూడిన సిపిఎం బృందం చేరుకుంది. ఎంఎ.బేబీ తలపై కొమ్ము టోపీ ధరించి గిరిజనులతో కలిసి సంప్రదాయ నృత్యం చేశారు. అనంతరం చింతూరు సెంటర్ వద్ద అమరవీరులకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.

2 రోజుల్లో 540 కిలోమీటర్లు

- పోలవరం ముంపు ప్రాంతాల్లో బేబీ, బ్రిట్టాస్ పర్యటన
- ప్రజలతో మమేకం, పాదయాత్రలు, కాలనీల్లో సభలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

వారిద్దరూ దేశ రాజకీయాల్లో కీలక నేతలు, ప్రతి క్షణం ప్రజల కోసం, పేదల బాగోగుల కోసం పరితపించే నాయకులు. కొద్ది సమయం కూడా విశ్రాంతి తీసుకోకుండా పోలవరం ముంపు ప్రాంతాల్లో రెండు రోజుల్లో సుమారు 540 కిలోమీటర్లకు పైబడి పర్యటించారు. మొత్తం మూడు సభల్లో పాల్గొన్నారు. ఎనిమిది చోట్ల పునరావాసులు ఉంటున్న కాలనీలను పరిశీలించారు. 20 ప్రాంతాల్లో పేదలు ఇచ్చిన వినతులు స్వీకరించారు. ఇదంతా రెండు రోజుల్లోనే అంటే పేదలపై వారికున్న ప్రేమ, ఆప్యాయతలు, వారికున్న సమస్యలు పరిష్కరించాలన్న తపనను అర్థం చేసుకోవచ్చు. వారెవరో కాదు సిపిఎం ప్రధాన కార్యదర్శి, మాజీ మంత్రి, సుదీర్ఘకాలం ప్రజా ప్రతినిధిగా పనిచేసిన ఎంఎ బేబీ, మరొకరు రాజ్యసభలో కేంద్రం చేస్తున్న తప్పులను ధైర్యంగా ఎత్తిచూపుతూ ఉత్తమ పార్లమెంటేరియన్‌గా నిలిచిన సిపిఎం ఫ్లోర్ లీడర్ జాన్ బ్రిట్టాస్.

రెండు రోజులపాటు శని, ఆదివారాల్లో వారు పోలవరం ముంపు మండలాలైన దేవీపట్నం, చింతూరు, కూనవరం, విఆర్ పురం, కుక్కునూరు, బుట్టాయిగూడెం, జీలుగుమిల్లి మండలాల్లో పర్యటించారు. శనివారం ఉదయం ఎంఎ బేబీ.. రాజమహేంద్రవరం నుంచి బయలుదేరి దేవీపట్నం మండలంలో పర్యటించారు. రాత్రికి మారేడిమిల్లి చేరుకున్నారు.

రామవరంలోని ఓ పూరింటిలో నివసిస్తున్న వారి సమస్యలు తెలుసుకుంటున్న ఎంఎ.బేబీ, జాన్‌బ్రిట్టాస్

ఆదివారం ఉదయం అక్కడ్నుంచి చింతూరు చేరుకున్నారు. మొత్తంగా తొలిరోజు, రెండోరోజు ఉదయం పర్యటన ప్రారంభానికి ముందే సుమారు 100 కిలోమీటర్లకు పైబడి పర్యటించారు. అలాగే ఆరుచోట్ల గిరిజనుల నుండి వినతులు స్వీకరించి వారు చెప్పిన సమస్యలు విన్నారు. ఒకచోట సభలో మాట్లాడారు. శనివారం ఉదయం విజయవాడ నుండి బయలుదేరిన ఎంపి జాన్ బ్రిట్టాస్.. ఏలూరు, జంగారెడ్డిగూడెం, బుట్టాయిగూడెం, జీలుగుమిల్లి మండలాల్లో పునరావాసుల ప్రాంతాల్లో పర్యటించారు. మూడు గ్రామాల్లో పర్యటించారు.

రెండు చోట్ల సభలో మాట్లాడారు. రెండుచోట్ల పునరావాస కాలనీల్లోకి వెళ్లి వర్షపు నీటితో కారిపోతున్న ఇళ్లను పరిశీలించారు. వారితో ముఖాముఖి మాట్లాడారు. అక్కడ్నుంచి రాత్రికి భద్రాచలం చేరుకున్నారు. తొమ్మిది గంటల నుండి పార్లమెంటుకు సంబంధించిన ఫైల్స్‌ను చూసుకున్నారు. విశ్రాంతి అనంతరం ఉదయం భద్రాచలం నుండి చింతూరు, అక్కడ్నుంచి విఆర్‌పురం, రేఖపల్లి, ఎటపాక మీదుగా సాయంత్రం 5 గంటల సమయానికి భద్రాచలం చేరుకున్నారు. ఈ పర్యటనలోనూ గిరిజనులతో మమేకం అయ్యారు. మహిళలు చెబుతున్న సమస్యలను ఓపికగా విన్నారు. సమయం లేదని నాయకులు చెబుతున్నా అమాయక గిరిజనుల సమస్యలను పూర్తిగా వింటానని అన్నారు. సమస్యలను లిఖిత పూర్వకంగా ఇస్తే తాను ఇంగ్లీషులోకి తర్జుమా చేయించుకుని పరిశీలించి, పార్లమెంటులో ప్రభుత్వం దృష్టికి తీసుకెళతానని అన్నారు. ముంపునకు గురవుతూ ప్రభుత్వాల నిర్లక్ష్యానికి గురైన గిరిజనులకు న్యాయం చేయడమే సిపిఎం లక్ష్యమని, దానికి అనుగుణంగా పనిచేస్తామని ప్రధాన కార్యదర్శి బేబీ కూడా వారికి హామీ ఇచ్చారు. ఒకవైపు వేడెక్కిన జాతీయ రాజకీయాలను చూస్తూ, మరోవైపు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ ఎంఎ బేబీ.. పేదలకు ధైర్యం చెబుతూ ముందుకు సాగితే.. పార్లమెంటులో ఎప్పటికప్పుడు సమస్యలు లేవనెత్తుతూ సెలవు వచ్చిన సమయంలో క్షేత్రస్థాయిలో పర్యటనకు వచ్చిన బ్రిట్టాస్ ఇద్దరూ సిపిఎం తరపున గిరిజనులకు న్యాయం జరిగే వరకూ నిలబడతామని హామీ ఇచ్చారు.

'ఇంక్విలాబ్ జిందాబాద్' ఎవరి నినాదం?

ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ (ఎఫ్‌బిఒ) పరీక్షల మోడల్ పేపర్

– జి. శ్యామ్,
పోటీ పరీక్షల ప్రత్యేక నిపుణులు,
కాకినాడ,
సెల్ : 9848136254,
9848256254

PART-A

29.ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పు కనుమలు, కొండ శ్రేణుల గురించి కింది ప్రకటనలలో ఏది సరైనది?

(1) హార్స్‌లీ హిల్స్ కోస్తా ఆంధ్రలోని నల్లమల శ్రేణిలో భాగం.
(2) తూర్పు కనుమలు ఆంధ్రప్రదేశ్ పొడవునా ఎటువంటి అంతరాయాలు లేకుండా నిరంతరాయంగా విస్తరించి ఉన్నాయి.
(3) ఆంధ్రప్రదేశ్‌లో ఎత్తైన శిఖరం తూర్పు కనుమలలో ఉన్న ఆర్మా కొండ.
(4) పాపికొండలు రాయలసీమ ప్రాంతంలో ఉన్నాయి.

30.వేచి ఉండే సమయాన్ని తగ్గించడానికి రూపొందించబడిన భారతదేశపు మొట్టమొదటి AI-ఆధారిత ట్రాఫిక్ సిగ్నల్ వ్యవస్థ 2025లో ఏ నగరంలో పైలట్ ప్రాజెక్ట్‌గా ప్రారంభించబడింది?

(1) బెంగళూరు (2) ఢిల్లీ (3) పూణే (4) లక్నో

31. అంతర్జాతీయ బుకర్ ప్రైజ్ 2025 గురించి కింది ప్రకటనలను పరిగణించండి:

(a) ఈ అవార్డు ఆంగ్ల భాషలో వ్రాసిన సాహిత్య రచనకు ప్రదానం చేయబడుతుంది.
(ఎ) ఇది ఆంగ్ల భాషలో అంతర్జాతీయ సాహిత్యాన్ని ప్రోత్సహించే వార్షిక అవార్డు.
పైన ఇచ్చిన ప్రకటనలలో సరైనది/వి ఏవి ?
(1) (a) మాత్రమే (2) (ఎ) మాత్రమే
(3) (a), (ఎ) (4) ఏదీకాదు

32.స్వాతంత్ర్య పోరాట సమయంలో జరిగిన సంఘటనలను ఆరోహణ క్రమంలో గుర్తించండి ?

(a) జలియన్‌వాలా బాగ్ సంఘటన.
(ఎ) ఇండియన్ నేషనల్ ఆర్మీ సహాయం కోసం సుభాష్ చంద్రబోస్ జపాన్ చేరిన రోజు.
(c) గాంధీజీ ద్వారా దండి మార్చ్.
(d) గాంధీజీ ద్వారా చంపారన్ సత్యాగ్రహం.
(వ) గాంధీజీ ద్వారా క్విట్ ఇండియా ఉద్యమం.
(ట) భగత్‌సింగ్, రాజ్‌గురు మరియు సుఖ్‌దేవ్‌లను లాహోర్ జైలులో ఉరితీసిన సంఘటన.

(1) (c), (b), (a), (d), (f), (e)
(2) (a), (b), (c), (d), (e), (f)
(3) (d), (a), (c), (f), (e), (b)
(4) (d), (b), (f), (a), (e), (c)

33.విశాలాంధ్ర ఏర్పాటులో జరిగిన ముఖ్య పరిణామాలకు సంబంధించి సరైనవి గుర్తించండి ?

(a) ఫిబ్రవరి 20, 1956 – పెద్ద మనుషుల ఒప్పందం.
(ఎ) ఏప్రిల్ 13, 1956 – హైదరాబాద్ అసెంబ్లీలో విశాలాంధ్ర తీర్మానం ఆమోదం.
(c) ఆగస్టు 25, 1956 – రాష్ట్రాల పునర్ వ్యవస్థీకరణ బిల్లుకు పార్లమెంట్ ఆమోదం.

(1) (a), (b) (2) (b), (c) (3) (a), (c) (4) (a), (b), (c)

34. అతివాదులు మరియు మితవాదులుగా కాంగ్రెస్ సూరత్ సమావేశంలో ఏ సంవత్సరంలో విడిపోయింది ?

(1) 1905 (2) 1906 (3) 1907 (4) 1909

35.ఈ క్రింది వాటిని జతపరచండి.

జాబితా–I	జాబితా–II
(a) లార్డ్ డల్హౌసి	(i)స్థానిక స్వపరిపాలన
(ఎ) విలియం బెంటిక్	(ii) పిండారీలు
(c) లార్డ్ హేస్టింగ్స్	(iii) థగ్గులు
(d) లార్డ్ రిప్పన్	(iv) ఔధ్ (అవధ్) ఆక్రమణ

(1) (a)-(iv), (b)-(iii), (c)-(i), (d)-(ii) (2) (a)-(i), (b)-(ii), (c)-(iii), (d)-(iv)
(3) (a)-(iv), (b)-(i), (c)-(iii), (d)-(ii) (4) (a)-(iv), (b)-(iii), (c)-(ii), (d)-(i)

36."ఇంక్విలాబ్ జిందాబాద్" అనే నినాదాన్ని లేవనెత్తిన నాయకుడు ఎవరు ?

(1) జతిన్‌దాస్ (2) సుభాష్ చంద్రబోస్
(3) భగత్‌సింగ్ (4) గోపాలకృష్ణ గోఖలే

37. ఈ క్రింది వాటిని జతపరచండి.

జాబితా–I	జాబితా–II
(a) మోటుపల్లి అభయ శాసనం	(i) కాయస్త అంబదేవుడు
(ఎ) చందుపట్ల శాసనం	(ii) గణపతిదేవుడు
(c) విప్పర్ల శాసనం	(iii) దేవి నాగానిక
(d) నానాఘట్ శాసనం	(iv) జయసింహ వల్లభుడు

(1) (a)-(iv), (b)-(iii), (c)-(i), (d)-(ii)
(2) (a)-(ii), (b)-(i), (c)-(iv), (d)-(iii)
(3) (a)-(iv), (b)-(i), (c)-(iii), (d)-(ii)
(4) (a)-(iv), (b)-(iii), (c)-(ii), (d)-(i)



38. ఆంధ్రప్రదేశ్‌లో లభ్యమైన తొలి తామ్ర శాసనం ఎవరిది ?

(1) శాతవాహనులు (2) బృహత్పలాయనులు
(3) ఆనంద గోత్రికులు (4) ఇక్ష్వాకులు

39. మోతీలాల్ నెహ్రూ మరియు సి.ఆర్. దాస్ 1923 సంవత్సరంలో స్థాపించిన పార్టీ పేరు ఏమిటి ?

(1) ఇండియన్ ఇండిపెండెన్స్ లీగ్ (2) గద్దర్ పార్టీ
(3) స్వరాజ్ పార్టీ (4) ఇండియన్ నేషనల్ ఆర్మీ

40. ఈ క్రింది వాటిలో ఇచ్చిన గ్రహాలను వాటి పరిమాణాన్ని బట్టి సరైన ఆరోహణ క్రమ వరుసలో ఉండునవి ఏవి ?

(1) భూమి, వరుణుడు, శుక్రుడు, కుజుడు, బుధుడు
(2) కుజుడు, బుధుడు, భూమి, శుక్రుడు, వరుణుడు
(3) బుధుడు, కుజుడు, శుక్రుడు, భూమి, వరుణుడు
(4) వరుణుడు, భూమి, శుక్రుడు, కుజుడు, బుధుడు

41. ఈ క్రింది వాటిని జతపరచండి.

జాబితా–I	జాబితా–II
(a) గోదావరి నది	(i) ఊటుకూరు
(b) కృష్ణా నది	(ii) కళింగపట్నం
(c) పెన్నా నది	(iii) అంతర్వేది
(d) వంశధార నది	(iv) హంసలదీవి

(1) (a)-(iv), (b)-(iii), (c)-(i), (d)-(ii)
(2) (a)-(i), (b)-(ii), (c)-(iii), (d)-(iv)
(3) (a)-(iv), (b)-(i), (c)-(iii), (d)-(ii)
(4) (a)-(iii), (b)-(iv), (c)-(i), (d)-(ii)

42.భారతదేశంలో మిరపకాయ అత్యధికంగా పండించే రాష్ట్రాన్ని ఈ క్రింది వానిలో గుర్తించండి ?

(1) కేరళ (2) గుజరాత్
(3) ఆంధ్రప్రదేశ్ (4) కర్ణాటక

43.ఈ క్రింది వాటిని జతపరచండి.

జాబితా–I		జాబితా–II
(a) కల్పక్కం	(i)	గుజరాత్
(b) నరోరా	(ii)	కర్ణాటక
(c) కైగా	(iii)	ఉత్తరప్రదేశ్
(d) కాక్రపారా	(iv)	తమిళనాడు

(1) (a)-(iv), (b)-(iii), (c)-(i), (d)-(ii)
(2) (a)-(i), (b)-(ii), (c)-(iii), (d)-(iv)
(3) (a)-(iv), (b)-(i), (c)-(iii), (d)-(ii)
(4) (a)-(iv), (b)-(iii), (c)-(ii), (d)-(i)

44.భూ ఉపరితలం నుండి వాతావరణ పొరలను సరైన క్రమంలో అమర్చండి ?

(1) ట్రోపో, స్ట్రాటో, థర్మో, మీసో, ఎక్సో ఆవరణాలు
(2) ట్రోపో, స్ట్రాటో, మీసో, థర్మో, ఎక్సో ఆవరణాలు
(3) ట్రోపో, మీసో, స్ట్రాటో, థర్మో, ఎక్సో ఆవరణాలు
(4) ట్రోపో, థర్మో, స్ట్రాటో, మీసో, ఎక్సో ఆవరణాలు

45. ఆంధ్రప్రదేశ్ యొక్క సరిహద్దు రాష్ట్రాలను ఈ క్రింది వానిలో గుర్తించండి ?

(1) తెలంగాణ, మధ్యప్రదేశ్, ఒడిశా, తమిళనాడు, కర్ణాటక

(2) ఒడిశా, మహారాష్ట్ర, కర్ణాటక, ఛత్తీస్‌ఘడ్
(3) తెలంగాణ, ఒడిశా, ఛత్తీస్‌ఘడ్, కర్ణాటక, తమిళనాడు
(4) మహారాష్ట్ర, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు

46.ఈ క్రింది వాటిని జతపరచండి.

జాబితా–I	జాబితా–II
(a) రోళ్లపాడు	(i) విశాఖపట్నం
(b) కౌండిన్య	(ii) తిరుపతి
(c) పులికాట్	(iii) చిత్తూరు
(d) కంబాల కొండ	(iv) నంద్యాల

(1) (a)-(iv), (b)-(iii), (c)-(ii), (d)-(i)
(2) (a)-(i), (b)-(ii), (c)-(iii), (d)-(iv)
(3) (a)-(iv), (b)-(i), (c)-(iii), (d)-(ii)
(4) (a)-(iv), (b)-(iii), (c)-(i), (d)-(ii)

47.ఆంధ్రప్రదేశ్‌లో యురేనియం అత్యధికంగా ఉత్పత్తి చేసే ప్రాంతం ఈ క్రింది వాటిలో ఏది ?

(1) అగ్నిగుండాల (2) తుమ్మలపల్లి
(3) కోడూరు (4) ఓబులాపురం

48.నూతన జిల్లాల పునర్విభజన ప్రకారం "మారేడుమిల్లి" ఆంధ్రప్రదేశ్‌లోని ఏ జిల్లాలో ఉన్నది ?

(1) తూర్పుగోదావరి జిల్లా (2) మన్యం జిల్లా
(3) కాకినాడ జిల్లా (4) అల్లూరి సీతారామరాజు జిల్లా

49. భారత రాజ్యాంగంలో ప్రాథమిక హక్కులను ఏ భాగంలో పొందుపరిచారు ?

(1) రెండవ భాగం (2) మూడవ భాగం
(3) నాల్గవ భాగం (4) ఐదవ భాగం

50.పంచాయతీ ఎన్నికల నిర్వహణ నిర్ణయాన్ని క్రింది వాటిలో ఎవరు తీసుకుంటారు?

(1) కేంద్ర ప్రభుత్వం (2) రాష్ట్ర ప్రభుత్వం
(3) జిల్లా జడ్జి (4) ఎన్నికల సంఘం

51. ఏ ఆర్టికల్ క్రింద పంచాయతీలకు రాజ్యాంగ హోదా ఇవ్వబడింది ?

(1) 219 (2) 226 (3) 239 (4) 243

52."డబ్బు అనేది మొత్తం ఆర్థిక వ్యవస్థ చుట్టు తిరిగే ఇరుసు" అని ఎవరు చెప్పారు?

(1) కీన్స్ (2) రాబర్ట్‌సన్
(3) మార్షల్ (4) హాట్రీ

53. వద్దులకు, వారిని చూసుకోవడానికి ఎవరూ లేనప్పుడు వారికి జీవనం సాగించడానికి ఇచ్చే పెన్షన్ పథకం క్రింది వాటిలో ఏది?

(1) మధ్యాహ్న భోజన పథకం
(2) ప్రధాన్ మంత్రి జన్–ధన్ యోజన
(3) జాతీయ సామాజిక సహాయ కార్యక్రమం
(4) వాల్మీకి అంబేద్కర్ ఆవాస్ యోజన

54. పేదల కోసం ఆహారం మరియు పోషణను అందించే లక్ష్యంగా ఉన్న కార్యక్రమం క్రింది వాటిలో ఏది?

(1) PDS (2) ICDS
(3) మధ్యాహ్న భోజన పథకం (4) పైవన్నీ

55. జన్–ధన్ యోజన కింద ఖాతాదారుడు ?

(1) రూ.1000 కనీస బ్యాలెన్స్ నిర్వహించాలి
(2) రూ.5000 కనీస బ్యాలెన్స్ నిర్వహించాలి
(3) రూ.2000 కనీస బ్యాలెన్స్ నిర్వహించాలి
(4) కనీస బ్యాలెన్స్ నిర్వహించాల్సిన అవసరం లేదు

56. దిగుమతులు మరియు ఎగుమతుల విలువ ఒకేలా ఉంటే నికర ఆదాయం ?

(1) సానుకూలం (2) ప్రతికూలం
(3) సున్నా (4) సమానం

57. ప్రధానమంత్రి గ్రామీణ డిజిటల్ సాక్షరత అభియాన్ పథకాన్ని ఏ సంవత్సరంలో ప్రారంభించారు ?

(1) 2014 (2) 2015
(3) 2016 (4) 2017

58. ఐక్యరాజ్యసమితి 17 సుస్థిరాభివద్ధి లక్ష్యాలను (SDGs) ఏ సంవత్సరం నాటికి సాధించాలని లక్ష్యంగా పెట్టుకుంది?

(1) 2025 (2) 2028
(3) 2030 (4) 2035

59. ఈ క్రింది వాటిలో GST పరిధిలోకి రానిది ఏది?

(1) వస్త్రాలు (2) రెస్టారెంట్లు
(3) బంగారం (4) ఆల్కహాల్

60.ప్రభుత్వ అధికారం ద్వారా జారీ చేయబడిన ద్రవ్యంను ఎలా పిలుస్తారు ?

(1) పూర్తి స్థాయి ద్రవ్యం (2) క్రెడిట్ ద్రవ్యం
(3) ఫియట్ ద్రవ్యం (4) ఫిడ్యూషియరీ ద్రవ్యం

జవాబులు :
(29) 1 (30) 2 (31) 4 (32) 3 (33) 4 (34) 3
(35) 4 (36) 3 (37) 2 (38) 2 (39) 3 (40) 3
(41) 4 (42) 3 (43) 4 (44) 2 (45) 3 (46)1
(47) 2 (48) 4 (49) 2 (50) 2 (51) 4 (52) 3
(53) 3 (54) 4 (55) 4 (56) 3 (57) 4 (58) 3
(59) 4 (60) 3

అక్షరం

ప్రజాశక్తి
www.prajasakti.com
facebook/prajasakti, twitter/prajasakti

4 | విజయవాడ
సోమవారం 18 ఆగస్టు 2025



ఏ కాలపు జీవితాన్ని విమర్శించేది ఆ కాలపు సాహిత్యం. నేటి జీవితాన్ని విమర్శించ లేనిది, నేటి భావాలను సంస్కరించలేనిది, నేటి జీవితాన్ని అలంకరించలేనిది, నేటి సాహిత్యం కానే కాదు ... కానేరదు.

– కొడవటిగంటి కుటుంబరావు

చరిత్ర!

చూస్తుండగానే
చరిత్ర రంగు మారుతోంది
'ఛూ .. మంత్రకాళీ' అన్నట్టుగా
కొత్త తలకాయలు వచ్చి చేరుతున్నాయి
చరిత్ర నిండా, దేశం నిండా బుల్‌బుల్ పిట్టలు
మాయా తివాచీలై ఎగురుతున్నాయ్!

గాంధీ హంతకుడై తలదించుకుంటున్నాడు
గాడ్సే రక్షకుడై గర్వహాసం విసురుతున్నాడు
భగత్‌సింగ్ చరిత్రలోంచి అదృశ్యమయ్యాడు
పిరికిమూక ముందు పుటల్లో
పీఠమేసుకు కూర్చుంటుంది!
చరిత్ర తనను చూసి
తానే ఫక్కున నవ్వుకుంటోంది!

బుర్రకాయలన్నీ తొర్రమానులైనప్పుడు
ఎండ్రకాయలు చెప్పిందే చరిత్ర
కలిసి నడిచిన దారి నిండా
విద్వేషకారుల అబద్ధాల నగ్న యాత్ర!
దేశం మళ్లీ తన చరిత్రపై తాను నిలబడ్డానికీ
బెత్తం పట్టుకొని చెత్తను వదిలించే
చరిత్రకారులు కావాలి
చెదలు పడుతున్న చరిత్రకు
తక్షణం శస్త్ర చికిత్స చేయాలి!

– శాంతిమిత్ర

ప్రపంచ మానవులారా..!

కంఠంలో నీళ్ళాడుతూ బుగ్గల్లో పాలుగారే
ఆ పాలస్తీనా పసిపాపలు
ఇంకా నా కళ్ళముందు మెరుస్తూనే వున్నారు!

ఇవాళ వాళ్ళంతా ఏరీ?

ఇంద్రధనుస్సు గాలిపటాల్ని
కలువకాడల చేతివేళ్ళతో చెర్లాడిస్తూ
లేడిపిల్లల్లా గంతులేసే ఆ గాజా చిన్నారులు
ఇంకా నా కనురెప్పల ప్రాంగణంలో
కలదిరుగుతూనే వున్నారు!

ఇవాళ వాళ్ళంతా ఎక్కడ?

యుద్ధ బీభత్సపు కర పరిహాసానికి
కన్నీళ్ళు కూడా ఇంకిపోయి
చేవలేని కట్టె పుల్లల్లా
చావుకు దగ్గరైన బక్క పీనుగుల్లా
ఎంత కళా విహీనంగా మారిపోయారు!
గుండెల్ని పిండేసే ఆకలి చూపులతో
దిక్కుల్లోని దాతృత్వాన్ని ఎక్స్ రే కళ్ళతో లెక్కగడుతూ
ఆదుకునే చేతుల కోసం
ఎంత దయనీయంగా అల్లాడిపోతున్నారు!

ఆ భయానక దృశ్యాలు చూసి
ప్రపంచ మానవీయ హృదయాలన్నీ
భళ్ళున బద్దలై భగ్గున మండి
దుక్కబలిసిన రహదార్లకు సైతం
చుక్కలు చూపిస్తున్నా
మీ మనసులు మాత్రం కరగటం లేదేం?
తోలుమందంతో బిరుసెక్కిన
మీ అవకాశవాద గొడుగులు మాత్రం
ఇంకా చిరగటం లేదేం?

కదలని మిత్రమా,
నీ వెన్నెముక కుళ్ళిపోయినట్టుంది... వెళ్ళు!
వెళ్ళీ, ఆ గాజా శిధిల భవనాల కింద
అస్థిపంజరాల్లోంచి ఒక ఎముకను
ఏరి తెచ్చుకొని నీ వెన్నుకతికించుకో!

ఐక్యరాజ్య సమితీ...!
నీ మానవీయ లక్ష్యాలు మంటగలుస్తున్నాయ్!
నువ్వింక బతికివుండటం వథా!

ప్రపంచ మానవులారా... మీరెటువైపు?
న్యాయం వైపే ఐతే...
ఇంక ఏ మీన మేషాలూ లెక్కించకుండా
ఏ కొంపలు మాపే గంపలకిందా నక్కిపోకుండా
నెత్తురింకిపోయిన గాజా పిల్లల
ఎముకల గూళ్ళను
ప్రేమగా గుండెలకు హత్తుకోండి!
అగ్రవాద ఆక్టోపస్ టెంటకిళ్ళ పొగరు దించి
దుర్మార్గపు యూదు దురహంకారం
మొహమ్మీద కాండ్రించి ఉమ్మేయండి!!

– పతివాడ నాస్తిక్, 94417 24167

ఎర్రలు

ఎర్రలు రైతు మిత్రులు
దొడ్డదారల్లా ఉంటాయి
దొడ్డ పనులు చేస్తాయి.

నేలను గుల్ల చేసి నీళ్ల పారిస్తాయి
ఎరువుల తయారీలో
మిషన్లను వెక్కిరిస్తాయి.
అలలు అలలుగా
ముడుచకపోతాయి
అదే వాటి నడక.

వేర్లకు నీళ్లందిస్తూ
పైర్లను ప్రేమిస్తాయి
భూగర్భంలోని
సృష్టి వైచిత్రికి నిదర్శనాలు
చీకట్లో అన్నం వెలుగుల దర్శనాలు

వాన పాములని పేరున్నా
ఎర్రలు కరువవు గాని
ఇంత గొప్ప ప్రక్రియ
విలువ తెలియని
దళారులను మాత్రం
కుడితే బాగుండును!

– డాక్టర్ ఎన్.గోపీ

పుస్తకాలపై నిషేధం నిరంకుశ చర్య



సందర్భం

ఎదురు కాల్పుల్లో ఫలానా అంతమంది ఉగ్రవాదులు మరణించారనో లేక ఉగ్రవాదుల దాడిలో ఇంతమంది సైనికులు మరణించారనో, కర్ఫ్యూ విధించారనో, ఇంటర్నెట్ నిరవధికంగా బంద్ పెట్టారనో, కార్బన్ సెర్చ్ నిర్వహించారనో, లేక ప్రజలు హర్తాళ్ పాటించారనో తప్పితే మన ప్రధాన స్రవంతి ప్రచార, ప్రసార సాధనాలు కశ్మీర్ గురించిన వార్తలు ఇవ్వవు. అక్కడ కూడా ఈ దేశంలోని మిగతా అన్ని రాష్ట్రాల్లో వలె జనం ఉన్నారు, ప్రభుత్వం ఉంది. జనం కష్టనష్టాలు ఆ ప్రభుత్వం పట్టించుకుంటుందా లేదా అనేది మీడియాకు అస్సలు పట్టలేదు. ఇక బాలీవుడ్, టాలీవుడ్, కోలీవుడ్‌లలో ఉగ్రవాదం మీద సినిమా అంటూ తీస్తే అది కశ్మీర్ అయి ఉంటుంది. ఉగ్రవాదులు ముస్లిములై ఉంటారు. ఒక రాష్ట్రాన్ని, అందలి ప్రజానీకాన్ని ఈ విధంగా నేరస్థులుగా చిత్రించడం ఆధునిక ప్రజాస్వామ్య వ్యవస్థలో చెల్లుబాటు కావడం నిజంగా సిగ్గుచేటైన విషయం. 200 ఏళ్ల పాటు ఈ దేశాన్ని పాలించిన బ్రిటిష్ వాళ్ళు ఈ రకంగా కొన్ని ఆదివాసీ సమూహాల మీద నేరస్థ జాతులుగా ముద్ర వేసారు. స్వాతంత్ర్యానంతరం క్రమంగా ఆ జాబితాను పరిహరించారు. ఆంధ్ర రాష్ట్రంలో స్టూవర్టుపురం గ్రామం మీద దొంగల ఊరు అనే ముద్ర వేశారు. హేమలత లవణం వంటి సామాజిక కార్యకర్తలు ఆ పేరు రూపుమాపేందుకు విశేషంగా కృషి చేశారు. కానీ ఒకప్పుడు రాజసంస్థానంగా ఉన్న కశ్మీర్‌కు స్వయం ప్రతిపత్తి కల్పిస్తే భారతదేశంలో విలీనం కావడానికి నిర్ణయించుకున్న అక్కడి ప్రజానీకాన్ని ఉగ్రవాద మూకగా చిత్రించడం ఎంతటి నేరం. దేశ రక్షణ అవసరాల రీత్యా, భౌగోళికంగా కశ్మీర్ చాలా కీలకమైన ప్రాంతం. కాబట్టి అక్కడి ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలు నెరవేర్చి వారు తీసుకున్న విలీన నిర్ణయం సబబైనదని భావించేలా చెయ్యడం కేంద్ర ప్రభుత్వ కనీస బాధ్యత. అయితే ఈ బాధ్యత నిర్వర్తించడంలో వరుసవారీ ప్రభుత్వాలు అత్యంత నిర్లక్ష్యపూరితంగా వ్యవహరించాయి. కశ్మీర్ ప్రజానీకాన్ని నిరాశకు గురి చేశాయి. ఇలాంటి సంక్షుభిత నేపథ్యంలో ఉగ్రవాదం వేళ్ళూనుకోవడం సహజ పరిణామక్రమం. అసోంలో, నాగాలాండ్‌లో, త్రిపుర రాష్ట్రాల్లో ఇలాంటి సంక్షోభాలు తలెత్తాయి. చర్చల ద్వారా వాటిని పరిష్కరించుకోగలిగాం. కానీ కశ్మీర్ విషయానికి వచ్చేసరికి సైనిక బలప్రయోగం ద్వారా పరిష్కరించాలని ప్రభుత్వం ప్రయత్నిస్తుంది. ఇది సమస్యను మరింత జఠిలం చెయ్యడమే కాకుండా అక్కడి ప్రజానీకం పరాయీకరణకు గురవడం మరింత విషాదం.

మతతత్వ రాజకీయాలను ఆలంబనగా చేసుకున్న బిజెపి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఈ పరిస్థితులు మరింత దిగజారాయి. కశ్మీర్ రాష్ట్రానికి రాజ్యాంగంలోని ఆర్టికల్ 370 ద్వారా ఒనగూడిన స్వయం ప్రతిపత్తిని 2019లో రద్దు చెయ్యడమే కాకుండా కశ్మీర్‌ను కేంద్రపాలిత ప్రాంతంగా ప్రకటించి ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వానికి ఎలాంటి విశేషాధికారాలు లేకుండా చేసి లెఫ్టినెంట్ గవర్నర్ ద్వారా కేంద్ర ప్రభుత్వమే అధికారం చెలాయిస్తుంది. కశ్మీర్ పత్రికల మీదా, జర్నలిస్టుల మీద తీవ్ర నిర్బంధపూరిత చర్యలకు పాల్పడుతోంది. పాత్రికేయులైన సాజద్ గుల్, ఫహద్ షాల ఇంటి మీద ఎన్ఐఏ దాడి చేసి అరెస్టులు చేసింది. సనా ఇర్షాద్ మంటోకు పులిట్జర్ ఉత్తమ ఛాయాచిత్రకారుడిగా బహుమతి ప్రకటిస్తే దానిని అందుకోవడానికి వీలు లేకుండా మంటో విదేశీయానానికి నిరాకరించింది. అనేకమంది జర్నలిస్టులు, సామాజిక కార్యకర్తలు, మేధావులను నో ఫ్లై లిస్టులో చేర్చింది. కశ్మీర్ అంశం మీద వివిధ అంతర్జాతీయ పత్రికలకు వ్యాసాలు రాసే అనేకమంది జర్నలిస్టులు తమ పాస్‌పోర్టులు ప్రభుత్వానికి స్వాధీనం చెయ్యాలని, లేకుంటే తగిన చర్యలు తీసుకుంటామని బెదిరించి మరీ పాస్ పోర్టులు లాగేసుకుంది. మానవ హక్కుల కార్యకర్త కుర్రమ్ పర్వేజ్‌ను అరెస్టు చేసింది. ఆర్టికల్ 370 రద్దు చెయ్యడం ద్వారా కశ్మీర్‌ను భారతదేశ ప్రధాన స్రవంతిలో అంతర్భాగం చేశామని, కశ్మీర్ అభివృద్ధికి అనేక ప్రణాళికలు వేశామని కేంద్ర ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటున్నది. అదే నిజమైతే ఇప్పుడు సాగిస్తున్న ఈ నిర్బంధకాండకు అర్థం ఏమిటి? దీనికి కొనసాగింపుగానే ఇప్పుడు కశ్మీర్‌పై వివిధ ప్రముఖ రచయితలు వెలువరించిన 25 పుస్తకాలను నిషేధిస్తున్నట్లు ప్రకటించారు. ఈ పుస్తకాల జాబితాలో భారత రాజ్యాంగ నిపుణుడు, ప్రజా మేధావి ఎ.జి.నూరానీ రాసిన విస్తృతంగా ప్రశంసలు పొందిన ది కాశ్మీర్ డిస్ప్యూట్, బ్రిటిష్ రచయిత్రి, చరిత్రకారిణి విక్టోరియా స్కోఫీల్డ్ రాసిన కాశ్మీర్ ఇన్ కాన్ఫ్లిక్ట్ – ఇండియా, పాకిస్తాన్ అండ్ ది అన్‌ఎండింగ్ వార్, బుకర్ ప్రైజ్ విజేత అరుంధతి రాయ్ రాసిన ఆజాది, లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ ప్రొఫెసర్ సుమంత్ర బోస్ రాసిన కాంటెస్టెడ్ ల్యాండ్స్ ఉన్నాయి. నిషేధించబడిన పుస్తకాల్లో కొన్నిటిని పెంగ్విన్, బ్లూమ్స్‌బరీ, హార్పర్‌కాలిన్స్, పాన్ మాక్‌మిలన్ ఇండియా, రౌట్‌లెడ్జ్, వెర్సో బుక్స్ వంటి ప్రముఖ పుస్తక ప్రచురణా సంస్థలు ప్రచురించాయి. "ఈ పుస్తకాలు జమ్మూ కాశ్మీర్ చారిత్రక లేదా రాజకీయ వ్యాఖ్యానం ముసుగులో యువతను తప్పుదారి పట్టించడంలో, ఉగ్రవాదాన్ని స్తుతించడంలో, భారత రాజ్యంపై హింసను ప్రేరేపించడంలో కీలక పాత్ర పోషించాయి. ఇవి దేశ సార్వభౌమత్వానికి ప్రమాదకరంగా పరిణమించాయి" అని పేర్కొంటూ గవర్నరు ఆదేశాల మేరకు మొత్తం 25 పుస్తకాలను నిషేధించారు. ఇవి పస లేని ఆరోపణలు. ఒకపక్కన శ్రీనగర్‌లో చినార్ పుస్తక మహోత్సవాలు జరుగుతున్న నేపథ్యంలోనే ఈ 25 పుస్తకాలను నిషేధించడం కేంద్ర ప్రభుత్వ ద్వంద్వ వైఖరికి నిదర్శనం.

హిందుత్వ శక్తులు అధికారంలోకి వచ్చాక దేశంలో అసహన వాతావరణం పెరిగిపోవడం, కార్పొరేట్ మీడియా మోడీను తిరుగులేని నాయకుడిగా అవధులు మించి ప్రచారం చెయ్యడం, బిజెపి ప్రభుత్వ నియంతృత్వ పాలన పట్ల ప్రధాన ప్రతిపక్ష రాజకీయ పార్టీలు చేష్టలు ఉడిగిపోయినట్లు మిన్నకుండిపోయిన నేపథ్యంలో ఈ దేశంలో రచయితలే తొలిసారిగా నిరసన బావుటా ఎగురవేశారు. అవార్డ్ వాపసీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. తదనంతరం జెఎన్‌యు, జామియా మిలియాలతో మొదలుపెట్టి విద్యార్థిలోకం నిరసనలకు పూనుకున్నారు. రోహిత్ వేముల బలవన్మరణానికి వ్యతిరేకంగా దేశవ్యాప్త నిరసనలు వెల్లువెత్తాయి. ఆ తర్వాత పౌరసత్వ సవరణ చట్టానికి వ్యతిరేకంగా షాహీన్ బాగ్ ఆందోళన, మహారాష్ట్ర రైతుల లాంగ్ మార్చ్, మూడు వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా రైతుల సమరశీల ఆందోళన.. ఇలా పోరాటాల వెల్లువ సాగింది. రచయితలు అప్రకటిత శాసనకర్తలు అన్న నానుడిని నిజం చేస్తూ సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీతలు మొదలుపెట్టిన నిరసన హిందుత్వ శక్తులకు తొలి సవాలు విసిరారు. ఇప్పుడు నిషేధించబడిన 25 పుస్తకాలూ ప్రభుత్వ ఆధిపత్య ధోరణులను ఎండగట్టేవే. అందుకే ఈ నిషేధం. ప్రజాస్వామికవాదులు అందరూ ముక్తకంఠంతో ఈ నిషేధాన్ని నిరసించాలి.

– సత్యరంజన్

'వేగుజుక్క' వారసుడు వెంకటరావు

నివాళి

ప్రతిభాపాటవాలు అందరికీ ఒకేలా ఉండవు. కొందరికి తక్కువగానూ, మరికొందరికి ఎక్కువగానూ ఉంటాయి. ఒక్కోసారి అత్యంత ప్రతిభ ఉన్నవారు సైతం కనుమరుగు కాకతప్పదు. కళారంగంలో ఇలా కనుమరుగైన వారికి కొదువే లేదు. అందునా సాహిత్య రంగంలో ప్రతిభా విశేషాలు అపారంగా ఉన్నప్పటికీ, సంబంధిత సమాజంలో తగినంత గుర్తింపు లేక చాలామంది విస్మృతికి గురౌతుంటారు. కళింగాంధ్ర నవలా రచయిత 'గంధవరపు వెంకటరావు' ఈ కోవకు చెందినవారు. విజయనగరం జిల్లా రాజాం పట్టణంలో జన్మించిన ఆయన తన 93వ యేట గత జూలై 22వ తేదీన కన్నుమూశారు. రచయితగా, ముద్రణాలయ నిర్వాహకునిగా, సమాజ సేవకునిగా విశేష సేవలు అందించారు. ఆయన కలం నుంచి జాలువారిన నవలలు నాలుగు. అవి 'మారిన దొంగలు, తోడు కోసం, దైవ సంకల్పం, పూల బంతులు.'

1993లో ఈయన రాసిన 'టాలెంట్ వేర్ డజ్ యువర్ క్వెస్ట్ ఎండ్' అనే రచన 'ఇన్వెన్షన్ ఇంటిలిజెన్స్' అనే ఇంటర్నేషనల్ మ్యాగజైన్‌లో ప్రచురించబడింది. దానికిగాను వెంకటరావు పదివేల రూపాయలు పారితోషికం అందుకున్నారు. ఈ సందర్భంగా విశాఖపట్నంలో జరిగిన 'సైన్స్ పరిశోధన డే'లో న్యూజిలాండ్ దేశపు విద్యార్థి ఒకరు వెంకటరావును ప్రత్యేకంగా ప్రశంసించారు. ఒకప్పుడు సాహితీ సమాజంలో విశేషంగా పేరుగాంచిన 'వేగుజుక్క ముద్రణాలయం' తర్వాత కాలంలో వెంకటరావుచే నిర్వహించబడింది. ఈ ముద్రణాలయానికి గొప్ప చరిత్ర ఉంది. 1910లో ప్రముఖ సాహిత్యవేత్త దేవరాజు వేంకట కృష్ణారావు వేగుజుక్క ముద్రణాలయాన్ని బరంపురం పట్టణంలో స్థాపించారు. 1911లో తాపీ ధర్మారావుతో కలిసి వేగుజుక్క గ్రంథమాల అనే సంస్థను నెలకొల్పారు. 1914లో అదే వేగుజుక్క పేరుమీద ఓ పత్రిక కూడా నడిచేది. ఈ సంస్థ ఐదు దశాబ్దాల పాటు బరంపురంలో సేవలందించింది. ఈ సంస్థ నుంచే వేంకట కృష్ణారావు గారి 'వాడే వీడు' అనే అపరాధ పరిశోధక నవల ప్రచురించబడింది. ఇది మొట్టమొదటి తెలుగు అపరాధ పరిశోధక నవల. ఈ నవల శ్రీశ్రీకి అత్యంత ప్రియమైనది. తర్వాత వేంకట కృష్ణారావు రాసిన 'నేనే, కాలూరాయి' అనే డిటెక్టివ్ నవలలు కూడా వేగుజుక్కలోనే ముద్రించబడ్డాయి. వీటితోపాటు ఇతర కవుల, రచయితల గ్రంథాలు కూడా వేగుజుక్క పెద్దయెత్తున ప్రచురించింది.

దేవరాజు వెంకట కృష్ణారావు ఆదరాభిమానాలు పొందిన వ్యక్తి గంధవరపు వెంకటరావు. ప్రింటింగ్ నైపుణ్యం, వాటి యంత్రాల నిర్వహణ విద్యను బెజవాడలో నేర్చుకున్నారు. ఉద్యోగం వేటలో భాగంగా వెంకటరావు బరంపురం వెళ్లారు. అప్పటికే అక్కడ నిర్వహించబడుతున్న వేగుజుక్క ముద్రణాలయానికి వెళ్లారు. వెంకట కష్ణారావు గారు వెంకటరావుకు ఉద్యోగమిచ్చి తన ప్రెస్సులో చేర్చుకున్నారు. తన ఇంటి వద్దనే భోజనాది వసతులు కల్పించారు. ఎంతో నమ్మకంతో ఆ ప్రెస్‌లో వెంకట్రావు పనిచేశారు. అలా వారి మధ్య అవ్యాజానురాగ బంధం ఏర్పడింది. ఇలా కొనసాగుతున్న క్రమంలో 1962లో వేంకట కృష్ణారావు గారు వయోభారం రీత్యా తన ప్రియశిష్యుడైన గంధవరపు వెంకటరావుకు నామమాత్రపు మొత్తానికి వేగుజుక్క ముద్రణాలయాన్ని అమ్మివేశారు. ఈ క్రమంలో ఆ ముద్రణాలయం బరంపురం నుంచి రాజాంకి తరలించబడింది. తదనంతరం వెంకటరావు గురువు గారి ఆశయాలకు అనుగుణంగా నడుచుకొని సాహితీసేవ కొనసాగించారు.

1969లో రాజాం ప్రాంతంలో 'శారదా రచయితల సమితి' స్థాపించబడింది. అందులో సుమారు 20 మంది దాకా కవులు, రచయితలు ఉండేవారు. వాక్సుధాల హరి బిరుదాంకితుడు పప్పు చిట్టిదాసు రామ కథామృతం, కష్ణ కథామృతం అనే గ్రంథాలను రాశారు. చిగురుకోట వెంకట రమణ గౌరీ శతకం, వెంకట రామలింగయ శతకం, సావిత్రి చరిత్ర అనే ప్రబంధం, మాయా ప్రపంచం అనే ఖండకావ్యాన్ని రచించారు. ఇదే రచయితల సమితి సభ్యుడు వాండ్రంగి రామారావు భావశ్రీ కలం పేరుతో హృదయవీణ, క్రీస్తు పురాణం, మనుశోభలు, చరమ చాంపేయాలు, షేక్స్పియర్ రాగాలు, నవభారతం, భారత రామాయణం, గోదా గీతాలు, భావశ్రీ గజల్స్, పంచవటి, రుక్మిణీ కృష్ణ నాటకం వంటి రచనలు చేశారు. వెంకటరావు ప్రోత్సాహంతో భావశ్రీ వేంకటేశ సప్తతి అనే పద్య కావ్యం కూడా రాశారు. దానిని వెంకటరావు తన వేగుజుక్క ప్రెస్‌లో ఉచితంగానే ప్రింట్ చేశారు. వీటితో పాటు శారదా రచయితల సమితి మూడు కవితా సంకలనాలను ముద్రించింది. సమితి సభ్యులవే కాకుండా మిగతా సాహితీవేత్తల పుస్తకాలను కూడా రాజాం వేగుజుక్క అచ్చువేసేది. ఈ ప్రాంత గ్రంథాల ముద్రణలో వేగుజుక్క పాత్ర ఎనలేనిది. ఆయా గ్రంథాలను వెంకటరావు స్వల్ప ధరకు ముద్రించే ఏర్పాటు చేసేవారు. వేంకట కష్ణారావు గారు తన చివర దశలో రాజాంలోనే ఉంటూ 1966 సెప్టెంబర్ 13న మరణించారు. వద్ధాప్యంలో ఉన్న గురువు బరంపురం నుంచి రాజాం రావడానికి శిష్యునిపై గల అమితమైన ప్రేమే ఒకానొక కారణం.

వెంకటరావు గొప్ప సమాజ సేవకుడు. ఎందరో అనాథలను అభాగ్యులను ఆదుకున్నారు. కోట్ల విలువైన స్థలాన్ని నిరుపేదలకు ఇళ్ల స్థలాలుగా ఇచ్చారు. రాజాం ప్రాంతంలో ఆయన వదాన్యతను అందరూ గొప్పగా చెప్పుకుంటూ ఉంటారు. సుదీర్ఘ చరిత్ర కలిగిన ఈ వేగుజుక్క ప్రెస్‌కు వెంకటరావు ఆత్మీయ వారసుడు. రాజాం పట్టణంలో అరవై ఏళ్లకు పైగా అందరి మన్ననలు పొందేలా ప్రెస్‌ను నడిపారు. ప్రింటింగ్ ప్రెస్ సాంకేతికతను ఎందరో శిష్యులకు నేర్పి వారి బతుకుతెరువుకు బాసటగా నిలిచారు. ఇతని శిష్యులు అనేకమంది ఉత్తరాంధ్ర అంతటా ప్రింటింగ్ ప్రెస్‌లు నిర్వహించడం విశేషం. ప్రస్తుతం వెంకటరావు కుమారులు ఈ ముద్రణాలయాన్ని నడుపుతున్నారు.

– పిల్లా తిరుపతిరావు
70951 84846

వివక్ష, విధ్వంసాలపై కవితాస్త్రం

తరతరాల కుల చట్రాలను, మత మౌఢ్యాలను సమాజంలో పేరుకుపోయిన అసమానతలను జీవితస్వీయ, స్వయ, సంఘర్షణలను, చారిత్రక, వాస్తవ పరిస్థితులను, జరుగుతున్న విషయాలను కళ్ళకు కట్టినట్టు చూపిస్తోంది చల్లపల్లి స్వరూపరాణి కొత్త కవితా సంపుటి 'అల్లిక'. ఇందులో మొత్తం 50 కవితలు వున్నాయి. మంకెన పువ్వు, వేకువ పిట్ట తర్వాత వచ్చిన మూడో సంపుటే ఈ అల్లిక. కవితలు ఒక దాని తర్వాత మరొకటి అని ఏకబిగిన చదివించి చదువరిని ఆలోచింప చేస్తాయి. మనుషుల్లోనే ఇంత వ్యత్యాసాలు,ఇంత వైషమ్యాలు ఉంటాయా? అని మనల్ని మనమే ప్రశ్నించుకునేలా చేస్తాయి. కులం దాటి మతం, మతం దాటి జాతి, జాతి దాటి అంతర్జాతీయ విషయాలను కూడా అల్లికలో కనబడతాయి. దేశం నడిబొడ్డున నిలబడి ఆత్మ గౌరవ కేక ఈ అల్లిక.

మొదటి కవిత 'గోవు కేక'తో ప్రారంభమవుతుంది.

"యేపనీ చేతగాని పిల్లోడ్ని/ వేదికపైకి పిల్చి/ పరమ వీరచక్ర బిరుదిచ్చినట్టుంది నా పని/ పేరుకి సాధు జంతువునే అయినా యెందుకో.../ మూట కట్టుకుంటున్నదాన్ని!/ యీమధ్య కొందరు/ యెన్నడూ లేని ప్రేమ కురిపిస్తున్నారు/ తమ పగోళ్ళని మట్టుబెడుతున్నారు/ సిగ్గుతో కుచించుకు పోతున్నా!/ నిజానికి నాకూ వూపిరాడ్డం లేదు / యే బాబా అయినా కనికరించి నాకు నోరు తెప్పిచ్చుండి బాబయ్యా! చచ్చి మీ కడుపున పుడతా! నేనూ చెప్పాల్సింది వుంది/ అవును, నేను ఆవునే మాట్లాడుతున్నా..." దేశంలో గోవు పేరిట జరుగు తున్న ఉదంతాలను, గొడవలను కళ్ళకు కట్టినట్లు చూపించారు ఈ కవితలో . 'అనల్ప' కవితలో – 'నాకొక బుజ్జి పిల్లిపిల్ల దొరికింది/ కాదు, నేనే దానికి దొరికాను/ చిన్న చీపురు పుల్ల/ దాని చేతికి దొరికినా

ఆ పుల్లతో ఆనందంగా ఆడుకుంటది/.... నిష్ఠా గరిష్టులకన్నా/ చెవిలో జోరీగల్లా పిల్లికి బిచ్చం పెట్టని భద్రయ్యలకన్నా ప్రేమలో నా చిన్నారి పిల్లి పిల్ల యెప్పుడూ పైయెత్తునే కూకుంటది/ తమ శాకాహారం, ఆయిల్ పుల్లింగ్ లోక కళ్యాణార్థమే సుమీ!/ అని బీరాలు పోయే అల్ప బుద్ధుల ముందు మా బుజ్జి పిల్లి యెప్పుడూ అనల్పమే" అంటూ తన ఇంట్లో పెంచుకునే పిల్లి పట్ల ఒక గొప్ప కవితా ఇందులో వుంది. 'ట్యాంకు పెట్టె' కవితలో – 'లేడీస్ హాస్టల్, వో వింతలమారి ట్రంకు పెట్టె/ తీపి చేదు కలబోతల భాండాగారం/ అక్కడ కులం వో కక్కీసుదొడ్డి/... కులం బుస్సుమంటుంది అయితేనేం హాస్టల్ బందిఖానా బందావనం" అంటారు. 'కడిగినట్టే వుంటది, కంపు వదలదు/ అన్నంలో పురుగులొచ్చాయని చెప్పాలంటే/ పెద్ద కులం అర్హత వుండాలి/ ఆడపిల్లల్ని వ్యక్తులుగా మార్చే కర్మాగారం లేడీస్ హాస్టల్ / తేలీకుండానే యెన్నో యిచ్చింది/ కలలు, కలతలు, కేరింతలు, కలవరింతలు/ అన్నీ నిండిన కుండ నేను యిష్టంగా తెరిచి తరచి తరచి చూసుకునే ట్రంకు పెట్టె' అని చదువుకునే చోట కనిపించే వివక్షను ఎండగట్టారు. హాస్టల్ జీవితాలను, దళిత ఆడపిల్లల బతుకులను, జ్ఞాపకాలను కన్నీళ్ళగా భద్రపరిచిన కవిత ఇది.

'సోషల్ డిస్టెన్స్' కవితలో
– 'కరోనా! హమ్ అబ్ నహీ రోనా !

'సోషల్ డిస్టెన్స్' క్యా బాత్ హై!/ 'సామాజిక దూరం' అని అందరూ పైకి అనేస్తుంటే/ వినడానికి చెవులకి బోయింపుగా వుందిలే!/ 'సోషల్ డిస్టెన్స్' అది మాకెప్పుడో తెలుసుగా!/ నీకు తెలీదు కామోసు!/ చేతులు కడుక్కుంటే యేమొస్తది గానీ వోపాలి మనసుల్ని కడుక్కోమని యిక్కడి మడి మనుషులకి చెప్పి వెళ్ళు!' అంటూ తరతరాలుగా ఈ దేశంలో అణిచివేతకు గురవుతున్న దళితులకు ఈ సోషల్ డిస్టెన్స్ అంటే కొత్త కాదని చెప్పారు. కరోనాతో సోషల్ డిస్టెన్స్ అంటే పెద్దగా మాకు వింతే కాదని తెలియజెప్పారు.

'నరబలి' కవితలో– 'చచ్చినాక బ్రాహ్మణ చండాలుడైన ఒకటే అన్నావు అన్నమయ్యా! మేము చచ్చినా పూడ్చుకోడానికి కాసింత జాగా దొరకదని ఎన్నిసార్లు రుజువైందో చూసావా?" అంటూ ఈ దేశంలో మనిషి చచ్చినా ఆరు అడుగుల నేల దొరకని దేశంలో, నాలుగు దిక్కులు కులం వుంటుందని, నేల ఇవ్వని దేశంలో అస్వతంత్రంగా బతుకుతున్న బతుకుల గురించి వచ్చిన కవిత. 'మామిడి పళ్ళ రక్తం' కవితలో– 'అప్పుడు కోటేసు/ చెంబు దొంగతనం చేస్తే / సజీవ దహనం చేయలేదా / ఇప్పుడు శీను / మామిడికాయ దొంగతనం చేసినందుకు/ పురిశిక్ష వేశాం/ స్థల కాలాలే మారింది/ అంతా సేమ్ టు సేమ్ .." అని ఆవేదన వ్యక్తం చేశారు. వివక్ష వికృత చర్యలను ఎద్దేవా చేశారు. 2019లో మామిడికాయ దొంగతనం చేసినందుకు బక్కీ శీను అనే దళితుడిని పశ్చిమ గోదావరిలో పెత్తందారి కులాలు చంపిన ఘటన నేపథ్యంలో ఈ కవిత రాశారు. 'ఐ కాంట్ బ్రీత్' కవితలో – "వొక తెల్లటి బూటు కాలు/ తరాల నుంచి/ మెడ నరాల మీద / అదిమి వుంచిన ఆకాశమంత స్వేచ్ఛగా/ గాలి పీల్చుకోవాలని నా శతాబ్దాల కల.../ నీ తెల్ల మెడ మీద/ నల్లటి తారు జల్లు/ కురవబోతుందని/ వాతావరణ హెచ్చరిక జారీ అయింది..' అంటారు. అమెరికాలో తెల్లవారి దురహంకారానికి బలైన జార్జ్ ఫ్లయిడ్ హత్యకు నిరసనగా రాసిన కవిత ఇది.

ఇంకా ఇలాంటి చురకత్తుల్లాంటి కవితలు ఈ పుస్తకంలో ఉన్నాయి. వర్తమాన సంఘటనలను, సందర్భాలను చరిత్రతోనూ, పీడిత జన పక్ష దృష్టితోనూ కవిత్వంగా మార్చి, ప్రతి కవితనూ ఒక మార్గదర్శిగా మార్చారు. దళిత జీవితాలపై విస్తరించి ఉన్న తరతరాల వివక్షను తీవ్రంగా ఎండగట్టారు. 'కుట్టు' కవితలో "చందమామా!/ నన్ను క్షమించవోయి!/ నీ మీద రాద్దామంటే/ కలం మొరాయిస్తుంది/ నువ్వు నాకు ద్వేషం నిండిన సిబరేకులా/ ఆగపడతావు/ .. కాని వారు చేసే ద్రోహం కంటే/ అయిన వారు చేసే గాయాలు/ యెక్కువగా సలప్రరిస్తున్నాయి/ గుండె చిదపలు చిదపలుగా పడి వుంది/ కావ్యమా! సుదీ దారం పట్టుకురా!/ జీవితం నన్ను బదాబదాలుగా చించి పోగులు పెట్టింది/ ముందు నన్ను నేను కలిపి కుట్టుకోవాలి" అంటూ జీవితంలో జరిగిన విషయాలను కవిత్వీకరించారు. అల్లికలో దళితుల యాస, వ్యంగ్యం, పద్దునైన వాక్యాలు పల్లె వాతావరణం కనబడుతుంది. ఈ కవితా సంపుటి చదివితే కవిత్వం ఎలా రాయాలి? కవిత్వం ఎవరి పక్షం ఉండాలి? కవిత్వం దేనికోసం రాయాలి? ఎలా రాయాలి? అన్న సంగతులు స్పష్టంగా అనుభవంలోకి వస్తాయి.

24న మూడు దళిత కవితా సంపుటుల పరిచయ సభ

దళిత రచయితల వేదిక, కవి సంధ్య ... భాషా సాంస్కృతిక శాఖ, తెలంగాణ ప్రభుత్వం సౌజన్యంతో ఆగస్టు 24 ఆదివారం సాయంత్రం 6 గంటలకు రవీంద్ర భారతిలో చల్లపల్లి స్వరూపరాణి అల్లిక, కోయి కోటేశ్వరరావు నాగ స్వరం, తుల్లిమిల్లి విల్సన్ సుధాకర్ పోరాట పద్యం కవితా సంపుటుల పరిచయసభ జరుగుతుంది. శిఖామణి అధ్యక్షతన జరిగే సభలో విమల, దార్ల వెంకటేశ్వరరావు, కదిరే కృష్ణ గ్రంథ పరిచయాలు చేస్తారు. చూపు కాత్యాయని, సంగిశెట్టి శ్రీనివాస్, జి.వి.రత్నాకర్ ఆప్త వచనం పలుకుతారు.

–దళిత రచయితల వేదిక, కవి సంధ్య

రచనలకు ఆహ్వానం

ఈ పేజీలో ప్రచురణార్థం రచయితల నుంచి సాహిత్య వ్యాసాలను, సాహిత్య విమర్శలను ఆహ్వానిస్తున్నాం. వ్యాసాలను కంపోజు చేసి పంపేవారు సాఫ్ట్ కాపీని, పిడిఎఫ్‌ని కలిపి పంపాలి. సమకాలీన రచనలపై విమర్శనాత్మక వ్యాసాలకు ప్రాధాన్యం ఉంటుంది. పుస్తకాలను, వ్యాసాలను కింది చిరునామాకు పంపాలి. అక్షరం, ప్రజాశక్తి కార్యాలయం, తాడేపల్లి – 522501, అరవిందా స్కూలు దగ్గర, గుంటూరు జిల్లా.
prajasavvadi@gmail.com

ఆయనవి 'నీచ రాజకీయాలు'

- గవర్నర్ పై స్టాలిన్ విమర్శ

ధర్మపురి : ప్రతిపక్షాలకు మించి 'నీచ రాజకీయాలు' తమిళనాడు గవర్నర్ ఆర్ఎన్ రవి పాల్పడుతున్నారని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎం కె స్టాలిన్ విమర్శించారు. డిఎంకె ప్రభుత్వాన్ని కించపర్చడానికి గవర్నర్ ఎలాంటి విలువలులేని ఆరోపణలు చేస్తున్నారని ఆయన తెలిపారు. 'గవర్నర్ బంగ్లాలో ఒక వ్యక్తి కూర్చుని ప్రతిపక్షాలను మించి 'నీచ రాజకీయాలు' చేస్తున్నారు. ఆయన ద్రవిడ మోడల్, ద్రవిడ భాషను ఎగతాళి చేస్తారు. ఉనికిలోనే లేని తిరుక్కురల్ను ప్రస్తావిస్తారు. అయినా.. ఈ గవర్నర్ తమిళనాడులోనే ఉండాలని నేను చెబుతున్నాను. ఆతని ఉనికి, మన జీవన విధానంపై ఆయన నిరంతర దాడి.. వంటి కారణాలతో మన సంస్కృతి, భాష పట్ల మనకున్న 'ప్రేమ తగ్గిపోదు' అని స్టాలిన్ తెలిపారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు సక్రమంగా లేవనే గవర్నర్ ఆరోపణలను కూడా స్టాలిన్ ఖండించారు. కేంద్ర ప్రభుత్వ సొంత జాతీయ నేర రికార్డుల డేటా ప్రకారమే.. మహిళలపై నేరాల జాబితాలో బిజెపి పాలిత ఉత్తరప్రదేశ్ అగ్రస్థానంలో ఉందని స్టాలిన్ గుర్తు చేశారు. ఆదివారం ధర్మపురిలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల (పిఎసిఎస్) కింద తక్షణ పంట రుణం అనే పైలట్ ప్రాజెక్టును స్టాలిన్ ప్రారంభించారు. 18 మంది లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు.

మా పని మేము చేసుకుపోతాం !

- ఎస్ఐఆర్ను సమర్థించుకున్న సిఇసి జ్ఞానేష్ కుమార్
- ఇతర రాష్ట్రాల్లో అమలుపై తగిన సమయంలో నిర్ణయం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

బీహార్లో అమల్జేస్తున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ (సిఇసి) జ్ఞానేష్ కుమార్ సమర్థించుకున్నారు. తాము ఎవరికీ భయపడబోమని, తమ పని తాము చేసుకుపోతామని ఆయన చెప్పారు. బిజెపికి కొమ్ముకాస్తూ ఓట్ల జాబితాలో అక్రమ పద్ధతుల్లో మార్పులు, చేర్పులు చేయడం ద్వారా ఓట్ల చోరీకి ఎన్నికల సంఘం పాల్పడిందంటూ ఇటీవల కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ చేసిన విమర్శలు సంచలనం రేపిన సంగతి తెలిసిందే. ఆదే అంశంపై ఆయన బీహార్లో ప్రత్యేకంగా యాత్ర కూడా ప్రారంభించారు. రోజే సిఇసి పై విధంగా వ్యాఖ్యానించడం గమనార్హం. న్యూఢిల్లీలోని నేషనల్ మీడియా సెంటర్ (ఎన్ఎంసి)లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎన్నికల కమిషనర్లు వివేక్ జోషి, సుఖ్బీర్ సింగ్ సంధు, సీనియర్ డిప్యూటీ ఎన్నికల కమిషనర్ మనీష్ గర్గ్, డిప్యూటీ ఎన్నికల కమిషనర్ సంజయ్ కుమార్, డైరెక్టర్ జనరల్ ఆశిష్ గోయల్, డిప్యూటీ డైరెక్టర్ జనరల్ విజయ్ కుమార్ పాండేలతో కలిసి జ్ఞానేష్ కుమార్ మాట్లాడారు. ఎన్నికల సంఘంపై వచ్చిన ఆరోపణలు రాజకీయ ప్రేరేపితమైనవని, తమపై అపవాద వేస్తే సహించబోమని ఆయన హెచ్చరించారు. రాజకీయ ప్రతీకార చర్యలకు తాము తలొగ్గమని, కేవలం రాజ్యాంగానికి మాత్రమే ఎన్నికల సంఘం తలవంచుతుందని చెప్పారు. ప్రతిపక్షం ఆరోపణలలోకి వస్తే, వారు కూడా తమను ఎప్పటిలాగే మంచిగా చూస్తారని వ్యాఖ్యానించారు. ఎన్నికల కమిషన్ భుజంపై తుపాకి పెట్టి రాజకీయాలు చేయాలనుకుంటే కుదరదన్నారు. రాజ్యాంగం నిర్దేశించిన ప్రకారం ఎన్నికల కమిషన్ వద్ద రిజిస్ట్రేషన్ చేసుకున్న తరువాత ఏ పార్టీ అయినా తమకు సమానమేనన్నారు.

- బీహార్ ఎస్ఐఆర్పై వచ్చిన ఆరోపణలన్నిటినీ జ్ఞానేష్ కుమార్ ఖండించారు. ఆధారాలు ఇవ్వకుండా ఆరోపణలు చేయడం సరికాదన్నారు. ఇలాంటి తప్పుడు ఆరోపణలకు ఎన్నికల కమిషన్ కాని, ఓటర్లు కాని భయపడరన్నారు. ఓటర్ల జాబితాపై 28,370 మంది అభ్యంతరాలు వ్యక్తం చేశారన్నారు.
- బీహార్ ముసాయిదా ఓటర్ల జాబితాలో సవరణలకు మరో 15 రోజులు మాత్రమే మిగిలి ఉన్నాయని జ్ఞానేష్ అన్నారు. ఈ ముసాయిదా జాబితాపై ఏ రాజకీయ పార్టీకి ఎలాంటి అనుమానాలు ఉన్నా తమను సంప్రదించవచ్చని ఆయన అన్నారు.
- కొందరు ఐదేళ్ల జరిగిన ఎన్నికలకు సంబంధించిన సిసిటివి ఫుటేజీను విడుదల చేయాలంటున్నారని, వ్యక్తిగత గోప్యతకు భంగం కలిగే అవకాశమున్నందున తాము ఆ పని చేయలేకపోతున్నామని సిఇసి చెప్పారు.
- లోక్సభలో ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ తాను చేసిన 'ఓట్ చోరీ' ఆరోపణలపై ఏడు రోజుల్లో అఫిడవిట్ సమర్పించాలని, లేదంటే క్షమాపణ చెప్పాలని సిఇసి అన్నారు. ఆధారాలు లేకుండా ఆరోపణలు చేస్తే ఆ ఆరోపణల్లో నిజం లేనట్లేనని పేర్కొన్నారు.
- పశ్చిమబెంగాల్, ఇతర రాష్ట్రాల్లో ఎస్ఐఆర్ ఎప్పుడు నిర్వహించాలనేది ఎన్నికల సంఘం నిర్ణయిస్తుందని, తగిన సమయంలో నిర్ణయాన్ని ప్రకటిస్తామని తెలిపారు. ఎన్నికల ముందు ఎన్నికల జాబితాను సవరించడం ఎన్నికల కమిషన్ బాధ్యత అని ఒక ప్రశ్నకు జ్ఞానేష్ కుమార్ బదులిచ్చారు.
- కాగా రాహుల్ గాంధీ బీహార్లో ప్రారంభించిన 'ఓటర్ అధికార్ యాత్ర'లో మాట్లాడుతూ ఇసిపై మరోమారు విమర్శలు గుప్పించారు. తనను మాత్రమే అఫిడవిట్ సమర్పించాలని ఇసి డిమాండ్ చేస్తోందని, బిజెపి నేతలు కొద్దిరోజుల క్రితం ప్రెస్మీట్ పెట్టినప్పుడు వాళ్లను ఇసి అఫిడవిట్ ఎందుకు అడగలేదని ప్రశ్నించారు.

న్యూయార్క్ క్లబ్లో కాల్పులు

- ముగ్గురు మృతి
- 8 మందికి గాయాలు

న్యూయార్క్ : అమెరికాలో తుపాకీ కాల్పులు కలకలం రేపాయి. న్యూయార్క్ నగరంలోని బ్రూక్లిన్ ప్రాంతంలో రద్దీగా ఉండే ఒక క్లబ్లో గుర్తు తెలియని దుండగులు జరిపిన కాల్పుల్లో ముగ్గురు చనిపోయారు. మరో 8 మంది గాయపడ్డారు. స్థానిక కాలమానం ప్రకారం ఆదివారం తెల్లవారుజామున 3.30 గంటలకు ఈ కాల్పులు చోటుచేసుకున్నట్లు అధికారులు తెలిపారు. క్లబ్లో చిన్నపాటి వివాదం చెలరేగి...అది కాల్పులకు దారితీసినట్లు భావిస్తున్నామని న్యూయార్క్ పోలీస్ కమిషనర్ జెస్సికా టిష్ వెల్లడించారు. ఘటనాస్థలం నుంచి 36 షెల్ కేసింగ్లను, సమీప వీధిలో ఒక తుపాకిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కాల్పుల ఘటనను భయానకంగా పేర్కొన్న ఆమె.. పూర్తిస్థాయిలో దర్యాప్తు చేపట్టి దుండగులను అదుపులోకి తీసుకుంటామని తెలిపారు.

భారత్-అమెరికా వాణిజ్య చర్చలు వాయిదా

న్యూఢిల్లీ : వాణిజ్య చర్చల నిమిత్తం ఈ నెలాఖరులో అమెరికా ప్రతినిధులు న్యూఢిల్లీ రావాల్సి ఉండగా ఆ పర్యటన వాయిదా పడింది. ఎన్డిటివి ప్రాఫిట్ కథనం ప్రకారం... ఈ నెల 25-28 తేదీల మధ్య అమెరికా వాణిజ్య ప్రతినిధులు మన అధికారులతో చర్చలు జరపాల్సి ఉంది. అయితే ఈ పర్యటన వాయిదా పడింది. భారత్పై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధించిన యాభై శాతం ప్రతీకార సుంకాలు ఈ నెల 27వ తేదీ నుంచి అమలులోకి వచ్చే అవకాశం ఉంది. భారత ఎగుమతులపై పాతిక శాతం సుంకాలు విధించిన ట్రంప్...రష్యా నుంచి మన దేశం చమురును కొనుగోలు చేస్తోందన్న అక్కసుతో మరో పాతిక శాతం సుంకాలను జరిమానాగా వడ్డించిన విషయం తెలిసిందే. వాణిజ్య చర్చల్లో భాగస్వాములవుతున్న ఇరు దేశాల అధికారులు పరస్పరం సంప్రదింపులు జరుపుతున్నప్పటికీ చర్చలకు సంబంధించిన కొత్త షెడ్యూలును ఇంకా ఖరారు చేయలేదు.

UNIMONI FINANCIAL SERVICES LIMITED
RO: N.G. 12 & 13 Ground Floor, North Block, Manipal Centre, Dickenson Road, Bangalore - 560 042. CIN No.U85110KA1995PLC018175

బహిరంగ ప్రకటన

తాకట్టు పెట్టిన బంగారు ఆభరణాల వేలం UNI MONI FINANCIAL SERVICES LIMITED ద్వారా **21.08.2025** ఉదయం 10.00 గంటలకు దిగువ ఇవ్వబడిన సంబంధిత కేంద్రాలలో నిర్వహించబడుతుందని ప్రజలకు తెలియజేస్తున్నాం. వేలం వేయబోయే బంగారు ఆభరణాలు బకాయిలు చెల్లించడంలో విఫలమైన మా వివిధ కస్టమర్ల రుణఖాతాలకు చెందినవి., ఈ రుణ గ్రహీతలకు మా వేలం నోటీసులు సక్రమంగా జారీ చేయబడ్డాయి. మా వివిధ కస్టమర్లు గడువు వ్యగిసిన ఋణం తిరిగి చెల్లించనందున వేలం వేయడం జరుగుతుంది. ఈ క్రింద వేలం వేయబడే బంగారు ఆభరణం బ్రాంపేరుతో పేర్కొన్నాం.

Auction Centre Address & Loan Nos: GUNTUR (GNR - D.No 5-87-27, 1st Floor, Opp KFC Restaurant, Main Road, Lakshmipuram, Guntur - 522007, Contact No : 7893799967) 2112356, 2133677, 2149523.

(Reserves the right to alter the number of accounts to be auctioned &/ postpone / cancel the auction without any prior notice.)

UNIMONI FINANCIAL SERVICES LIMITED
RO: N.G. 12 & 13 Ground Floor, North Block, Manipal Centre, Dickenson Road, Bangalore - 560 042. CIN No.U85110KA1995PLC018175

బహిరంగ ప్రకటన

తాకట్టు పెట్టిన బంగారు ఆభరణాల వేలం UNI MONI FINANCIAL SERVICES LIMITED ద్వారా **21.08.2025** ఉదయం 10.00 గంటలకు దిగువ ఇవ్వబడిన సంబంధిత కేంద్రాలలో నిర్వహించబడుతుందని ప్రజలకు తెలియజేస్తున్నాం. వేలం వేయబోయే బంగారు ఆభరణాలు బకాయిలు చెల్లించడంలో విఫలమైన మా వివిధ కస్టమర్ల రుణఖాతాలకు చెందినవి., ఈ రుణ గ్రహీతలకు మా వేలం నోటీసులు సక్రమంగా జారీ చేయబడ్డాయి. మా వివిధ కస్టమర్లు గడువు వ్యగిసిన ఋణం తిరిగి చెల్లించనందున వేలం వేయడం జరుగుతుంది. ఈ క్రింద వేలం వేయబడే బంగారు ఆభరణం బ్రాంపేరుతో పేర్కొన్నాం.

Auction Centre Address & Loan Nos: K KHAMMAM (KHM - D No 8-3-215, First Floor, Beside Indus Ind Bank, Wyra Road, Khammam - 507001, Contact no : 9959617256) 2171939, 2172426, 2168273, 2167804, 2108439, 2150684, 2135040, 2166444, 2170154, 2169573, 2112500, 2152958, 2151350, 2110444, 2110950, 2153251, 2170867, 2170942, 2163926, 2184965, 2166524, 2118114, 2173954, 2183805.

(Reserves the right to alter the number of accounts to be auctioned &/ postpone / cancel the auction without any prior notice.)

మోడీ బలవంతుడేమీ కాదు

- చంద్రబాబు, నితీష్లే ఆయన ధైర్యం
- ఎస్ఐఆర్ పేరుతో ఓటర్లను తొలగిస్తున్నారు
- సిపిఎం రాజ్యసభ ఫ్లోర్ లీడర్ జాన్ బ్రిట్టాస్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఇటీవల కాలంలో ప్రధాని మోడీ ధైర్యవంతుడని, బలవంతుడని ఆయన అనుకూల మీడియాతో బిజెపి నాయకులు పెద్దయెత్తున ప్రచారం చేయించుకుంటున్నారని, నిజంగా అటువంటిదేమీ లేదని, కేంద్రమే చంద్రబాబు, నితీష్ కాళ్లపై నడుస్తుందని, అదే ధైర్యమని, రాష్ట్రాల నిధులు కాజేసి బలవంతుడనని చెప్పుకుంటున్నారని సిపిఎం రాజ్యసభ ఫ్లోర్లీడర్ జాన్ బ్రిట్టాస్ తెలిపారు. పోలవరం ముంపు ప్రాంతాల పర్యటనలో భాగంగా ఆదివారం భద్రాచలంలోని సిపిఎం కార్యాలయంలో ఆయన మాట్లాడారు. జిఎస్టి పేరుతో రాష్ట్రాల నిధులను దోచుకుంటూ ఇవ్వాల్సిన వాటా నిధులు ఇవ్వకుండా దాన్నే తన ధైర్యంగా ప్రచారం చేసుకుంటున్నారని విమర్శించారు. దీనికోసం జిఎస్టి కౌన్సిల్ను కూడా భేఖాతరు చేస్తూ ఇష్టం వచ్చినట్లు నిబంధనలు మార్చేస్తున్నారని అన్నారు. మరోవైపు కేంద్రంలో బిజెపికి పూర్తిస్థాయి బలం లేదని, ఏపిలో చంద్రబాబు, బీహార్లో నితీష్కుమార్ ఎంపిల సాయంతో బిజెపి ప్రభుత్వం, మోడీ ప్రధానిగా కొనసాగుతున్నారని, దీన్ని మరుగునపెట్టేందుకు ఆయనకు ఆయనే తానో బలవంతుడనని, ధైర్యవంతుడనని ప్రచారం చేయించుకుంటున్నారని తెలిపారు. నిజంగా ధైర్యవంతుడు, బలవంతుడు అయితే 11 ఏళ్లలో ఒక్కసారిగా ఆయన దేశంలో మీడియాతో మాట్లాడలేదని తెలిపారు. విదేశాల్లో తిరుగుతూ తనకుతానే విశ్వగురువుగా ప్రచారం చేసుకుంటున్నారని అన్నారు. దేశంపై అమెరికా సుంకాలు పెంచితే దాన్ని ఖండించలేని దుస్థితిలో మోడీ ఉన్నారన్నారు. అతిచిన్న వ్యక్తయిన ఉక్రెయిన్ అధ్యక్షులు జెలెన్స్కీ వైట్హౌస్లోనే ట్రంప్ను వ్యతిరేకించారని, మోడీ మనదేశంలో ఉండి కూడా కనీసం ట్రంప్ చర్యలపై ప్రకటన రూపంలోనూ ఖండించలేని స్థితికి చేరారని అన్నారు. ఉపాధి కోసం బీహార్, మధ్యప్రదేశ్, ఒడిశా, బెంగాల్ నుండి కార్మికులు పనుల కోసం ఇతర రాష్ట్రాలకు వెళుతున్నారని, అటువంటి వారి ఓట్లను తొలగించడం కోసమే స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) పేరుతో ఎన్నికల కమిషన్ను అడ్డం పెట్టుకున్నారని తెలిపారు. దక్షిణాది రాష్ట్రాల్లో సుమారు 34 లక్షల మంది వలస కార్మికులు పనిచేస్తున్నారని, వారందరికీ అన్యాయం చేశారని అన్నారు. రాజకీయ లబ్ధి కోసమే ఇటువంటి చర్యలు చేపట్టారని వివరించారు. జిఎస్టి పేరుతో రాష్ట్రాలకు ఇవ్వాల్సిన నిధులు ఇవ్వకుండా కేంద్రమే వాడుకుంటోందని తెలిపారు. జిఎస్టి ప్రకారం ఇవ్వాల్సిన నిధుల కేటాయింపులోనూ బిజెపి ప్రభుత్వం వివక్ష పాటిస్తోందని చెప్పారు. పార్లమెంటులో ఏ ప్రశ్నకూ నేరుగా సమాధానం చెప్పలేని మోడీ.. ఎందులో ధైర్యవంతుడో, బలవంతుడో దేశ ప్రజలకు బిజెపి నేతలు సమాధానం చెప్పాలని అన్నారు.

సైనిక శిక్షణలో వికలాంగులై..
దీనస్థితిలో ఆఫీసర్ క్యాడెట్లు

- సుమోటోగా స్వీకరించిన సుప్రీం

న్యూఢిల్లీ : సైనిక శిక్షణలో వికలాంగులై.. ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో దుర్భర జీవితాన్ని గడుపుతున్న ఆఫీసర్ క్యాడెట్ల దుస్థితిపై సర్వోన్నతన్యాయస్థానమైన సుప్రీంకోర్టు తీవ్రంగా స్పందించింది. ఈ మేరకు జాతీయ మీడియాలో వచ్చిన కథనాన్ని సుమోటో రిట్గా స్వీకరించింది. ఈ రిట్ పిటిషన్ను జస్టిస్ బివి నాగరత్న, జస్టిస్ ఆర్ మహాదేవన్ ధర్మాసనం సోమవారం విచారించనుంది. గత 40 ఏళ్లలో ఎన్డిఎ వంటి దేశ అత్యున్నత సైనిక శిక్షణా సంస్థల నుంచి దాదాపు 500 ఆఫీసర్ క్యాడెట్లు వైద్య కారణాల వల్ల డిశ్చార్జ్ అయ్యారని ఈ నెల 11న ది ఇండియన్ ఎక్స్ప్రెస్ ఒక కథనాన్ని ప్రచురించింది. శిక్షణ సమయంలో గాయాల కారణంగా వీరు వైకల్యానికి గురయ్యారని తెలిపింది. ఒక్క ఎన్డిఎలోనే 2021 నుంచి 2025 జులై వరకూ 20 మందిని వైద్య కారణాలతో బయటకు పంపినట్లు వెల్లడించింది. ఇటువంటి సందర్భాల్లో ఇచ్చే పరిహారాన్ని (ప్రస్తుతం నెలకు గరిష్టంగా రూ. 40 వేలు) పెంచే ప్రతిపాదనకు కేంద్ర రక్షణ మంత్రి రాజ్నాథ్ సింగ్ ఆమోదం తెలిపినప్పటికీ, ఆ ఫైల్ నిలిచిపోయిందని పత్రిక వెల్లడించింది. జీవితాంతం సంరక్షణ, ఆరోగ్యం కోసం అవసరమయ్యే దానికంటే ప్రస్తుతం ఇస్తున్న ఎక్స్గ్రేషియా చాలా తక్కువగా ఉందని ఈ క్యాడెట్ల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేసినట్లు కథనం తెలిపింది. నిబంధనల ప్రకారం ఈ క్యాడెట్లు మాజీ సైనికుల హోదాకు అర్హులు కాదు. దీంతో మాజీ సైనికులకు లభించే సౌకర్యాలు, ఎంపానెల్డ్ ఆసుపత్రుల్లో ఉచిత చికిత్స వంటివి లభించవు. తమ వైద్య ఖర్చులకే నెలకు రూ. 50 వేలు లేదా అంతకంటే ఎక్కువ ఖర్చవుతాయని ఈ క్యాడెట్లు చెబుతున్నారు. ఈ కథనాలను జస్టిస్ నాగరత్న నేతృత్వంలోని ధర్మాసనం పరిగణనలోకి తీసుకుని ప్రధాన న్యాయమూర్తి బిఆర్ గవాయి ముందు ఉంచింది. అలాగే, ఈ కథనాలపై ఆర్మీ మాజీ చీఫ్ జనరల్ ఎం ఎం నరవాణే, నేవీ మాజీ చీఫ్ అడ్మిరల్ అరుణ్ ప్రకాష్ కూడా తీవ్రంగా స్పందించారు. ఇటువంటి క్యాడెట్లకు అవసరమైన సంరక్షణ ఖర్చును ప్రభుత్వమే భరించాలని, సహేతుకమైన పరిహారం, సరైన ఆరోగ్య బీమాను అందించాలని డిమాండ్ చేశారు. అలాగే శిక్షణ సమయంలో తగినంత భద్రతను కల్పించాలని కోరారు.

ఈ యువకుని పేరు కిషన్ కులకర్ణి.. ఎన్డిఎ శిక్షణలో వికలాంగుడై పూణేలోని సైనికాసుపత్రిలో తల్లితో ఇలా బతుకెళ్లదీస్తున్నారు

ఆసుపత్రిలో చేరిన నవీన్ పట్నాయక్

భువనేశ్వర్ : ఒడిషా మాజీ ముఖ్యమంత్రి, ప్రస్తుత ప్రతిపక్ష నాయకులు నవీన్ పట్నాయక్ ఆదివారం స్థానిక ఆసుపత్రిలో చేరారు. పట్నాయక్ డీహైడ్రేషన్కు చికిత్స పొందుతున్నారని, పరిస్థితి వేగంగా మెరుగుపడుతోందని బిజెడి ఒక ప్రకటనలో తెలిపింది. ఆసుపత్రిలో పట్నాయక్ను రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి ముఖేష్ మహలింగ్ పరామర్శించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ పట్నాయక్ ఆరోగ్యం నిలకడగా ఉందని, అయితే వైద్యుల పర్యవేక్షణలో ఉన్నారని చెప్పారు. పట్నాయక్ ఈ ఏడాది జూన్లో ముంబయిలో వెన్నుముక శస్త్రచికిత్స చేయించుకున్నారు.

కరేడు @ 50 రోజులు

(మొదటి పేజీ తరువాయి)

చేస్తారని భావిస్తున్నారు. ఈ మేరకు ఇప్పటికే పోలీసులకు ఆదేశాలు అందినట్లు తెలిసింది. కరేడులోకి ఎటువంటి పరిస్థితుల్లోనూ బయటవారిని రానీయకుండా చేయడానికి అన్ని ఏర్పాట్లను ప్రభుత్వం చేస్తోంది. ఆదివారం మధ్యాహ్నానికే కరేడు గ్రామానికి వెళ్లే దారులన్నీ మూసివేశారు. అనేక చోట్ల పోలీసు పికెట్ ఏర్పాటు చేసి తనిఖీలు నిర్వహిస్తున్నారు. . 1. జాతీయ రహదారి - కరేడు ర్యాంపు, 2. అలగాయపాలెం - కరేడు, 3 ఉలవపాడు - కరేడు రోడ్డుపై భారీ గేట్లు ఏర్పాటు చేశారు. స్థానికులను మాత్రమే కరేడులోకి అనుమతిస్తున్నారు. ఏమాత్రం అనుమానం వచ్చినా వెనక్కి పంపడమో, అదుపులోకి తీసుకోవడమో చేస్తున్నారు. ఆదివారం సాయంత్రానికి వంద మంది పోలీసులను గ్రామంలో బందోబస్తు కోసం నియమించారు. సోమవారం ఉదయానికి వీరి సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. ఈ నిర్బంధం ఎలా ఉన్నా పోరాడుతున్న కరేడు ప్రజానీకానికి సంఘీభావం తెలిపేందుకు రైతులు, ప్రజలు పెద్దఎత్తున కదులుతున్నారు. కరేడులో భూములను ఇండోసోల్ కంపెనీకి ఇవ్వడానికి ప్రభుతంవం సిద్ధమైన సంగతి తెలిసిందే. దీనిని స్థానిక ప్రజలు వ్యతిరేకిస్తున్నారు. భూ సేకరణకు వ్యతిరేకంగా స్థానిక ప్రజలు జూన్ 29న చేపట్టిన ఉద్యమం రాష్ట్ర వ్యాప్తంగా4 చర్చనీయాంశమైంది. వీరికి సిపిఎం, సిపిఐ,లతో పాటు పది వామపక్ష పార్టీలు , వైసిపి, కాంగ్రెస్లు మద్దతు ప్రకటించాయి. కందుకూరు ఎంఎల్ఎ ఇంటూరి నాగేశ్వరరావుతో పాటు అధికారంలో ఉన్న తెలుగుదేశం, కూటమి పార్టీల నాయకత్వం ఇండోసోల్ కంపెనీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నారు.

ఢిల్లీలో రెండు హైవేలు ప్రారంభం

న్యూఢిల్లీ : దేశ రాజధాని ప్రాంతం (ఎన్సిఆర్)లో ద్వారకా ఎక్స్ప్రెస్వే, అర్బన్ ఎక్స్టెన్షన్ రోడ్-2 (యుఇఆర్-2) అనే రెండు హైవేలను ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆదివారం ప్రారంభించారు. ఎన్సిఆర్లో ట్రాఫిక్ రద్దీని తగ్గించడానికి దాదాపు రూ.11 వేల కోట్లతో వీటిని నిర్మించారు. ఈ సందర్భంగా మోడీ మాట్లాడుతూ ద్వారకా ఎక్స్ప్రెస్వే, యుఇఆర్-2తో ప్రజలకు ప్రయోజనం కలుగుతుందన్నారు. ఈ రెండు హైవేలను అసాధారణంగా నిర్మించారని, పెరిఫెరల్ ఎక్స్ప్రెస్వే అభివృద్ధి తరువాత యుఇఆర్-2 ఇప్పుడు ఢిల్లీకి ఎంతో ప్రయోజనం చేకూరుస్తుందని చెప్పారు. యుఇఆర్-2 నిర్మాణం కోసం లక్షలాది టన్నుల వ్యర్థాలను రీసైక్లింగ్ చేశారని, ఈ విధానం చెత్త కుప్పలను తగ్గించడమే కాకుండా.. మౌలిక సదుపాయాల అభివృద్ధికి వ్యర్థాలను విలువైన వనరుగా మార్చిందని మోడీ అన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల మంత్రి నితిన్ గడ్కారీ మాట్లాడుతూ ఈ రెండు హైవేలతో ఢిల్లీలో ట్రాఫిక్ జామ్లను 50 శాతం తగ్గిస్తాయని చెప్పారు. కాగా, ద్వారకా ఎక్స్ప్రెస్వేలోని 10.1 కిలోమీటర్ల పొడవైన ఢిల్లీ విభాగాన్ని దాదాపు రూ. 5,360 కోట్ల వ్యయంతో అభివృద్ధి చేశారు. యశోభూమి, ఢిల్లీ మెట్రో బ్లూ, ద్వారకా క్లస్టర్ బస్ డిపోల మార్గం ద్వారా ఈ హైవే సాగుతుంది. ఈ ద్వారకా ఎక్స్ప్రెస్వేలోని 19 కిలోమీటర్ల పొడవైన హర్యానా విభాగాన్ని గతేడాది మార్చిలో ప్రధాని మోడీ ప్రారంభించారు. యుఇఆర్-2ను దాదాపు రూ. 5,580 కోట్ల వ్యయంతో అలీపూర్ నుంచి డిచావోన్ కలాన్ స్ట్రెచ్ వరకూ నిర్మించారు.

కోస్తా జిల్లాల్లో కుండపోత

(మొదటి పేజీ తరువాయి)

ఉందని తెలిపారు. బుధవారం వరకూ మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్లరాదని సూచించారు. శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, విశాఖపట్నం, అనకాపల్లి, కాకినాడ జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో సోమవారం భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు. బిఆర్ అంబేద్కర్ కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టిఆర్, గుంటూరు జిల్లాల్లో అక్కడక్కడా మోస్తరు నుంచి భారీ వర్షాలు నమోదయ్యే అవకాశం ఉందని పేర్కొన్నారు. మిగిలిన జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు. మంగళవారం శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో అక్కడక్కడా మోస్తరు నుంచి భారీ వర్షాలు, మిగిలిన జిల్లాల్లో తేలికపాటి వర్షాలు నమోదయ్యే అకాశం ఉందని పేర్కొన్నారు.

పోలవరం నిర్వాసితుల సమస్యలు జాతీయ స్థాయికి

(మొదటి పేజీ తరువాయి)

సందర్శించి నిర్ఘాంత పోయినట్లు చెప్పారు. కాలనీల్లో కనీస మౌలిక వసతులు కల్పించలేదన్నారు. నిర్వాసితుల సమస్యలు తీవ్రస్థాయిలో ఉన్నప్పటికీ ఆంధ్రప్రదేశ్ నుంచి సారథ్యం వహిస్తున్న టిడిపి, వైసిపి ఎంపీలు పార్లమెంటులో ఎందుకు ప్రశ్నించరని నిలదీశారు. కేరళలో నిర్మించిన పునరావాస కాలనీల్లో విద్యా, వైద్యం, రవాణా సౌకర్యాలతో పాటు కాలనీలో నివసించే ప్రజలకు ఉపాధి అవకాశాలను ఎల్డిఎఫ్ ప్రభుత్వం కల్పించినట్లు చెప్పారు. పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసి, నీళ్లు నిలిపి నిర్వాసితులను అనివార్యంగా వెళ్లగొట్టేందుకు కుట్ర చేస్తున్నారని, పొమ్మనకుండా పొగబెట్టిన విధంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. ఇటువంటి కుట్రలను సిపిఎం అనుమతించబోదన్నారు. సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు కె.లోకనాథం మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు అమరావతి, పోలవరం రెండు కళ్ళంటూ చేస్తున్న ప్రకటనలను గుర్తు చేశారు. పోలవరం అంటే ప్రాజెక్టు మాత్రమే కాదని, ఆ ప్రాజెక్టు కోసం భూములు త్యాగం చేసిన నిర్వాసితులకు పునరావాసం కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని అన్నారు. విఆర్.పురం మండలంలోని రామవరం గ్రామం అధికార యంత్రాంగం వేసిన కాంటూరు కాకి లెక్కలకు ఒక ఉదాహరణ అని చెప్పుకొచ్చారు. ఆ గ్రామంలో 279 గృహాలు ఉంటే రోడ్డుకు ఒకవైపు ఉన్న 166 గృహాలకు మాత్రమే నోటిఫికేషన్ ఇచ్చారని వివరించారు. రోడ్డుకు మరోవైపు ముంపు ఉండదా ? అని ప్రశ్నించారు. పాలకుల నిర్లక్ష్యం ఫలితంగా పునరావాస కాలనీలో నిర్వాసితులు జీవచ్ఛవంలా జీవిస్తున్నారని తెలిపారు. పాలకుల నిర్లక్ష్యాన్ని ఎండగట్టేందుకు నిర్వాసితులు పోరాటానికి కంకణబద్ధులు కావాలని పిలుపునిచ్చారు. సిపిఎం ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్ మాట్లాడుతూ పోలవరం నిర్వాసితుల సమస్యలను సిపిఎం జాతీయ సమస్యలుగా గుర్తించిందని, రాబోయే రోజులలో నిర్వహించే పోరాటాలలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని అన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.వాణిశ్రీ మాట్లాడారు. స్థానిక ప్రజలు తమ సమస్యలను ప్రస్తావిస్తూ సిపిఎం బృందానికి వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.తులసీదాస్, బలరాం పాల్గొన్నారు.

ఓట్ల చోరీ కుట్రలు సాగనివ్వం

(మొదటి పేజీ తరువాయి)

'ఇండియా' గెలుస్తుందని కోడైకూస్తే..ఆ ఎన్నికల్లోనూ బిజెపి క్లీన్స్వీప్ చేసిందని, దీని రహస్య కూడా ఈ కుట్రేనని రాహుల్ తెలిపారు. మహారాష్ట్రలో ఒక కోటి మంది ఓటర్లను ఇసి చేర్చిందని, ఇదే బిజెపికి అనుకూలంగా మారినట్లు తమ అధ్యయనంలో తేలిందని రాహుల్ వివరించారు. ప్రధానమంత్రి నరేంద్రమోడీ నిజమైన కులగణనను చేయించలేరని, ఆ ఆలోచన కూడా ఆయనకు లేదని రాహుల్ విమర్శించారు. 'ఇండియా' ఫ్రంట్ మాత్రమే సిసలైన కులగణనను చేయించగలదన్నారు.

లాలూకు కృతజ్ఞతలు

ఓటర్ అధికార్ యాత్ర ప్రారంభోత్సవానికి విచ్చేసిన ఆర్జెడి అధినేత లాలూప్రసాద్ యాదవ్కు రాహుల్ గాంధీ ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఇంటి నుంచి బయటకు వెళ్లొద్దని వైద్యులు చెప్పినా..వినకుండా లాలూజీ ఇక్కడకు వచ్చారని, ఆయనకు మనసారా ధన్యవాదాలు తెలియజేస్తున్నానని రాహుల్ అన్నారు.

మోడీని గద్దె దించకపోతే అన్నిటికీ ముప్పే : ఖర్గే

దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన వాళ్లంతా మనకు ఓటుహక్కును ప్రసాదించారని, ఈ హక్కును సవాల్ చేసేలా ఎర్రకోటలో ప్రధాని మోడీ ప్రసంగించారని కాంగ్రెస్ జాతీయ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే ఆక్షేపించారు. దేశ స్వాతంత్ర్యోద్యమానికి వ్యతిరేకంగా ఆర్ఎస్ఎస్ పనిచేసిందని, మహాత్మాగాంధీ హత్యకు ఆర్ఎస్ఎస్సే ప్రధాన కారణమని తెలిపారు. కనీస అర్హత లేని వాళ్ల పేర్లను ఎర్రకోట వేదికగా మోడీ ప్రస్తావించడం తప్పు అని ఆగ్రహం వ్యక్తం చేశారు. మోడీ చాలా ప్రమాదకారి అని, ఆయన్ను అధికారం నుంచి తప్పించకుంటే ఓట్లు, హక్కులు, స్వేచ్ఛ, రాజ్యాంగం అన్నీ ప్రమాదంలో పడతాయని ఖర్గే హెచ్చరించారు. మోడీ సర్కారుకు ఏజెంటులా ఇసి పనిచేస్తోందని ఆయన ఆరోపించారు. బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డిఎ కూటమికి ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని ఆశాభావం వ్యక్తం చేశారు.

ఎన్డిఎను ఓడిస్తాం..: లాలూ

బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డిఎ కూటమిని ఇండియా ఫ్రంట్ ఓడించితీరుతుందని లాలూ ప్రసాద్ యాదవ్ తెలిపారు. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించేందుకు ఎన్డిఎను ఓడించక తప్పదన్నారు. ఎమర్జెన్సీ కాలం కంటే దారుణమైన పరిస్థితులు ప్రస్తుతం దేశంలో నెలకొన్నాయన్నారు. ఇలాంటి సమయంలో రాహుల్ గాంధీ చేపడుతున్న యాత్రతో 'ఇండియా' ఫ్రంట్ ప్రజలకు మరింత చేరువ అవుతుందని తెలిపారు.

ఓట్ల లూటీ కోసమే ఎస్ఐఆర్ : తేజస్వీ యాదవ్

ఓటరు జాబితా సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) అనేది ఓట్ల లూటీ తప్ప మరొకటి కాదని, ప్రజల ఓట్లను చోరీ చేసేందుకు ఇసి యత్నిస్తోందని ఆర్జెడి నేత తేజస్వీయాదవ్ అన్నారు. ఈ ప్రయత్నాలను ఎట్టి పరిస్థితుల్లోనూ సాగనివ్వబోమని చెప్పారు. బిఆర్ అంబేద్కర్ మనకు ఓటు హక్కును ఇస్తే..దానిని ఇసి ద్వారా కాలరాసేందుకు బిజెపి కుట్ర పన్నిందని విమర్శించారు. బీహార్ రాష్ట్ర ప్రజలను దగా చేసే అవకాశాన్ని మళ్లీ మోడీకి ఇవ్వబోమన్నారు.

మణప్పురం హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్
MANAPPURAM HOME FINANCE LTD.
గతంలో మణప్పురం హోమ్ ఫైనాన్స్ ప్రైవేట్ లిమిటెడ్
CIN: U65923K12010PIC039179, యూనిట్ నెం. 301 నుండి 315, మూడవ అంతస్తు, ఎ వింగ్, 'కనకియా వాల్ స్ట్రీట్', అంధేరి - కుర్లా రోడ్, అంధేరి ఈస్ట్, ముంబయి - 400 093

డిమాండ్ నోటీసు

ఏదైతే, మణప్పురం హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్ యొక్క అధీకృత అధికారిగా, మా రిజిష్టర్డు ఆఫీసు: 4/470ఏ (పాతది) డబ్ల్యు/368ఏ (కొత్తది), మణప్పురం హౌస్, వలపాడ్, త్రిస్సూర్, కేరళ-680567 కలిగియుండి మరియు ఇండియాలోని వివిధ ప్రదేశాలలో శాఖలు (ఇకపై "MAHOFIN"గా పేర్కొనబడును) అనేది కంపెనీల చట్టం, 1956 క్రింద నమోదైన కంపెనీ మరియు సెక్యూరిటైజేషన్ మరియు రీకన్స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్సియల్ అసెట్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రెస్ట్(ఇకపై చట్టంగా సూచిస్తారు)లోని సెక్షన్ 2 యొక్క ఉప-సెక్షన్ 1యొక్క క్లాజు(4) అర్థంలోపు ఫైనాన్సియల్ ఇన్స్టిట్యూషన్గా నోటిఫికేషన్ నెం.ఎస్.ఓ 3466 (ఇ), తేదీ.18 డిసెంబర్, 2015తో చదవగల భారత ప్రభుత్వం, ఆర్థిక సేవల విభాగం, ఆర్థిక మంత్రిత్వ శాఖ, న్యూఢిల్లీ, నిర్మాణం మరియు /లేదా నివాసయూనిట్ల కొనుగోలు కోసం అడ్వాన్సింగ్ లోన్ల వ్యాపారాన్ని కొనసాగించడం మరియు దిగువ కాలమ్ నెం.2లో పేర్కొన్న విధంగా రుణగ్రహీత / సహ-రుణగ్రహీతలు పేర్కొన్న చార్ట్ MAHOFIN నుండి రుణం పొందింది మరియు అయితే SARFAESI, చట్టం కింద సెక్యూర్డు క్రెడిటార్ మరియు పేర్కొన్న చట్టంలోని సెక్షన్ 13(2) కింద సంక్రమించిన అధికారాలను వినియోగించడం ద్వారా సెక్యూరిటీ ఇంట్రెస్ట్ (ఎన్ఫోర్స్మెంట) రూల్స్ 2002లోని రూల్ 2తో చదవగల, దిగువ పేర్కొన్న విధంగా రుణగ్రహీతలు / సహ-రుణగ్రహీతలను నోటీసు తేదీ నుండి 60 రోజులలోపు తదుపరి వడ్డీతో నోటీసులలో పేర్కొన్న మొత్తాన్ని తిరిగి చెల్లించాలని డిమాండ్ నోటీసు జారీచేయబడినది కానీ వివిధ కారణాల వలన వారిలో కొందరికి నోటీసులు అందజేయబడలేదు. దానితో పాటుక్రింద పేర్కొనబడిన రుణగ్రహీతల సమాచారం ప్రయోజనాల కోసం, ఈ పబ్లిక్ నోటీసు ద్వారా సదరు రుణగ్రహీతలకు తెలియజేయబడుతోంది.

క్ర. సం	రుణగ్రహీత / సహ - రుణగ్రహీత పేరు / లాన్ / బ్రాంచ్	క్రియేట్చేసిన ఇంట్రెస్ట్కు సంబంధించి సెక్యూర్డు అసెట్ వివరణ	ఎన్పిఏ తేది	నోటీసు పంపిన తేదీ & బాకీపడిన మొత్తం
1	సింగంపల్లి సత్యవతి, సింగంపల్లి ఏడుకొండలు, సింగంపల్లి పవన్ తేజ/ MHL00310012607/ విజయవాడ	ఎన్.టి.ఆర్.జిల్లా, మైలవరం సబ్-రిజిస్ట్రీ, మైలవరం మండలం, మైలవరం గ్రామం, ఆర్.ఎస్.నెం.60/1సి, డోర్ నెం.18-63, అసిస్ట్ నెం.4312, విస్తీర్ణం 72.6 చదరపు గజాల నివాస స్థలం, అందులో ఎ.సి.సి. షీట్ షెడ్తో ఆంధ్రప్రదేశ్, పిన్ కోడ్-521230. తూర్పు: బోర్జగని దుర్గారావు ఇల్లు, పడమర: పంచాయతీ రోడ్డు, దక్షిణం: సింగంపల్లి తిరుమలరావు ఇల్లు, ఉత్తరం: ఉయ్యాల సత్తయ్య ఇల్లు.	16-07-2025	19-07-2025 & Rs.375446/-
2	బత్తుల నిర్మల, బత్తుల సుధాకర్, బత్తుల జైసన్, ముదు కుమార్ బాబు / NHL00310035021/ విజయవాడ	ఆర్.ఎస్.నెం.80లోని ఆర్సిసి రూఫ్ బిల్డింగ్తో సైట్ యొక్క 242 చ.గ.ల విస్తీర్ణం, అసిస్ట్ నెం.196, డోర్ నెం.1-196, నర్సుపేట, సిద్ధార్థ నగర్ గ్రామ పంచాయతీ, నూజివీడు మండలం, నూజివీడు ఎస్ఆర్ఓ, కృష్ణ జిల్లా, ఆంధ్రప్రదేశ్, పిన్ కోడ్-521201. తూర్పు: బోర్జగని దుర్గారావు ఇల్లు, పశ్చిమం: పంచాయతీ రోడ్డు, దక్షిణం: సింగంపల్లి తిరుమలరావు ఇల్లు, ఉత్తరం: ఉయ్యాల సత్తయ్య ఇల్లు.	16-07-2025	19-07-2025 & Rs.823063/-
3	దారం మాణిక్యరావు, దారం మేరిమాత, అనుమోతు సాంబశివ రావు / NLAP0031005077/ విజయవాడ	ఎన్.టి.ఆర్ జిల్లా, ఇబ్రహీంపట్నం సబ్ రిజిస్ట్రీ, ఇబ్రహీంపట్నం మండలం, జూపూడి గ్రామ పంచాయతీ ప్రాంతం, జూపూడి గ్రామం, ఆర్.ఎస్.నెం.43/14, డోర్ నెం.3-114, అసిస్ట్ నెం.359, ఆర్.సి.సి రూఫ్ట్ గ్రౌండ్ మరియు మొదటి అంతస్తు డాబాతో కూడిన 61.83 చదరపు గజాల నివాస స్థలం, ఆంధ్రప్రదేశ్, పిన్కోడ్: 521456. తూర్పు: పంచాయతీ రోడ్డు, పడమర: బనావత్ ఆదెమ్మ ఆస్తి, దక్షిణం: రెంటపల్లి చన్నయ్య ఆస్తి, ఉత్తరం: దారం గోపాలరావు ఆస్తి.	16-07-2025	19-07-2025 & Rs.1028367/-
4	నేనావత్తు త్రేవేణి, నేనావత్తు నాగరాజు/ MHL00310023449/ విజయవాడ	ఎన్టీఆర్ జిల్లా, కంచికచర్ల సబ్ రిజిస్ట్రీ, వీరులపాడు మండలం, చెన్నారావు పాలెం గ్రామ పంచాయతీ ఏరియా, చెన్నారావు పాలెం గ్రామం, ఆర్.ఎస్.నెం.15-2, డోర్ నెం.5-29, ప్రస్తుత డోర్ నెం.1-12, అసిస్ట్ నెం.12, డాబాతో కూడిన 124.6667 చదరపు గజాల విస్తీర్ణపు నివాస స్థలం, కృష్ణ, ఆంధ్రప్రదేశ్, పిన్ కోడ్:521181. తూర్పు: బాలసాని గుండమ్మ ఇల్లు, పడమర: సి.సి.రోడ్, దక్షిణం: నానావత్తు కాంతమ్మ ఇల్లు, ఉత్తరం: ఖాళీ స్థలం.	16-07-2025	18-07-2025 & Rs.519086/-
5	షేక్ ఫరీదా బేగం, షేక్ జెన్ని సయ్యద్, కాలేషా/ MHL00310001766/ విజయవాడ	కృష్ణా జిల్లా, తిరువూరు సబ్ రిజిస్ట్రీ, తిరువూరు మండలం, తిరువూరు నగర పంచాయతీ, తిరువూరు గ్రామం, ఆర్ఎస్ నెం.241/3ఏ, డోర్ నెం.18-248, బ్లాక్ నెం.18, అసిస్ట్ నెం.1146004328, విస్తీర్ణం 96.8 చదరపు గజాలలు, ఆంధ్ర ప్రదేశ్, పిన్కోడ్-521235. తూర్పు: వేల్పుల మస్తాన్ స్థలం, పడమర: సంక నాగేశ్వర రావు స్థలం, దక్షిణం: మార్గం, ఉత్తరం: షేక్ మస్తాన్ ఇల్లు.	16-07-2025	21-07-2025 & Rs.506517/-
6	గుజ్జుల సుజాత, గుజ్జుల కిరణ్ కుమార్, గుజ్జుల కిరణ్ కుమార్/ MHL00310011709/ విజయవాడ	కృష్ణా జిల్లా, కనుమోలు సబ్-రిజిస్ట్రీ, బాపులపాడు మండలం, రామన్నగూడెం గ్రామ పంచాయతీ ప్రాంతం, రామన్న గూడెం గ్రామం, ఆర్.ఎస్.నెం.3/2, డోర్నెం.1-16, విస్తీర్ణం 242 చ.గ.లు, ఆంధ్రప్రదేశ్, పిన్ కోడ్:521111. తూర్పు: పంచాయతీ రోడ్డు, పడమర: కాటూరి రాజు ఆస్తి, దక్షిణం: కాటూరి ప్రసాద్ ఆస్తి, ఉత్తరం: వర్రే అంజి బాబు ఆస్తి.	16-07-2025	21-07-2025 & Rs.509451/-
7	లింగాల రాజ సుందర్సింగ్, లింగాల రత్న కుమారి, కగ్గనాగ బాబు / NHL00310010097/ విజయవాడ	ఏలూరు జిల్లా, ఏలూరు మునిసిపల్ కార్పొరేషన్, పోనంగి గ్రామం, ఆర్ఎస్ నెం.311/1, డోర్ నెం.3-6 దగ్గర, విస్తీర్ణం 120 చదరపు గజాల నివాస స్థలం, దానిలోని ఆర్సిసి రూఫ్ట్ గ్రౌండ్ మరియు మొదటి అంతస్తు డాబా మరియు రెండవ అంతస్తులోని ఏసిసి షీట్ షెడ్, ఆంధ్రప్రదేశ్, పిన్ కోడ్: 534002. తూర్పు: మద్దుల సుబ్బమ్మ ఇల్లు, పడమర: సి.సి.రోడ్డు, దక్షిణం: లింగాల జయరాజు ఇల్లు, ఉత్తరం: సి.సి.రోడ్డు.	16-07-2025	21-07-2025 & Rs.1251736/-
8	గుంజి రమాదేవి, గుంజి నాగరాజు / MHL00310019335/ విజయవాడ	ఎన్టీఆర్ జిల్లా, నందిగామ సబ్ రిజిస్ట్రీ, జగ్గయ్య పేట మండలం, గౌరవరం గ్రామ పంచాయతీ ప్రాంతం, గౌరవరం గ్రామం, ఆర్ఎస్ నెం.216-1బి4, డోర్ నెం.2-93, అసిస్ట్ నెం. 293, విస్తీర్ణం 145.2 చదరపు గజాలు, ఆంధ్ర ప్రదేశ్-52117. తూర్పు: బడేటి వెంకట నరసయ్య స్థలం, పడమర: సి.సి.రోడ్డు, దక్షిణం: పీట్ల రమణ స్థలం, ఉత్తరం: బత్తుల అంజమ్మ ఇల్లు మరియు స్థలం.	16-07-2025	22-07-2025 & Rs.523396/-
9	కొత్తపల్లి రోజా, కొత్తపల్లి వెంకటరావు, కొత్తపల్లి గోపి, కోట గౌరి / MHL00310037811/ విజయవాడ	ఎన్టీఆర్ జిల్లా, కంచికచర్ల సబ్ రిజిస్ట్రీ, కంచికచర్ల మండలం, గొట్టుముక్కల గ్రామ పంచాయితీ ప్రాంతం, గొట్టుముక్కల గ్రామం, ఆర్ఎస్ నెం.78/2, డోర్ నెం.6-158, అసిస్ట్ నెం. 954, విస్తీర్ణం 96.8చ.గ.ల ఆర్సిసి డాబాతో కూడిన నివాస స్థలం, ఆంధ్రప్రదేశ్, పిన్కోడ్-521180. తూర్పు: పంచాయితీ సిమెంట్ రోడ్డు, పడమర: కొత్తపల్లి పుల్లయ్య ఇల్లు, దక్షిణం: దామందుల స్వామి ఇల్లు, ఉత్తరం: వీర్ల వెంకయ్య ఆస్తి.	16-07-2025	18-07-2025 & Rs.675655/-

కాబట్టి, పైన పేర్కొన్న విధంగా రుణగ్రహీతలు/సహ-రుణగ్రహీతలకు నోటీసు ఇవ్వడమేమనగా, ఈ నోటీసు ప్రచురించబడిన 60 రోజులలోపు సంబంధిత రుణగ్రహీత/సహ-రుణగ్రహీతకు ఎదురుగా పేర్కొన్న ఇక్కడ చూపిన మొత్తం బకాయిమొత్తాన్ని చెల్లించవలసిందిగా వారిని కోరడమైనది. సంబంధిత రుణగ్రహీత/సహ-రుణగ్రహీత తదుపరి వడ్డీతో పాటు మొత్తం బకాయి మొత్తాన్ని చెల్లించడంలో విఫలమైతే, పైన వివరించిన విధంగా ఎన్ఫోర్స్మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రెస్ట్ కోసం 13(4)ని తీసుకోవలసి ఉంటుంది. చట్టం మరియు ఇక్కడ రూపొందించిన నియమాల క్రింద సూచించబడిన ఇతర పద్ధతులలో నోటీసు సేవ కోసం తీసుకోబడింది. పబ్లిక్ వేలం లేదా ప్రైవేట్ ఒప్పందం ద్వారా బదిలీ కోసం నోటీసును ప్రచురించే తేదీకి ముందు ఏ సమయంలోనైనా MAHOFIN ద్వారా అయ్యేఖర్చులు, ఛార్జీలు మరియు ఖర్చులతో పాటు చెల్లించాల్సిన మొత్తం మొత్తాన్ని చెల్లించిన తర్వాత పేర్కొన్న తనఖా రీడీమ్ చేయబడుతుందని మీరు గమనించాలి. విక్రయం, SARFAESI చట్టంలోని సెక్షన్ 13(8)లో వివరించబడింది.
SARFAESI చట్టంలోని సెక్షన్-13 (13) ప్రకారం, మీరు సురక్షిత ఆస్తులను అమ్మకం, లీజు లేదా మరే ఇతర పద్ధతిలో అయినా బదిలీ చేయకుండా మరియు/లేదా వ్యవహరించకుండా నిరోధించబడ్డారని గుర్తుంచుకోండి.

తేది : 18-08-2025, ప్రదేశం : విజయవాడ
సం/- అధీకృత అధికారి, మణప్పురం హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్

జీవన సౌరభం

జీవితంలో చాలామంది గురువులు తారసపడతారు. కొందరు పాఠం నేర్పుతారు. మరికొందరు గుణపాఠం నేర్పుతారు.

మీ కోసం

ఉల్లిరసంలో దూది ముంచి ముఖంపై నల్లమచ్చలు ఉన్నచోట రాసుకుంటే ఫలితం ఉంటుంది.

రంగడు



అడవివరంలో వుండే రంగడికి ఇరవై ఏళ్లు. బాగా బద్ధకస్తుడు. చదువు అబ్బలేదు. కొడుకు పరిస్థితి చూసి రంగడి తండ్రి ఎప్పుడూ దిగులుపడేవాడు. 'అలా ఖాళీగా కూర్చునేకంటే ఏదైనా పని చేయొచ్చుకదా!' అని చెప్పేవాడు. తండ్రి పోరు పడలేక ఒక రోజు రంగడు, ఊరికి దగ్గరలోనే వున్న పట్టణం వైపు నడవసాగాడు.

అది వేసవి కావడంతో ఎండ నిప్పులు చెరుగుతోంది. గంటకు పైగా నడిచాక, బాట పక్కనున్న ఒక తోట దగ్గర అలసటతో ఆగాడు. అక్కడ బాగా నీడగా వుంది. పురుగూ పుట్రా లేదని నిర్ధారించుకున్నాక ఓ చోట పడుకుని కళ్లు మూసుకున్నాడు. ఇంతలో ఏదో బరువుగా తన మీద పడినట్టు అనిపించి ఉలిక్కిపడి లేచాడు. రంగడి మీద ఓ మామిడి పండు పడింది. అలాంటి పండును వాడు ఎప్పుడూ చూడలేదు. అది ఎరుపూ బంగారు రంగులతో, మంచి సువాసన వస్తోంది. దాన్ని ఇంటికి తీసుకెళ్లి అందరూ పంచుకుని తినాలనుకున్నాడు.

ఈలోగా బాట వెంట నాలుగు ఎడ్ల బళ్లు రావడం చూసి పక్కన నిలబడ్డాడు. పట్టణంలో వుండే ధనిక వర్తకుడు నాగయ్య కుటుంబ సభ్యులతో బంధువుల ఇంటికి పెళ్లికి వెళ్లి, తిరుగు ప్రయాణంలో వున్నాడు. నాగయ్య, రంగడి చేతిలో ఉన్న మామిడి పండును చూశాడు. అతను ఇంతవరకూ అలాంటి పండును చూడకపోవడంతో, 'ఆ పండును నాకిస్తావా? నీకు మంచి ధర ఇస్తాను' అన్నాడు రంగడితో.

డబ్బుకి ఆశపడిన రంగయ్య ఆ పండుని వర్తకుడికి ఇచ్చాడు. నాగయ్య రంగడికి డబ్బులు ఇవ్వడమే కాకుండా, తమతో తీసుకొస్తున్న సారె మిఠాయిల్ని కొన్ని ఇచ్చాడు. అంతే రంగయ్య పట్టణ ప్రయాణం మానుకుని ఇంటిముఖం పట్టాడు. ఇంకెప్పుడూ ఆ పండు గురించి రంగడు ఆలోచించలేదు.

ఆ పండుని దక్కించుకున్న నాగయ్య మాత్రం దాని టెంకను తన తోటలో నాటించాడు. అది పెరిగి పెద్దయ్యింది. మంచి కాపు వచ్చింది. ఒక్కచెట్టు కాస్త తోటంతా ఆ చెట్లతో నిండిపోయింది. రోజులు గడుస్తున్నాయి. రంగడు ముసలివాడు అయ్యాడు. తోటమాలి పని కోసం నాగయ్య దగ్గరకి పనికి వచ్చాడు.

ఆ ఏడాది పంట బాగా పండింది. కాయలు దించారు. వాటిని చూడగానే రంగడికి అది తనకి దొరికిన మామిడి పండని గుర్తుకువచ్చింది. ఆ రోజు క్షణకాలం ఆనందం కోసం ఆశపడి దాన్ని వదులుకున్నానని ఎంతో బాధపడ్డాడు. దాన్ని దక్కించుకున్న నాగయ్య ఆ పండ్లతో వ్యాపారం చేసి లాభాలు గడించడం చూసి సిగ్గుపడ్డాడు. అందివచ్చిన అవకాశాన్ని చేజేతులా నాశనం చేసుకున్నానని ఏడుస్తూ కూర్చున్నాడు. తోటని అంటిపెట్టుకుని వుండే రంగడి కష్టం చూసిన తోటలోని మామిడి చెట్లు జాలితో మంచు కన్నీటి బొట్లు రాల్చాయి.

- ఎస్.హనుమంతరావు,
88978 15656.

నేను గీసిన బొమ్మ

ఎస్.అర్షియా ఫర్వీన్,
4వ తరగతి, సెయింట్ జోసెఫ్ ఇంగ్లీష్ మీడియం స్కూలు,
వాసవి నగర్
కర్నూలు.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

మీరు పాటిస్తూ, పిల్లలకు నేర్పించాలి

మీ పిల్లలు పొద్దున్నే లేవడం లేదా? స్కూలుకు తయారుచేయాలంటే కత్తిమీద సామే అవుతోందా? ప్రతిరోజూ ఉదయం సమయానికి లేవటం ఆలస్యమవుతోందా? లేచినా దుప్పటి తీయకుండా ఇదిగో.. అదిగో అంటూ బద్ధకిస్తున్నారా? ఇది మీ ఇంట్లోనే కాదు; ఏదో ఒకసారి ప్రతి ఇంట్లో జరిగేదే! ఆందోళన పడకండి. కొన్ని జాగ్రత్తలు తీసుకోండి. కొన్ని ఉపాయాలు పాటించండి.

ప్రతి అమ్మానాన్న తమ పిల్లలకు మంచి అలవాట్లు నేర్పించాలనే అనుకుంటారు. మంచి, ఆరోగ్యకరమైన అలవాట్లను నేర్పించడం వల్ల.. వారి భవిష్యత్తు కూడా ఆరోగ్యంగా, శ్రేయస్సు కరంగా ఉంటుంది. మంచి ఆహారం తీసుకోవడం దగ్గర నుంచి.. చిన్నప్పటి నుంచే శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచుకునేలా వ్యాయామాలు చేయడం వరకు అన్నీ వారి రోజువారీ దినచర్యలో భాగమయ్యేలా తల్లిదండ్రులు చూడాలి. మంచి అలవాట్లు నేర్పిద్దామని చూస్తున్నా కొందరు పిల్లలు తొందరగా నేర్చుకోరు. ఒక వయస్సు వచ్చిన తర్వాత.. మనం పిల్లలకు ఏదైనా నేర్పించాలంటే కష్టం కావొచ్చు. కొంచెం పెద్దయిన తర్వాత పిల్లలు తమ తల్లిదండ్రుల మాట కంటే తమ ఇష్టాఇష్టాలకే ప్రాధాన్యత ఇస్తారు. ఇష్టం లేని పని చేయిస్తున్నారని అయిష్టం చూపించే అవకాశం ఉంది. కాబట్టి బాల్యంలోనే ఆరోగ్యకరమైన అలవాట్లను పరిచయం చేయాలి.

మంచి ఆహారం : 8, 9 నెలల వయసు దగ్గరి నుంచే అన్ని పోషకాలు ఉన్న పదార్థాలను పరిచయం చేయాలి. పిల్లల ఎదుగుదలకు అవసరమైన పోషకాలు లభించే ఆహార పదార్థాలను ఇవ్వాలి. ఎక్కువగా పండ్లు, కూరగాయలు, లీన్ ప్రోటీన్లు, తృణధాన్యాలు వారి ఆహారంలో అందేలా చూడాలి. జంక్‌ఫుడ్ ఇవ్వకూడదు. తల్లిదండ్రులు కూడా వాటికి దూరంగా ఉండాలి.

ఆటల్లో ప్రోత్సాహం : ఆటల్లో పాల్గొనటం ద్వారా పిల్లల్లో శారీరక, మానసిక ఆరోగ్యం దృఢపడుతుంది. శారీరక శ్రమ వల్ల కూడా మంచి మేలే జరుగుతుంది. నడక, పరుగు, ఆటలు, సైక్లింగ్, లాంగ్‌జంప్, హైజెంప్ వంటి వాటి ద్వారా కూడా శరీరం శక్తివంతంగా మారుతుంది. ప్రతి రోజూ ఏదో ఒక రూపంలో గంటసేపు వ్యాయామం అందేలా చూడాలి. తల్లిదండ్రులు చేస్తూవుంటే పిల్లలు కూడా వాటిని అనుసరిస్తుంటారు. వారితో కలిసి వ్యాయామాలు చేయడం లాంటివి చేస్తుంటే వారు కూడా ఉత్సాహం చూపిస్తారు.

-డాక్టర్ ఎ.ఎస్.కె.దుర్గ,
ప్రిన్సిపాల్,
ఎస్ఆర్ఎస్‌వి కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్, కొత్తపేట,
విజయవాడ.



సమయానికి నిద్ర : రాత్రిళ్లు పిల్లలు త్వరగా నిద్రపోయేలా ప్రోత్సహించాలి. ఆరోగ్యంగా ఎదిగేందుకు మంచి నిద్ర చాలా అవసరం. మనం వారికి ఎంత మంచి ఆహారం ఇచ్చినా, వ్యాయమాలు చేయించినా.. సరిపడా నిద్ర లేకపోతే ఆరోగ్యం లభించదు. అందుకే కనీసం 9 గంటల నిద్ర వారికి అందేలా చేయాలి. దాని కోసం రోజూ ఒకే సమయానికి వారు నిద్రపోయేలా ఏర్పాట్లు చేయాలి. నిద్రపోయే వరకూ పర్యవేక్షిస్తూ ఉండాలి. రోజూ ప్రశాంతంగా నిద్రపుచ్చి, ప్రశాంతంగా నిద్ర లేపాలి. హడావిడి చేయకూడదు.

చురుగ్గా ఉండేలా చూడాలి : పిల్లలు ప్రారంభంలో తమ తల్లిదండ్రులను గమనించి నేర్చుకుంటారు. ఆరోగ్యంగా తినడం, చురుగ్గా ఉండటం, ఒత్తిడిని సమర్థవంతంగా నిర్వహించడం ద్వారా సానుకూలంగా ఉండొచ్చు. ఒత్తిడి లేని జీవితాన్ని గడపొచ్చు. తల్లిదండ్రులు తమ ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇచ్చినప్పుడు, పిల్లలు ఆ ప్రవర్తనలను స్వీకరించే అవకాశం ఉంది.

సెల్ ఫోనుకి పరిమితులు : సాంకేతికత రోజువారీ జీవితంలో ఒక భాగమైనప్పటికీ, అధిక స్క్రీన్ సమయం పిల్లల శారీరక, మానసిక ఆరోగ్యాన్ని ప్రతికూలంగా ప్రభావితం చేస్తుంది. టీవీ, కంప్యూటర్, మొబైల్ ఏవైనా సమయాన్ని హరిస్తాయి. వాటిని ఎలా ప్రయోజనకరంగా ఉపయోగించాలో ఆచరణాత్మకంగా చూపాలి. చదవడం, ఆడటం లేదా సృజనాత్మక అభిరుచులు వంటి ప్రత్యామ్నాయ కార్యకలాపాలను ప్రోత్సహించాలి. స్క్రీన్ సమయానికి తగ్గించడానికి వారికి ఆకర్షించేలా వేరే ఆటలు ఆడించాలి. ఫిజికల్ ఎక్సర్‌సైజులను ప్రోత్సహించాలి.

పిల్లలు తప్పులు చేసినప్పుడు, వారిని క్షమించండి, మందలించకండి. మంచి అలవాట్లు నేర్చుకున్నప్పుడు, పిల్లలను ప్రోత్సహించండి, అభినందించండి. మంచి అలవాట్లు నేర్చుకోవడానికి అవసరమైన సహాయాన్ని అందించండి. అలవాట్లు నేర్పడానికి సమయం పడుతుంది, కాబట్టి సహనంతో ఉండండి.

బెదిరిస్తే భయపడతారు : పిల్లలతో ఓ స్నేహితుల్లాగ ఉండాలి. సరదాగా మాట్లాడాలి. మంచీచెడూ విషయాల గురించి చర్చించాలి. మంచి అలవాట్లను నేర్పేటప్పుడు, వాటిని సరదాగా మార్చడానికి ప్రయత్నించండి. పండ్లు, కూరగాయలు తినడం నేర్పాలి. .స్వయంగా వంట చేయడంలో సహాయపడమని ప్రోత్సహించండి. చేతులు కడుక్కోవడం, స్నానం చేయడం, దంతాలు తోముకోవడం వంటి అలవాట్లు నేర్పించండి. ఇంటిని శుభ్రంగా ఉంచడంలో సహాయపడమని ప్రోత్సహించండి.

సమయపాలన పాటించేలా : నిద్రపోయే, లేచే సమయాలను క్రమబద్ధీకరించండి. పనులను సమయానికి పూర్తి చేయమని ప్రోత్సహించండి. పెద్దలతో మర్యాదగా మాట్లాడటం నేర్పించాలి. వారితో ప్రేమగా మెలగమని ప్రోత్సహించాలి. ఇతరులతో స్నేహంగా మెలగమని ప్రోత్సహించాలి. ఒకరికొకరు సహాయం చేసుకోవడం నేర్పించాలి. దీనికోసం కొన్ని చిట్కాలు చెప్పొచ్చు. పిల్లల ముందు మీరు ఫోన్ వాడితే వారు చదువుపై శ్రద్ధ చూపలేరు. అందుకే వాళ్లు చదివే సమయంలో మీరు ఫోన్, టీవీ పక్కనపెట్టి ఒక రోల్ మోడల్‌గా ఉండండి. బహుమతులు, పనిష్మెంట్లు ఇవ్వడం కంటే ఫోకస్‌ను పెంచే అలవాట్లు నేర్పించడం ఉత్తమం.

భద్రత లేని బతుకులు...

24 క్రాఫ్ట్ కార్మికుల జీవితాలు వర్ణనాతీతం

సినిమారంగంలో ఒక సినిమా బయటకు రావాలంటే వందలాదిమంది సమిష్టి కష్టం. కొన్ని లక్షల మందికి ఉపాధిని కల్పిస్తున్న అతి పెద్ద రంగం కూడా ఇదే. ఫలితం ఎలా ఉంటుందో తెలియకుండానే నిర్మాత వందలాది కోట్ల రూపాయలతో ఆడే ఒక రిస్కీగేమ్ ఈ సినిమా. ఒక సినిమా విడుదలవ్వాలంటే ఒక్కోసారి రెండు నుంచి మూడేళ్లపాటు రక్తాన్ని, చెమటను, అంతకుమించి హార్డ్‌వర్క్‌ని ధారపోయాల్సివుంటుంది. ఆన్‌ది స్క్రీన్ హీరో శాసిస్తే, బిహైండ్ ది స్క్రీన్ డైరెక్టర్ శాసిస్తాడు. చలనచిత్రానికి సంబంధించి 24 శాఖలను సమన్వయపరిచి సమర్థవంతంగా ఆయా శాఖల నుంచి తనకు కావాల్సిన విధంగా వారి సామర్థ్యాన్ని ఉపయోగించుకుని తన ఆలోచనలకు ప్రాణం పోసి తెరపైకి ఒక దృశ్యంగా మలచే వ్యక్తే దర్శకుడు. ఓ సినిమా హిట్ అవ్వాలన్నా, ఫ్లాప్ అవ్వాలన్నా అంతా ఆయన చేతిలోనే ఉంటుంది. ఒక సినిమా రూపొందాలంటే 24 విభాగాలు పనిచేయాలి. స్టంట్-దర్శకులు, స్టంట్ -ఆర్టిస్టులు.. గూస్ బంప్స్ వచ్చే పోరాట సన్నివేశాలు, ఉత్కంఠభరితమైన సాహసాలు ఈ స్టంట్ మాస్టర్ల ఆధ్వర్యంలోనే జరుగుతాయి. వీరు తమ జీవితాలను సైతం ఫణంగా పెట్టి రిస్క్ సన్నివేశాలు చేస్తారు. ఈ కళకు శౌర్యం, దూకుడు తప్పనిసరి.



ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని...

సినీ రంగంలో స్టంట్ మాస్టర్లు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారు. సినిమా చిత్రీకరణల్లో స్టంట్స్ చేస్తున్నప్పుడు నిత్యం ప్రమాదాలు జరుగుతూనే ఉంటాయి. కథానాయకులకు డూప్‌లుగా నటించేవారు స్టంట్‌లు చేస్తున్న సమయంలో ప్రమాదాలకు గురై మృత్యువాతపడుతుంటారు. దాదాపుగా అందరి కథానాయకులకు డూప్‌లు ఉంటుంటారు. షూటింగ్‌లో స్టంట్స్ చేస్తున్నప్పుడు తగిన భద్రతా చర్యలు తీసుకోకపోవడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. నిరంతరం తీవ్ర ఒత్తిడి, తిరిగి ఇంటికి వెళ్తామో? లేదో? తెలియని ప్రమాదకరమైన స్టంట్‌లు చేసే స్టంట్ మాస్టర్లు, ఇతర సిబ్బందికి తగిన వేతనాలు లభించకపోవడం ఒక సమస్య. ప్రతిభావంతులైన స్టంట్ మాస్టర్లకు టాలీవుడ్‌లో కొదవలేదు. కానీ తగిన అవకాశాలు చాలామందికి తక్కువగానే లభిస్తున్నాయి. పనిచేసే వారిపై అధిక పని ఒత్తిడి కూడా ఉంటోంది. ప్రమాదాల్లో చనిపోవటం, గాయపడటం, కాలో, చేయి వంటివి విరిగిపోవటం వంటివి జరిగిన సమయంలో చిత్ర పరిశ్రమ ప్రత్యేక చొరవ తీసుకోవాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వాలు కూడా ఆ దిశగా రక్షణ చర్యలు చేపట్టాలి.

ఆర్ట్ డైరెక్టర్ల అవస్థలు

డైరెక్టర్ సినిమాకి సంబంధించి ప్రాపర్టీస్ చూసుకుంటారు. దర్శకుడు అభిరుచులకు తగినట్లుగా బ్యాగ్రౌండ్‌లో ఉండాల్సిన అన్ని విషయాలను ఫైనలైజ్ చేసేది ఆర్ట్ విభాగం వారే. ఈ విభాగంలో కూడా ఎంతో మంది పనిచేస్తున్నారు. దర్శకుడి ఆలోచనలకు అనుగుణంగా సెట్లు వేసే సమయంలో బడ్జెట్ ఒక్కోసారి పెరగటం, ఇంకోసారి తగ్గటం జరుగుతుంటుంది. దీనికి ఆర్ట్ విభాగం వారని కించపర్చేలా నిర్మాతలు వ్యాఖ్యానాలు చేస్తుంటారు.

డ్యాన్సర్లకు అరకొర వేతనాలే...

మిగతా కార్మికులతో పోలిస్తే డ్యాన్స్ విభాగంలో డ్యాన్సర్లకు నెలలో కేవలం 10 రోజులకు మించి పని ఉండదు. ఇచ్చే వేతనాలు కూడా అరకొరే. ఆన్‌స్క్రీన్‌లో కనిస్తామనే ఊహలో కొందరు తక్కువ పేమెంట్లకు కూడా పనిచేస్తుంటారు. ఇచ్చే మొత్తమే తక్కువ కాగా, రిహార్సల్స్ పేరుతో నాలుగైదు రోజులు సెట్లలోకి వచ్చి నిపుణత సాధించాల్సివుంటుంది. అప్పటికీ కొరియోగ్రాఫర్, నిర్మాత, దర్శకులకు నచ్చిన వారినే పనుల్లో పెట్టుకుంటుంటారు. మిగతా వారికి పనీ ఉండదు. పేమెంట్లు రావు.

ఆర్టిస్టుల అవస్థలు వర్ణనాతీతం

సినిమాల్లో నటీనటుల నటనను మనం ఎంతగా ఎంజాయ్ చేస్తామో.. వాళ్ళ వాయిసెస్‌కు కూడా మనం అలాగే మెస్మరైజ్ అవుతాం. వాళ్ళ నటన మనల్ని ఎంతలా ప్రభావితం చేసి.. వాళ్ళను గుర్తుంచుకునేలా చేస్తుందో వాళ్ళ గాత్రం కూడా మనపై అలాంటి ప్రభావమే చూపిస్తాయి. తన గాత్రాన్ని అరువు ఇచ్చే డబ్బింగ్ ఆర్టిస్టులకు కూడా కనీస వేతనాలు రావటం లేదు. చాలా సినిమాలకు పనిచేస్తున్నా పేమెంట్లు పెండింగ్ ఉంటున్నాయి. సినిమా షూటింగ్ ఫైనల్ అవుట్‌పుట్ విడుదలయ్యే వరకు దర్శకుడు సహా సినిమా యూనిట్ మొత్తం అనేక ప్రాంతాలకు ప్రయాణిస్తూ ఉంటారు. వారిని గమ్యస్థానాలకు చేర్చే డ్రైవర్లకు కూడా సరైన గుర్తింపు ఉండటం లేదు. కనీస వేతనాలు అమలు కావటం లేదు. మిగతా వారి కంటే డ్రైవర్లే ముందు బయలు దేరి వెళ్లి ఒక్కొక్కరినీ వాహనాల్లో ఎక్కించుకోవాలి. ప్రొడక్షన్ ఉమెన్ విభాగంలో మొత్తం మహిళలు మాత్రమే ఉంటారు. వీరు ప్రొడక్షన్ అసిస్టెంట్ల సూచనల మేరకు సినిమా సెట్ మొత్తాన్ని శుభ్రంగా ఉంచడం సహా సినిమాకు సంబంధించి ఇతరత్రా చిన్న పనులు చేసే వారికి కూడా అంతంతమాత్రంగా వేతనాలు అందుతున్నాయి. షఉట్ మొదలైన నుంచి పూర్తయ్యే వరకూ అన్ని పనులు చూసుకునేది ప్రొడక్షన్ ఎగ్జిక్యూటివ్‌లే. నిర్మాతల ఆదేశాల మేరకు షఉటింగ్ పనులు, కార్లు పంపించడం, భోజన వసతి, షఉటింగ్ పూర్తయ్యాక వారి ప్రాంతాలకు చేరవేసే వరకూ అన్ని బాధ్యతలు చూసే వీరు కూడా ఇబ్బందులనే ఎదుర్కొంటున్నారు. సమయానికి పేమెంట్లు రాకపోవటంతో తనపరిధిలో పనిచేయించటానికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

టెక్నికల్ స్కిల్స్ ఉన్నా సరే..!

పగలును రాత్రిగానూ, రాత్రిని పగలుగానే మార్చగలిగే లైటింగ్ కార్మికులు టెక్నిక్స్‌తో మ్యాజిక్ చేస్తూ ఉంటారు. అవసరానికి అనుగుణంగా వీరు లైటింగ్ ఫిక్స్ చేస్తూ ఉంటారు. కార్పెంటర్లు, పెయింటర్లు సెట్ తయారీదారులు స్టూడియో వర్కర్స్. వీరికి అంతంతమాత్రంగానే వేతనాలు అందుతున్నాయి. ప్రొడక్షన్ అసిస్టెంట్లుగా పనిచేసే వీరు సెట్ అసిస్టెంట్లుగా షూటింగ్ స్పాట్‌లో ఉండే అందరికీ ఆహార పదార్థాలు అందజేస్తూ ఉంటారు. కొందరు ఎగవేత పెడుతుండటంతో ఇబ్బందులు పడుతున్నారు. షూటింగ్‌లో ముఖ్యపాత్ర పోషిస్తూ నటీనటులను అందంగా తయారు చేయాలన్నా, అందంగా ఉన్న వ్యక్తిని డీగ్లామర్‌గా మార్చేది వీళ్లే. నటులను పాత్రకు తగ్గట్టుగా తీర్చిదిద్దుతున్నారు. వీరికీ అరకొర మొత్తాలే అందుతున్నాయి. దర్శకుడి అవసరానికి తగినట్లుగా నటీనటులకు దుస్తులను సిద్ధం చేసే కాస్ట్యూమ్ డిజైనర్లకు కూడా అరకొర వేతనాలు అందుతున్నాయి.

ఆడియోగ్రాఫర్లు లవ్‌స్టోరీ, హారర్, థ్రిల్లర్, యాక్షన్...జోనర్ ఏదైనా సరే సన్నివేశాన్ని బట్టి సౌండ్ ఎఫెక్ట్స్‌ను సెట్ చేస్తుంటారు. ఇలా 24 క్రాఫ్ట్‌ల పరిధిలో పనిచేసే కార్మికులు గత అగ్రిమెంట్ మేరకు తమకు వేతనం 30 శాతం పెంచాలని కోరుతూ గత కొన్ని రోజులుగా పోరుబాట పట్టిన విషయం తెలిసిందే.

ఆసిస్-ఎకు ఊరట విజయం

ఇప్పటికే సిరీస్ కైవసం చేసుకున్న భారత్

న్యూఢిల్లీ : ఆస్ట్రేలియా-ఎ మహిళల జట్టుతో జరిగిన నామమాత్రపు మూడో వన్డేలో ఆస్ట్రేలియా ఘన విజయం సాధించింది. అయితే ఈ గెలుపు ఆసీస్‌కు కంటితుడుపుగా మాత్రమే పనికొస్తుంది. మూడు మ్యాచ్‌ల ఈ సిరీస్‌ను భారత్ ఇదివరకే రెండు వన్డేలు గెలిచి కైవసం చేసుకుంది.

మూడో వన్డేలో తొలుత బ్యాటింగ్ చేసిన భారత్-ఎ జట్టు తడబడింది. ఆసీస్ బౌలర్లు తహ్లియా మెక్‌గ్రాత్ (8-0-40-3), అనిక లియారాయ్డ్ (3-0-16-2), ఎల్లా హేవర్డ్ (10-0-40-2), సియన్నా జింజర్ (8.4-0-50-2), లూసీ హ్యామిల్టన్ (10-2-34-1) సత్తా చాటడంతో 47.4 ఓవర్లలో 216 పరుగులకు ఆలౌటైంది. షెఫాలీ వర్మ (52), యస్తికా భాటియా (42) పోరాటపటిమ కనబర్చి భారత్‌కు ఈ మాత్రం స్కోరైనా అందించారు. వీరు మినహా టీమిండియాలో ఎవరూ రాణించలేదు. నందిని కశ్యప్ (28), రఘువి బిస్త్ (18), తనుశ్రీ సర్కార్ (17), కెప్టెన్ రాధా యాదవ్ (18), తనుజా కన్వర్ (15) రెండంకెల స్కోర్లు చేయగా.. తేజల్ హసబ్నిస్ (1), మిన్నూ మణి (5), సైమా ఠాకోర్ (0), షబ్నమ్ షకీల్ (7 నాటౌట్) సింగిల్ డిజిట్ స్కోర్లకే పరిమితమయ్యారు. అనంతరం స్వల్ప లక్ష్యాన్ని ఆసీస్ సునాయాసంగా ఛేదించింది. ఓపెనర్ అలిస్సా హీలీ (మిచెల్ స్టార్క్ భార్య) (84 బంతుల్లో 137 నాటౌట్, 23 ఫోర్లు, 3 సిక్సర్లు) సుడిగాలి శతకంతో ఆసీస్‌ను విజయతీరాలకు చేర్చింది. ఆమెకు మరో ఓపెనర్ తహ్లియా విల్సన్ (59), రేచల్ ట్రెనామన్ (21 నాటౌట్) సహకరించారు. ఈ మ్యాచ్‌లో ఓడినా భారత్ 2-1 తేడాతో సిరీస్‌ను కైవసం చేసుకుంది. దీనికి ముందు ఇరు జట్ల మధ్య జరిగిన మూడు మ్యాచ్‌ల టి-20 సిరీస్‌ను ఆసీస్ 3-0 తేడాతో గెలుచుకుంది. టి-20ల్లో ఎదురైన పరాభవానికి భారత్ వన్డేల్లో ప్రతీకారం తీర్చుకుంది. ఇరు జట్ల మధ్య ఏకైక టెస్ట్ మ్యాచ్ ఆగస్టు 21 నుంచి ప్రారంభం కానుంది. ఈ మల్టీ ఫార్మాట్ సిరీస్ కోసం భారత జట్టు ఆస్ట్రేలియాలో పర్యటిస్తుంది.

అల్కరాస్, సినర్ సై

సిన్సినాటి ఓపెన్ ఫైనల్లో ఢీకి రంగం సిద్ధం

సెమీస్‌లో టాప్ అథ్లెట్ల అలవోక విజయాలు

సిన్సినాటి (యుఎస్ఏ) : వరల్డ్ నం.1 జానిక్ సినర్ (ఇటలీ), వరల్డ్ నం.2 కార్లోస్ అల్కరాస్ (స్పెయిన్) మరో మహాపోరుకు సిద్ధమయ్యారు. మరో పది రోజుల్లో యు.ఎస్ ఓపెన్ టైటిల్ రేసులో తాడోపేడో తేల్చుకోనున్న సినర్, అల్కరాస్.. అంతకుముందు సిన్సినాటి ఓపెన్‌లో సమరానికి సై అంటున్నారు. పురుషుల సింగిల్స్ టైటిల్ పోరులో సినర్, అల్కరాస్ పోటీపడుతున్నారు. ఆదివారం జరిగిన మెన్స్ సింగిల్స్ సెమీఫైనల్స్‌లో జానిక్ సినర్, కార్లోస్ అల్కరాస్ అలవోక విజయాలు సాధించారు. మరోవైపు మహిళల సింగిల్స్ సెమీఫైనల్స్‌లో ఎలెనా రిబకినా (రష్యా), ఇగా స్వైటెక్ (పోలాండ్).. వెరోనికా (రష్యా), జాస్మిన్ పావొలిని (ఇటలీ) ఫైనల్లో చోటు కోసం అమీతుమీ తేల్చుకోనున్నారు.

అలవోక విజయాలతో.. :

పురుషుల సింగిల్స్ సెమీఫైనల్లో వరల్డ్ నం.1, టాప్ సీడ్ జానిక్ సినర్ (ఇటలీ) వరుస సెట్లలో అలవోక విజయం సాధించాడు. 7-6(7-4), 6-2తో అన్‌సీడెడ్ ఫ్రాన్స్ ఆటగాడు, క్వాలిఫయర్స్ నుంచి సెమీస్‌కు చేరుకున్న టెరెన్స్ అట్మానెపై సినర్ గెలుపొందాడు. వింబుల్డన్ చాంపియన్‌కు తొలి సెట్లో టెరెన్స్ గట్టి పోటీ ఇచ్చాడు. క్వాలిఫయర్స్ నుంచి వచ్చిన టెరెన్స్ దూకుడుతో తొలి సెట్ ట్రైబ్రేకర్‌కు వెళ్లింది. ట్రైబ్రేకర్‌లో 7-4తో పైచేయి సాధించిన సినర్.. అదే జోరు రెండో సెట్లోనూ కొనసాగించాడు. 6-2తో అలవోకగా విజయం సాధించి ఫైనల్‌కు చేరుకున్నాడు. ఆరు ఏస్‌లు, రెండు బ్రేక్ పాయింట్లతో మెరిసిన సినర్ పాయింట్ల పరంగా.. 68-50తో పైచేయి సాధించాడు. 9 ఏస్‌లు కొట్టిన టెరెన్స్.. ఒక్క బ్రేక్ పాయింట్ కూడా సాధించలేదు. తొలి సెట్లో ఆరు సార్లు సర్వ్ నిలుపుకున్న టెరెన్స్ రెండో సెట్లో తేలిపోయాడు. రెండో సెట్లో రెండు సార్లు టెరెన్స్ సర్వ్ బ్రేక్ చేయటంతో పాటు తన సర్వ్‌లో వరుస గేములు గెలుపొందిన సినర్ తనదైన జోరు చూపించాడు.

మెన్స్ సింగిల్స్ మరో సెమీఫైనల్లో వరల్డ్ నం.2 కార్లోస్ అల్కరాస్ (స్పెయిన్) 6-4, 6-3తో వరల్డ్ నం.3 అలెగ్జాండర్ జ్వెరెవ్ (జర్మనీ)పై గెలుపొందాడు. కెరీర్ భీకర ఫామ్‌లో ఉన్న అల్కరాస్ వరుస సెట్లలోనే లాంఛనం ముగించాడు. మూడు ఏస్‌లు, ఓ బ్రేక్ పాయింట్‌తో జ్వెరెవ్ రాణించగా.. 11 ఏస్‌లు, 4 బ్రేక్ పాయింట్లతో అల్కరాస్ మెరిశాడు. పాయింట్ల పరంగా 66-46తో అల్కరాస్ ఆధిపత్యం చూపించాడు. ఓవరాల్‌గా అల్కరాస్ 12 గేమ్‌లు గెలుపొందగా.. జ్వెరెవ్ ఏడు గేమ్‌లు నెగ్గాడు.

బాబర్, రిజ్వాన్‌పై వేటు

- ఆసియా కప్‌కు పాకిస్తాన్ జట్టు ఎంపిక

లాహోర్: ప్రతిష్టాత్మక ఆసియాకప్‌కు పాకిస్తాన్ క్రికెట్ బోర్డు(పీసీబీ) 17 మందితో కూడిన జట్టును ఆదివారం ప్రకటించగా.. ఆ జట్టు స్టార్ ఆటగాళ్లు బాబర్ ఆజామ్, మహ్మద్ రిజ్వాన్‌లపై సెలక్షన్ కమిటీ వేటు వేసింది. ఆసియాకప్‌తో పాటు యూఏఈ, అఫ్గానిస్థాన్‌తో జరిగే ముక్కోణపు టీ20 సిరీస్ కోసం టీమ్‌ను సెలక్షన్ కమిటీ ఎంపిక చేసింది. ఫామ్ కోల్పోయి జట్టుకు భారంగా మారిన మాజీ కెప్టెన్లు బాబర్ ఆజామ్, మహమ్మద్ రిజ్వాన్‌కు సెలెక్టర్లు మొండిచేయి చూపారు. సల్మాన్ అగా కెప్టెన్‌గా వ్యవహరించనుండగా.. షాహిన్ షా అఫ్రిదీ, మహమ్మద్ వసీం, సల్మాన్ మీర్జా జట్టులో చోటు నిలుపుకున్నారు.

అనహత్‌కు గాయం

- రన్నరప్ టైటిల్‌తో సరి

బెగా(ఆస్ట్రేలియా): ఎన్ఎస్‌డబ్ల్యూ స్క్వాష్ బెగా ఓపెన్‌లో భారత యువ ప్లేయర్ అనాహత్ సింగ్ రన్నరప్‌గా నిలిచింది. ఆదివారం జరిగిన మహిళల సింగిల్స్ ఫైనల్ సందర్భంగా గాయపడ్డ అనాహత్ అర్ధాంతరంగా తప్పుకోవాల్సి వచ్చింది. ఈజిప్టుకు చెందిన రెండో సీడ్ హబిబా హనీతో తుది పోరులో 1-2తో (9-11, 11-5, 11-8, 10-4)తో వెనుకంజలో నిలిచిన క్రమంలో అనాహత్ గాయపడింది. వరల్డ్ ఈవెంట్ ఫైనల్లో తొలిసారి బరిలో నిలిచిన అనాహత్ తొలి గేమ్‌ను 11-9తో కైవసం చేసుకుని దూకుడు చూపించింది. పుంజుకున్న హనీ 11-5, 11-8తో రెండు గేమ్‌లు కైవసం చేసుకుంది. టైటిల్ పోరుకు ముంగిట వరుస మ్యాచుల్లో అనహత్ సింగ్ అద్భుత ప్రదర్శనతో ఆకట్టుకున్న సంగతి తెలిసిందే.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68